www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 15 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ మాఘ శుద్ధ నవమి
30 జనవరి - 05 ఫిబ్రవరి 2023
వెల : ₹15/-

## మరో విజయమే లక్ష్యంగా 'కమలం' సంకల్పం




## ఖలిస్తాన్ కుంపటిని ఇంకా రాజేయకండి!



కేసీఆర్ భారత రాష్ట్ర సమితి

# బలమా? భారమా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# వావ్.. వాగీర్!

ఆత్మ నిర్భర్ భారత్ నినాదం, దాని ఫలితాలు మరొకసారి దేశం గర్వించేటట్టు చేశాయి. జనవరి 23న ఐదో కల్వరి తరగతి జలాంతర్గామి భారత నౌకాదళంలో భాగమైంది. దీనిని పూర్తిగా భారతీయ పరిజ్ఞానంతో రూపొందించారు. అంతేకాదు, ఇంతరకు తయారైన అన్ని జలాంతర్గాముల కంటే తక్కువ సమయంలోనే దీని నిర్మాణం పూర్తి చేయగలిగారు. ఈ జలాంతర్గామిని మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ముంబై) రూపొందించింది. దీనికి వాగీర్ అని పేరు పెట్టారు.

ఈ జలాంతర్గామికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.

వాగీర్‌ను సముద్రం ఒడ్డున, సముద్ర మధ్యలో కూడా మోహరించవచ్చు. ప్రస్తుతం దేశానికీ, మన నౌకాదళానికీ ఉన్న అవసరాలు ఇది తీర్చగలదు. అందుకే దీనిని ఆత్మ నిర్భర్ భారత్ ప్రస్థానంలో చాలా ప్రత్యేకమైన అడుగుగా కీర్తిస్తున్నారు.

స్కార్పీన్ డిజైన్‌తో ప్రాజెక్ట్ 75 కింద వాగీర్‌ను నిర్మించారు. ఈ పథకం కింద మొత్తం ఆరు జలాంతర్గాములు నిర్మిస్తున్నారు. వాటిలో నాలుగు కల్వరి తరగతి జలాంతర్గాములను నౌకాదళానికి అప్పగించారు.

వాగీర్ పేరుతో నవంబర్, 2020లో దీని నిర్మాణం మొదలు పెట్టారు. ఇంతవరకు తయారు చేసుకున్న జలాంతర్గాములలో తక్కువ సమయంలో నిర్మించినది ఇదే కావడం విశేషం. దీనిని నౌకాదళానికి అప్పగించే ముందు 20 పర్యాయాలు పరీక్షించారు. నీళ్లపైన, జలాంతర్గాములతో కూడా దీనితో యుద్ధం చేయవచ్చు. అలాగే నిఘా అవసరాలు, పాతరలు కనిపెట్టడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.





# కనులకు విందు.. కేస్లాపూర్ జాతర

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా జాతర వైభవంగా జరిగింది. రాష్ట్రంలో రెండవ అతి పెద్దదైన ఈ జాతర గోండులకు, ఇతరులకు ఆత్మీయ పలకరింపునకు వేదిక. అయిదు రోజుల జాతరలో భాగంగా పుష్య అమావాస్య (జనవరి 21) రాత్రి పదిన్నర గంటలకు మెస్రం వంశీయుల తమ ఆచారం ప్రకారం మహాపూజలు నిర్వహించారు. అంతకు ముందు ఇచ్చోడ మండలం సిరికొండలోని గుగ్గిళ్ల వంశీయుల నుంచి సేకరించిన కొత్త కుండలతో (వీటికి సిరికొండ కుండలని పేరు) గోదావరి జలాలను తెచ్చి, నాగోబాకు అభిషేకం నిర్వహించారు. ఆ రోజున నాగోబా పడగవిప్పి నాట్యమాడతాడని వారి విశ్వాసం. మహిళలు ప్రత్యేకంగా 22 పొయ్యిలు ఏర్పాటు చేసి మహాపూజకు నైవేద్యం తయారు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గఢ్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వచ్చారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా, బీజేపీ ఎంపీలు బండిసంజయ్, సోయం బాబూరావు నాగోబాకు హారతి ఇచ్చారు.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

**జ**ర్నలిజానికి జాత్యహంకారం అనే తెగులును తగిలించిన ఘనతను బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌కు కట్టబెట్టడానికి ప్రపంచం దాదాపు సిద్ధమైంది. బీబీసీ పేరుతో ప్రసిద్ధమైన ఈ వార్తా ప్రసార సంస్థ తాజాగా తయారు చేసిన 'ఇండియా: ది మోదీ క్వశ్చిన్' అనే రెండు భాగాల డాక్యుమెంటరీ తీట వ్యవహారం చూస్తే జాత్యహంకారపు జబ్బుతో బీబీసీ నిర్వాహకుల బుద్ధి ఎంత పుచ్చిపోయిందో అర్ధమవుతుంది. 2002 నాటి గుజరాత్ కల్లోలానికి ప్రధాని నరేంద్ర మోదీని బాధ్యుడిని చేసేసి, భారతీయ ముస్లిం మతోన్మాదులకూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారత వ్యతిరేక ఉదారవాదులకూ ఆయుధం అందించడం దీని ఉద్దేశమని తెలిసిపోయింది. ఎలాగంటే, భారత్‌లో ఎప్పుడు ఎన్నికల నగారా మోగినా ఇలాంటి నీతిమాలిన పంచాయతీని తెరవడం రివాజైపోయింది. ఈ సంవత్సరం జరుగుతున్న పలు శాసనసభల ఎన్నికలనీ, వచ్చే ఏడాది జరగబోయే సాధారణ ఎన్నికలనీ కూడా ప్రభావితం చేసేయవచ్చునని ఇలా హిందూ ముస్లిం విద్వేషాలను రెచ్చగొట్టే పని పెట్టుకుంది బీబీసీ. నిజానికి ఇదేదో డాక్యుమెంటరీ వివాదం అనిపించవచ్చు కానీ, చాలా విష పరిణామాలను ఆశించే బీబీసీ దీనిని ప్రపంచం మీదకు తోలింది.

బీబీసీ తన వలసవాద దుర్నీతిని ఎప్పుడూ వదులుకోలేదు. భారత్ విషయానికి వస్తే దానికి జాత్యహంకారం జతకూడుతుంది. అసలు ఈ డాక్యుమెంటరీని ఎవరో ప్రైవేటు వ్యక్తులు డబ్బులు ఇస్తే అత్యంత వివక్షాపూరితంగా బీబీసీ రూపొందించిందన్నారు, న్యూజిలాండ్‌లో భారత మాజీ దౌత్యవేత్త భాస్వతి ముఖర్జీ. ఇందులో వాస్తవికతే లేదని బంగ్లాదేశ్‌లో భారత రాయబారిగా పనిచేసిన వీణా సిక్రీ చెప్పారు. గోధ్రా తదనంతర కల్లోలంలో నరేంద్ర మోదీ నిర్దోషి అని నిర్ద్వంద్వంగా చెబుతూ భారత సమున్నత న్యాయస్థానం ఇచ్చిన 452 పేజీల తీర్పును ఘనత వహించిన ఆ వార్తాసంస్థ ఎలా విస్మరించిందని ఆ ఇద్దరూ ప్రశ్నిస్తున్నారు. అసలు ఇలాంటి డాక్యుమెంటరీ రూపొందించి తన విలువను తానే పాతాళంలో పడేసుకుందన్న విమర్శ వెల్లువెత్తుతున్నది. రుషి సూనక్ ప్రధాని కావడం పట్ల ఉన్న

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ మాఘ శుద్ధ నవమి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం
కేసీఆర్ భారత రాష్ట్ర సమితి
**బలమా? భారమా?**
8లో



మహిళ
**వనితా సేనతో శాంతి స్థాపన**
14లో



6
ధారావాహిక నవల
**వరాహమిహిర**
- పాలంకి సత్య
20లో

# జాగృతి

## సంపాదకీయం

జాత్యహంకార జనిత వ్యతిరేకతను కక్కెయ్యడానికి బీబీసీ ఇలాంటి దొడ్డి తోవను ఎంచుకుని ఉండవచ్చునన్న అనుమానాలు కూడా ఉన్నాయి. భారత వ్యతిరేక దుమారం లేపి ప్రస్తుతం మన దేశానికి ఇంగ్లండ్‌తో ఉన్న సత్సంబంధాలను చెడగొట్టాలన్న పెద్ద కుట్రే బీబీసీ చేసిందన్న వీణా సిక్రీ అంచనా వాస్తవికమైనదే. ఇంగ్లండ్‌లో ఇప్పటికీ కొన్ని వర్గాలు పటిష్ట భారత్, బలమైన ప్రధాని అన్న ఊహను కూడా భరించలేకున్నాయని రక్షణ వ్యవహారాల నిపుణుడు పీకే సెహెగల్ వ్యాఖ్యానించారు. ఇలా భారత విశ్రాంత న్యాయమూర్తులు, ఉన్నతోద్యోగులు, మాజీ సైనికాధికారులు, ఇతర ప్రముఖులు మొత్తం 300 మంది బీబీసీ మురికి

## బీబీసీ 'చెత్త'

మీద కాండ్రించి ఉమ్మారు. ఈ డాక్యుమెంటరీని ప్రపంచం మీదకు వదిలిన వేళ ఎలాంటిదో సాక్షాత్తు బ్రిటిష్ ఎంపీ లార్డ్ రమి రేంజర్ (ప్రభువుల సభ) నేరుగా బీబీసీకే చెప్పి, గడ్డి పెట్టారు. ఉమ్మడి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ఇరుదేశాలు కసరత్తు చేస్తున్న కాలంలో, భారత్ జీ 20 అధ్యక్ష స్థానంలోకి వచ్చిన తరుణంలో, భారతీయ మూలాలు ఉన్న నేత ఇంగ్లండ్ ప్రధాని అయిన సమయంలో ఈ డాక్యుమెంటరీని మీరు వదిలిపెడితే దీని పరమార్థమేమిటో లోకానికి తెలియదని అనుకోవద్దంటూ బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీకి రేంజర్ లేఖ రాశారు. ఇప్పటికే ఇంగ్లండ్‌లో హిందువులకీ, ముస్లింలకీ నడుమ పెరిగిపోయిన ఉద్రిక్తతలని గుర్తెరిగి రెండో భాగాన్ని నిలిపివేయవలసిందని కూడా ఆయన సూచించారు. అసలు బీబీసీలో పనిచేస్తున్న పాకిస్తాన్ మూలాలు ఉన్నవారే ఈ 'చెత్త' డాక్యుమెంటరీ నిర్మాణం వెనుక ఉన్నారన్నా ఆశ్చర్యపోనక్కరలేదని కూడా రేంజర్ కుండబద్దలు కొట్టారు. ఇలాంటి డాక్యుమెంటరీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్నీ, ఒక దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునీ కూడా అపహాస్యం చేస్తున్న సంగతి ఎందుకు పట్టడం లేదని ఆయన నిలదీశారు.

అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ వీసీ తారిక్ మన్సూర్ బీబీసీ వైఖరిని ఖండిస్తూ ప్రయోగించిన మాట అనివార్యంగా బ్రిటిష్ జాతి గత నిర్వాకాల మీదకు అందరి దృష్టినీ మళ్లించింది. ఇంగ్లిష్ వాళ్లు 'వైట్ మీడియాస్ బర్డెన్' భావన నుంచి బయటపడితే మంచిదన్నారాయన. ఇది రడ్యార్డ్ కిప్లింగ్ వంటి కరుడగట్టిన నాటి తెల్లతోలు జీవుల భ్రమలలోని 'వైట్ మ్యాన్స్ బర్డెన్' భావనకు వెక్కిరింత. ఈ ప్రాచ్య జనాభాని ఉద్ధరించే గురుతర బాధ్యత వెతికి వెతికి మరీ తమకే భగవంతుడు కట్టబెట్టాడని వాళ్ల పొగరు.

జలియన్‌వాలా బాగ్ రక్తపాతానికి కారణమైన జాతికి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్తాసంస్థ గోధ్రా అల్లర్ల గురించి వేలెత్తి చూపితే, అది నాగరికులకి ఎంత జుగుప్సాకరంగా ఉంటుందో దానికి అర్థంకాలేదేమి! వలసల పేరుతో తెగలకి తెగలనే దుంపనాశనం చేసిన దుర్మార్గపు జాతికి చెందిన వార్తాసంస్థ గోధ్రా గురించి రచ్చ చేయడంలోని నీచత్వం ప్రజలకి అర్థంకాకుండా ఉంటుందా? కానీ మందులేని రుగ్మతతో ఉన్న శ్వేతజాతి మాటలనే వల్లిస్తూ మన సుప్రీంకోర్టును అవమానిస్తున్న కాంగ్రెస్, టీఎంసీ ఇతర విపక్షాల ధోరణి బీబీసీ నీచత్వాన్ని తలదన్నే రీతిలో లేదా! ఆ డాక్యుమెంటరీని సెన్సార్ చేస్తారా అంటూ మొరుగుతున్న కాంగ్రెస్ పార్టీ, అత్యవసర పరిస్థితి కాలంలో 'కిస్సా కుర్సీకా', 'ఆంధీ' వంటి సినిమాలను ఏం చేసింది? నిన్నగాక మొన్న 'ది కశ్మీర్ ఫైల్స్' సినిమా పేరు విని ఎందుకు అంత గింజుకుంది? సిక్కుల మారణకాండ నేపథ్యంతో ఢిల్లీ ఫైల్స్ సినిమా నిర్మిస్తామంటే ఈ పార్టీ ఎందుకు తల్లడిల్లిపోయింది? ఎంత కాకిగోల చేసినా వీళ్లెవరూ చరిత్రను ఏమార్చలేరు. ఎన్ని డాక్యుమెంటరీలను వండి వార్చినా గోధ్రా వాస్తవం మారదు. మోదీ కీర్తికి బురద అంటదు. ★


30 జనవరి 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




కథ

**ధార్మిక**

– డాక్టర్ కనుపూరు శ్రీనివాసులు రెడ్డి





ప్రాంతీయ పార్టీలతో అభివృద్ధి అసాధ్యం! (ఆంధ్రప్రదేశ్) – 16
సంక్షోభం.. స్వయంకృతాపరాధం (అంతర్జాతీయం) – 24
ఇకనైనా బుద్ధి మార్చుకుందాం! (చర్చ) – 26
మూలమూలన విముక్తి పోరాటమే! (స్వాతంత్ర్య అమృతోత్సవాలు) – 36


**సవరణ:** 2023, జనవరి 16–22 సంచిక ముఖాముఖీలో ఆచార్య ఎస్.వి. శేషగిరిరావు కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పొరపాటున ప్రచురితమైంది. శేషగిరిరావు కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్. పొరపాటుకు చింతిస్తున్నాం.

**భారత రాష్ట్ర సమితి. నిన్నామొన్నటిదాకా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సాగించి అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి. ఇప్పుడు జాతీయ పార్టీ. ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఒకరకంగా బలప్రదర్శన కోసం రూపకల్పన చేసిన బహిరంగసభ. మరీ ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి సవాల్ విసరడమే ధ్యేయంగా సాగిన సభ.**



వాస్తవానికి తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయం నుంచి ఖమ్మం జిల్లాలో విభజన ఆకాంక్షలు మిగతా ప్రాంతంతో పోలిస్తే చాలా తక్కువ. ఖమ్మం జిల్లా.. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉంటుంది. అంతేకాదు.. ఏపీ కోస్తా ప్రాంత ప్రజలతో ఖమ్మం జిల్లా ప్రజలకు సంబంధాలు ఎక్కువ. ఏపీ కేంద్రమైన విజయవాడ.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ కన్నా దగ్గర. అక్కడి ప్రజలకు సరిహద్దుగా ఆంధ్రప్రదేశ్ జిల్లాలే ఉండటం, సంబంధాలు ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష విషయంలోనూ సెంటిమెంట్ బలంగా కనిపించలేదు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత అంతటా టీఆర్ఎస్ మెజార్టీ సాధించగా.. ఖమ్మం జిల్లాలో మాత్రం ఇతర పార్టీలు గెలిచాయి. ఎన్నికల తర్వాత ఇతర పార్టీల ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌వైపు



ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతంగా చేశారు. సొంతంగా టీఆర్ఎస్ పార్టీ గెలుపు మిగతా పార్టీలతో నువ్వా? నేనా? అన్న స్థాయిలోనే ఉంటుంది.

టీఆర్ఎస్ బ్యానర్ మీద తెలంగాణలో ఎక్కడ సభ నిర్వహించినా.. భారీ స్పందన వస్తుంది. ప్రత్యేక తెలంగాణ భావన ప్రస్ఫుటిస్తుంది. కానీ, భారత రాష్ట్ర సమితి బ్యానర్ మీద అదే తెలంగాణలో ఖమ్మం మినహా ఎక్కడ సభ నిర్వహించినా అంతర్గతంగా తెలంగాణ ఫ్లేవర్ ఉంటుంది. అందుకే బీఆర్ఎస్ బ్యానర్‌పై కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభకు ఖమ్మం వేదికయింది. జన సమీకరణలో విజయం సాధించారు.

తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ వ్యూహాలు ప్రత్యర్థుల అంచనాకు అందవనేది మొదటినుంచీ ఉన్న వాదన. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఆయన మాటల్లో, చేతల్లో, వ్యవహారశైలిలో పోలిక లేకపోయినా.. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనకున్న ఇమేజ్‌ను పదిల పర్చుకోవడానికి కారణం ఆయన రాజకీయ వ్యూహాలే. టీఆర్ఎస్ పార్టీ పేరుతో ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహించడానికి వెనుకంజ వేసిన కేసీఆర్.. జాతీయ రాజకీయాల నినాదంతో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత ఖమ్మం వేదికగా మొదటి బహిరంగ సభకు ప్రణాళిక వేశారు. వేర్పాటువాదాన్ని పక్కన పెట్టినట్లు సంకేతాలు ఇచ్చారు.

బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత జరిగిన మొట్ట మొదటి సభ ఇది. భారతీయ జనతాపార్టీకి జాతీయ స్థాయిలో ఏకైక ప్రత్యామ్నాయ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ప్రకటించిన కేసీఆర్ ఆ దిశగా వ్యూహాత్మకంగా పావులు కదిపారు. జాతీయస్థాయిలో పలువురు నేతలను ఖమ్మం తీసుకువచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ఆ నేతలను భాగం చేశారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులతో శెభాష్ సీఎం కేసీఆర్ అని బహిరంగసభలో ప్రశంసలు దక్కించుకున్నారు.

కేసీఆర్ టీఆర్ఎస్ అధినేతగా ఇన్నాళ్ల పాటు చేసిన వ్యాఖ్యలు, ప్రసంగాలు, తోటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో పెట్టుకున్న విభేదాలను, అప్పుడు చేసిన విమర్శలను ఖమ్మం జిల్లా బహిరంగసభలో పక్కనపడేశారు. తన ప్రసంగం శైలిని పూర్తిగా మార్చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విషయం కాకుండా సభ నిర్వహించిన కారణంగా ఒక్క ఖమ్మం జిల్లాకే వరాల జల్లు కురిపించారు. ఆ తర్వాత జాతీయ స్థాయి అంశాలను ప్రస్తావించారు. ఇదే సమయంలో రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో నెలకొన్న సమస్యలను గురించి ప్రస్తావన చేయలేదు. వాటి గురించిన ప్రసంగానికి స్థానం కల్పించలేదు. అంతేకాదు.. అత్యంత వ్యూహాత్మకంగా అలాంటి అంశాల గురించి జనంలో ఆలోచన రాకుండా.. జాతీయ స్థాయి నేతలతో జాతీయస్థాయి ప్రసంగాలు

# పరువు నిలి

చేయించారు.

ఖమ్మం సభ మీద తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఈ సభ ద్వారా కేసీఆర్ ఆశించిన లక్ష్యం ఏ మేరకు సాధించారో తెలీదు కానీ, రాష్ట్ర వ్యాప్తంగా టాక్ ఆఫ్ ద టౌన్ గా నిలపగలిగారు. వారం రోజుల ముందు నుంచీ ప్రచారాన్ని మోతెక్కించటం ద్వారా ఆశించిన స్థాయిలో ఉత్కంఠ సృష్టించగలిగారు. సభను సూపర్ హిట్ చేసుకొన్నామంటూ బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారు.

ఖమ్మం జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు ఆయా రాష్ట్రాలకు చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ముగ్గురు ముఖ్యమంత్రులు, ఒక మాజీ ముఖ్యమంత్రి ఈ సభలో పాల్గొన్నారు. వాళ్ల రాకతో బీఆర్ఎస్‌తో ఇతర రాష్ట్రాల పార్టీలతో మైత్రి ఉందన్న సంకేతాలు జనంలోకి వెళ్లేలా కేసీఆర్ జాగ్రత్తపడ్డారు. కానీ, ఇక్కడే మరో అంశం ఉంది. కేసీఆర్ మొదటినుంచీ తమ మిత్రులుగా చెబుతున్న.. ప్రత్యేక కూటమి పెడితే తమతో కలిసి వస్తారని చెప్పుకున్న ఆయా ముఖ్యపార్టీల నేతలు మాత్రం ఈ సభకు హాజరు కాలేదు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు

సుజాత గోపగోని, 6302164068




# పిన పరాయి నేతలు

ముఖ్యమైన నాయకులు గైర్హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రానే రాలేదు. పక్క రాష్ట్రం ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు పిలుపే లేదని చెప్పారు. మొదటి నుంచి ఆప్త మిత్రుడుగా ఉన్న కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కూడా ఈ బహిరంగ సభకు దూరంగా ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు కేసీఆర్. 14ఏళ్ల పాటు ఉద్యమాలు నిర్వహించిన కేసీఆర్ తెలంగాణ సాధించుకున్నారు. రాష్ట్ర విభజన జరిగిన మొదటి ఎన్నికల్లోనే అధికారంలోకి వచ్చి కొత్త రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. నాలుగేళ్ల పాలన తర్వాత హఠాత్తుగా ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. 2018లో జరిగిన ఎన్నికల్లో తిరుగులేని ఘన విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మళ్లీ నాలుగేళ్ల పాలన తర్వాత మొన్న విజయదశమి రోజున తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చారు. ఇకపై జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తామని చెప్పుకొచ్చారు. జాతీయ పార్టీని ప్రకటించినపుడు ఆ కార్యక్రమానికి కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమార స్వామి వచ్చారు. కేసీఆర్ ప్రత్యేకంగా కుమార స్వామిని తెలంగాణకు ఆహ్వానించారు.

టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మారుస్తూ రూపొందించిన ప్రతిపాదన పత్రంపై కేసీఆర్ సంతకం చేసి ఎన్నికల సంఘానికి పంపే రోజున కుమార స్వామితో తన అనుబంధం గురించి భావోద్వేగంతో మాట్లాడారు. ఈ ఏడాది జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాము జేడీఎస్‌తో కలిసి పని చేస్తామన్న కేసీఆర్ కుమారస్వామిని ముఖ్యమంత్రిని చేయడమే తన లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ మొదట అడుగు పెట్టబోయేది కన్నడ గడ్డపైనే అని ప్రచారం కూడా చేశారు. అయినా కుమారస్వామి కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆవిర్భావ సభకు రాలేదు. ఇతరత్రా సమస్యలు ఉన్నా కనీసం జేడీఎస్ నుండి వేరే ప్రతినిధులనైనా పంపేవారు. కానీ ఎవ్వరూ రాలేదంటే అర్థం ఏంటని ప్రశ్నిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. బీఆర్ఎస్–జేడీఎస్‌ల స్నేహబంధం కొద్ది రోజులకే వాడి పోయిందా? అని నిలదీస్తున్నారు.

బీఆర్ఎస్ పార్టీని స్థాపించిన తర్వాత ఎన్నికల సంఘం దానికి అనుమతిని ఇచ్చిన తర్వాత ఢిల్లీలో కార్యాలయాన్ని ప్రారంభించారు కేసీఆర్. ఆ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రాలేదు. ఖమ్మం సభకు మాత్రం కేజ్రీవాల్‌తో పాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, కేరళ ముఖ్య మంత్రి పినరయి విజయన్ వచ్చారు. ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ కూడా వచ్చారు. అయితే ఈ కొత్త మిత్రులతో బీఆర్ఎస్ అనుబంధం ఎంతకాలం ఉంటుంది? అన్నది ప్రశ్న. బలమైన ముఖ్యమంత్రులుగా పేరున్న మమతా బెనర్జీ, నితీశ్ కుమార్, స్టాలిన్ వంటి వారు ఇటువైపు తొంగిచూడలేదు. అలాగే తనకు సన్నిహితంగా ఉంటున్న శరద్‌పవార్, ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ వంటివారు హాజరు కాకపోవడం కేసీఆర్‌కు కాస్త ఆశాభంగమే. కాంగ్రెస్ మిత్రపక్షాలు డీఎంకే, శివసేన, జార్కండ్ ముక్తి మోర్చా పక్షాల నేతల రాకను ఎవరూ ఊహించలేదు. కానీ, బీఆర్ఎస్ మిత్ర పక్షం ఎంఐఎం అధినేత ఒవైసీని ఎందుకు ఆహ్వానించలేదన్న ప్రశ్న వస్తోంది. ఆయన హాజరైతే కొన్ని పార్టీలకు ఇబ్బందిగా ఉంటుందని భావించారేమో తెలియదు. ఇటువంటి పార్టీల మద్దతు లేకుండా దేశవ్యాప్తంగా రాజకీయాలను ప్రభావితం చేయటం ఎంత వరకు సాధ్యం అన్నది ప్రశ్న.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని ఖమ్మం సభలో ప్రధాన వక్తలు ధీమాగానే చెప్పారు. ఉపన్యాసాలు ఘాటుగా ఉన్నా, వీళ్ల మాత్రమే జమ అయితే బీజేపీని ఓడించగలరా? అన్న సందేహ ముంది. వచ్చే ఎన్నికలలో మీరు (బీజేపీ) ఇంటికి, మేము ఢిల్లీకి అంటూ కేసీఆర్ మాట్లాడినా.. అది ఎలాగో వివరించలేదు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను దేశం అంతటా విస్తరిస్తామని మాత్రం ప్రకటించారు.

దళితబంధు పది లక్షల రూపాయల స్కీమ్‌ను ఏటా 25 లక్షల మందికి అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే తాము కేంద్రంలో అధికారంలోకి రాగానే వర్తింప చేస్తామని చెప్పారు. అంటే ఒక్కొక్కరికి పది లక్షల రూపాయల చొప్పున పాతిక లక్షల మందికి బడ్జెట్ కేటాయించడం అంటే రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఇవ్వవలసి ఉంటుందన్నమాట.

అలాగే రైతు బంధును దేశవ్యాప్తం చేస్తామని చెప్పారు. ఎకరాకు పదివేల రూపాయల చొప్పున కోట్ల ఎకరాలకు నిధులు ఇవ్వవలసి వస్తుంది. దీనికి ఎన్ని లక్షల కోట్లు అవుతుందో లెక్కలు వేయవలసి ఉంది. దేశం అంతటా తాగు, సాగు నీరు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. మీది ప్రైవేటైజేషన్ అయితే మాది నేషనలైజేషన్ అన్నారు. వేటిని ఆయన జాతీయం చేస్తారన్నదానిపై స్పష్టత రావాలి. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కూడా హామీ ఇచ్చారు.

కేసీఆర్ ఎజెండాను సభలో పాల్గొన్న వామపక్ష నేతలు, సమాజ్ వాది పార్టీ, ఆమ్ ఆద్మి పార్టీ నేతలు ఎంతవరకు ఆమోదించారో తెలియదు. ఎందుకంటే ఎవరికి వారికి సొంత ఎజెండా ఉంది. వీరంతా కూటమిగా ఏర్పడలేదు. కాకపోతే కేసీఆర్ పథకాలను ప్రశంసించారు. గతంలో పాదయాత్రలు చేసి, నిరసన యాత్రలు చేసి కేసీఆర్‌ను విమర్శించిన వామపక్షాలు ఇప్పుడు సమర్థిస్తున్నాయి. దీనికి కారణం బీజేపీని ఆయన బహిరంగంగా వ్యతిరేకించడమే. ఈ వెలుగునీడలు ఎలా ఉన్నా తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారానికి ఖమ్మం సభ ఒక రిహార్సల్‌గా ఉపయోగపడవచ్చు. అంతకుమించి ఈ సభ ద్వారా అయితే మొత్తం జాతీయ స్థాయి వచ్చేసిందని చెప్ప జాలం. ముగ్గురు సీఎంలు వచ్చి కేసీఆర్‌కు పరువు దక్కించారంటున్నారు విశ్లేషకులు.

అసలు కొత్త మిత్రులతో జాతీయ స్థాయి రాజకీయాల్లో కేసీఆర్ పోషించబోయే పాత్ర ఏంటో అర్థం కాదంటున్నారు విశ్లేషకులు. ఈ మిత్రులలో కొందరు ఒక కన్ను కాంగ్రెస్ మీదే ఉంచారన్నది నిజం. బీఆర్ఎస్ రంగు రుచి వాసన ఏవో తెలియా లంటే అది ఇంకొన్ని అడుగులు వేశాకే చెప్పగలం.


వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర ప్రారంభించడం, జాతీయ అధ్యక్షుడిని మార్చడం, బీజేపీ తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న తరుణంలో కేసీఆర్ భారత రాష్ట్ర సమితిని ప్రకటించారు. ఢిల్లీ మద్యం వివాదంలో తన కుమార్తె పేరు కూడా ఉందన్న వార్తలు వెల్లువెత్తుతున్న తరుణంలో దీనినో ఎత్తుగడగా చూస్తున్నవారు కూడా ఉన్నారు. ఎన్ని వాదోపవాదాలు వినిపించినా, ఖమ్మంలో ఏర్పాటైన దాదాపు తొలి బీఆర్ఎస్ తేవలసినంత చర్చను తెచ్చిందా? ఇక్కడ మాట్లాడిన వారి మాటలలో కొత్తదనం ఎంత? ఖమ్మం వేదిక మీద

# కేసీఆర్ భారత బలమా?

కేసీఆర్‌కు బీజేపీ, కాంగ్రెస్ రెండూ సమాన శత్రువులే. కేసీఆర్ కాంగ్రెస్‌ను చీల్చి చెండాడారు. ఆ పార్టీ అస్తిత్వాన్ని తీవ్రంగా దెబ్బతీసిన నేపథ్యంలో బీజేపీ ఏకు మేకై కూర్చుంది. బహుశా ఇది ఊహించ లేదేమో! ఇప్పుడు కేసీఆర్‌కు కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి అవసరం. కానీ మిగిలిన విపక్షాలలో కాంగ్రెస్ పట్ల సానుకూలత ఉన్నదనేది ఇక్కడ కీలకం. తమకు తగినంత గుర్తింపు లేనందువల్ల జాతీయ స్థాయి వేదికకు కాంగ్రెస్ చాలా అవసరమని ఆ పక్షాలు భావించడం కేసీఆర్‌కు ఇబ్బందికరంగా మారింది. గతంలో ఆయన విపక్షాలతో ఒక కూటమి కోసం యత్నించినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఒక రకంగా అది నిరాశనే మిగిల్చింది. ఇప్పుడు జాతీయపార్టీ పెట్టిన నేపథ్యంలో ఆయన తనను తాను జాతీయస్థాయిలో బలమైన నాయకుడిగా రుజువు చేసుకోక తప్పని పరిస్థితి. లోక్‌సభ ఎన్నికలకు పెద్దగా సమయంలేని తరుణంలో ఇప్పటికిప్పుడు ఇది సాధ్యంకాదు. పొత్తులతో ముందుకు సాగాలంటే సహచర ప్రాంతీయ పార్టీలే అడ్డంకిగా మారకూడదనేం లేదు. అందువల్లనే ఆయన వ్యూహాలు ఫలించడంలో సాధ్యాసాధ్యాలను కాలమే నిర్ణయించాలి. ఎందుకంటే గతంలో టీడీపీ,



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఎంఐఎంలు జాతీయస్థాయిలో ప్రయత్నాలు చేసి నప్పటికీ పెద్దగా సాధించిందేమీ లేదు.

**ఖమ్మం సభ ప్రభావమెంత?**

ఇటీవల ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి జనం బాగానే వచ్చారు. ఓటేసేవారు ఎంత మంది? ముగ్గురు ముఖ్యమంత్రులు, ఒక మాజీ ముఖ్యమంత్రి రావడం పైకి బాగానే అనిపించినా, జాతీయస్థాయిలో ఎదగాలనుకుంటున్న కేసీఆర్‌కు ఇదెంతవరకు ఉపకరిస్తుందనేది ప్రధాన ప్రశ్న. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఇంతమంది నాయకులను పిలిపించడం అంత తేలికైన విషయం కాదనుకునే వారు చాలామందే ఉండవచ్చు. ఇతర ప్రాంతీయ పార్టీల్లో గూడుకట్టుకొని ఉన్న స్వార్థం, ఆధిపత్య ధోరణి, గొంతెమ్మ కోర్కెలు వంటివి కేసీఆర్‌ను అడుగు ముందుకేయనీయవు. ఇది ఆయనకు ప్రతిబంధకం కాగలదు.

**జాతీయ స్థాయికి ఆప్, తృణమూల్ పార్టీలు**

ఆప్ అధినేత కేజ్రీవాల్ దేశవ్యాప్తంగా తన పార్టీని విస్తరించాలనుకుంటున్నారు. పంజాబ్‌లో ఆప్ అధికారంలో ఉంది. ఇందులో భాగంగానే ఆప్ గుజరాత్ ఎన్నికల్లో పోటీ చేసింది. అక్కడ 13% ఓట్లు సాధించి 5 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. గోవాలో ప్రాంతీయ పార్టీగా పోటీ చేసి రెండు స్థానాల్లో గెలుపొందింది. గుజరాత్‌లో ప్రాంతీయపార్టీగా పోటీచేసి జాతీయపార్టీ గుర్తింపునకు అర్హత పొందింది (ఒక రాజకీయ పార్టీ జాతీయ పార్టీగా అర్హత పొందాలంటే మూడు నిబంధనలు న్నాయి. మొదటిది లోక్‌సభ ఎన్నికల్లో కనీసం మూడు రాష్ట్రాల్లో 2% సీట్లు గెలవాలి. రెండవది లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికల్లో 6% ఓట్లను కనీసం నాలుగు రాష్ట్రాల్లో పొందాలి. దీనికి అదనంగా నాలుగు లోక్‌సభ స్థానాల్లో గెలవాలి. నాలుగు రాష్ట్రాల్లో రాష్ట్రపార్టీగా గుర్తింపు పొందాలి). ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో కూడా విస్తరణకు ఆయనకుండే ప్రణాళికలు ఆయనకుంటాయి. అందులో ఆంధ్ర, తెలంగాణ ఉండి తీరతాయి. ఇదే సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి దీదీ కూడా విపక్షాల ప్రధానమంత్రి పోటీదారుల్లో ఒకరు. ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్ 2016లోనే జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. ఆమె కూడా తన పార్టీ విస్తరణకు విఫల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రధాని పదవికి నేనంటే నేనంటూ కేజ్రీవాల్, దీదీ పోటీ పడుతున్న పరిస్థితుల్లో భారత రాష్ట్ర సమితిని ఆర్భాటంగా ప్రారంభించినా, ఈ పల్లకీని ఇతర రాష్ట్రాల్లో మోసేదెవరు? బీఆర్ఎస్‌కు గుర్తింపు రావడానికి ఎంతకాలం పట్టేను? జాతీయ స్థాయి రాజకీయాల్లో పల్లకీలో కూర్చోవడానికి తప్ప పల్లకీ మోయడానికి ఇష్టపడని వివిధ పార్టీల నాయకులతో పాటు తానూ పోటీదారుగా మారితే కలిగే ప్రయోజనం మాట అలా ఉంచి మొదటికే మోసం రావచ్చు. ఈ రాజకీయ భేతాళ పంచవింశతిలో విపక్ష రాజకీయ కాలుష్య

కనిపించిన నేతలతోనే బీఆర్ఎస్ బీజేపీకి ప్రత్యామ్నాయం అనిపించుకుంటుందని జనం నమ్మగలరా? వంటి ప్రశ్నలను ముందుకు తెచ్చింది. ముఖ్యంగా సంక్షేమ కార్యక్రమాలను, రైతులు, మహిళలను నమ్ముకునే ఆయన ఈ సాహసం చేస్తున్నారు. ఇదే సమయంలో తనను తాను ముస్లిం అనుకూల నేతగా ప్రచారం పొందాలన్నది కూడా ఆయన వ్యూహం. రాష్ట్రంలో ఇప్పటికే ఎంఐఎం తనకు మిత్రుడి పాత్ర పోషిస్తున్నందున, దేశంలోని 14% ముస్లిం ఓటర్లను ఆకర్షించవచ్చునని ఆయన అంచనా వేస్తున్నారు. కానీ ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఎంఐఎం ముస్లింల ఓట్లను చీల్చడం బీజేపీకి అనుకూలంగా మారుతున్నదన్నది ఇక్కడ గమనించాల్సిన అంశం. ప్రస్తుతం కేసీఆర్ జాతీయ స్థాయి నేతగా కంటే, రాష్ట్రంలోకి బీజేపీ చొచ్చుకువచ్చే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఇదంతా చేస్తున్నారని చెప్పడం సముచితంగా ఉంటుంది. 2023 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీపై ఘనవిజయం సాధిస్తే జాతీయ రాజకీయాలపై మరింతగా దృష్టిపెట్టవచ్చు. కానీ ఇదంత తేలికైన విషయం కాదన్న సంగతి కేసీఆర్‌కు తెలియదనుకోవడం అమాయకత్వమే. అందుకున్న బలమైన కారణాలను విస్మరించలేం.

# రాష్ట్ర సమితి భారమా?

వైతరిణిని దాటేందుకు పొత్తులే కేసీఆర్‌కు దిక్కు. ఉదాహరణకు కర్ణాటకలో పోటీ చేస్తామని కేసీఆర్ ముందుగా చెప్పినప్పటికీ, జేడీఎస్ నాయకుడు కుమారస్వామి మాత్రం, రాష్ట్రంలో తమ పార్టీకి ఎవరితో పొత్తుండదని చెప్పి గులాబీ నేత ఆశలపై నీళ్లు చల్లారు. దీంతో కర్ణాటకలో జేడీఎస్ గెలుపు కోసం మాత్రమే బీఆర్ఎస్ పనిచేయాల్సిన పరిస్థితి! ఇక బిహార్ ముఖ్యమంత్రి జనతాదళ్ యునైటెడ్ అధినేత నితీశ్ కుమార్ 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, గత ఆగస్టులో ఎన్‌డీఏకు గుడ్‌బై చెప్పి 'మహా ఘట్‌బంధన్'కు తెరతీశారు. తన రాజకీయ వారసుడు తేజస్వీ యాదవ్‌గా పరోక్షంగా చెప్పకనే చెప్పారు. ఇదెంతవరకు ముందుకెళుతుందో తెలియదు. అరవింద్ కేజ్రీవాల్ ఖమ్మం సభకు హాజరైనప్పటికీ, ఆయన పైకి ఎన్నిమాటలు చెప్పినా కేసీఆర్‌కు మద్దతిచ్చే మాట కల్ల. కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించాలనిపించి వచ్చానని చెప్పి ఆయన ఒక సంకేతం ఇచ్చారు. అది ఆశను చిగురింపచేసేది మాత్రం కాదు. లిక్కర్ స్కామ్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఇద్దరూ ఇబ్బందులు పడుతున్న నేపథ్యం ఆయన్ను బహుశా ఖమ్మం సభకు వచ్చేలా చేసి ఉండవచ్చు.

ప్రస్తుతానికి కేసీఆర్ రెండు రాష్ట్రాలకు అధ్యక్షులను నియమించారు. ఆంధ్రప్రదేశ్‌కు తోట చంద్ర శేఖర్ కాగా ఒరిస్సాకు ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్. 2009లో ఓటమిపాలైన దగ్గరి నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉన్న గమాంగ్, 2015లో బీజేపీలో చేరారు. 79 ఏళ్ల ఈ వృద్ధ నాయకుడు ఇప్పుడు తన కుమారుడి కోసం తాపత్రయపడుతున్నారు. 1999లో అప్పటి వాజపేయి ప్రభుత్వం కేవలం ఈయన వేసిన వ్యతిరేక ఓటు కారణంగా ఒకే ఒక ఓటు తేడాతో కుప్పకూలి పోయింది. ఇంతటి వృద్ధాప్య దశలో, రాజకీయాల్లో చురుగ్గా లేని ఆయన బీఆర్ఎస్‌కే భారంగా మారకూడదనేం లేదు. ఇక ఆంధ్రప్రదేశ్ పార్టీ శాఖ అధ్యక్షుడిగా నియమితులైన తోట చంద్రశేఖర్ ఉత్సాహంగా ఖమ్మం సభకు జనాల్ని తరలించారన్న వార్తలు వచ్చాయి. అయితే ఆయన ఎంపిక వెనుక పెద్ద భూస్కాం ఉందంటూ బీజేపీ నేత రఘునందన్‌రావు చేసిన ఆరోపణలు కేసీఆర్‌ను ఇరకాటంలో పెట్టేదే. ఎందుకంటే న్యాయవాది అయిన రఘునందన్‌రావు అంత తేలిగ్గా ఆరోపణలు చేస్తారని అనుకోలేం. ఇదిలా ఉండగా కుల రాజకీయాల కుంపట్లతో కాగుతున్న ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు తోట చంద్రశేఖర్ తోడయ్యారని అనుకోవాలి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, పవన్ కల్యాణ్‌కు తోడు తోట చంద్రశేఖర్ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. ఇప్పటికే ఆంధ్రలో మరొక రెండు కులాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్న తరుణంలో కేసీఆర్ పాచిక ఎంతమేర పారుతుందన్నది ప్రశ్నార్థకమే.ముందు చెప్పుకున్న సామాజిక వర్గాన్ని మచ్చిక చేసుకోవడానికి ఈ రెండు వర్గాలు నానా తంటాలు పడుతున్నాయి.

**ఒకప్పుడు దుమ్మెత్తిపోసి...**

తెలంగాణ ఉద్యమం సమయంలో ఆంధ్రావాళ్లకు వ్యతిరేకంగా దారుణమైన వ్యాఖ్యలు చేసిన కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని అక్కడకు వెళతారని కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం సహేతుకమైనదే. అయితే ఆంధ్రావారిని దుమ్మెత్తి పోసిన కేసీఆర్, ఇప్పుడు కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నానని చెప్పగలరు. తన మాటల మంత్రదండంతో తిమ్మిని బ్రిమ్మిని చేయగలరు. దయ్యమని తిట్టిన వారినే దేవుడు/దేవత అని పొగడగలిగే సామర్థ్యం ఆయన సొంతం. అందువల్ల ఆయనకు ఆంధ్రలో అడుగు పెట్టడం పెద్ద కష్టమైన పనేం కాదు. అయితే ఆంధ్ర ప్రదేశ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు కేసీఆర్ కొంత మంచి చేశారన్న అభిప్రాయం ఆంధ్రుల్లో ఉంది. అందువల్ల కుల రాజకీయాలతో విసిగిపోయిన ఆంధ్రులు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయరని కచ్చితంగా చెప్పలేం. ఆంధ్ర ప్రాంతానికి చెందినవారే అయిన కొన్ని వర్గాలకు కేసీఆర్ చల్లనిచూపు కావాలి. హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన ఆంధ్రకు చెందిన బలీయమైన ఆర్థికశక్తులు, తమ వ్యాపారాలు, పరిశ్రమలను కాపాడుకోవడం ప్రధానం కాబట్టి కేసీఆర్‌కు మద్దతు తెలపొచ్చు. అయితే ఆంధ్రప్రదేశ్ కంటే మూడు, నాలుగు నెలల ముందు తెలంగాణలో ఎన్నికలు జరగనున్నందున, ఇక్కడ బీజేపీను నిలువ రించి తన ఆధిపత్యాన్ని నిలుపుకుంటే కేసీఆర్‌కు



కేజ్రీవాల్



అఖిలేశ్

ఆంధ్రలో సానుకూల పవనాలు వీచే అవకాశా లుంటాయి. కానీ బీజేపీ గట్టిపోటీ ఇచ్చి ఎక్కువ స్థానాల్లో విజయం సాధించినా లేదా టీఆర్ఎస్‌ను ఓడించినా భారాస ఆంధ్రలో అడుగు పెట్టడం కష్టమే.

మన దేశంలో రాజకీయాలు సైద్ధాంతిక ప్రాతిపదికను వదిలేసి చాలా ఏళ్లయింది. రాజకీయా లను ఒక కెరీర్‌గా ఎంచుకునేవారు, అందులో పెట్టు బడులు (ఎన్నికల ఖర్చు రూపంలో) పెట్టి, అధికారంలోకి రాగానే రెట్టింపు సంపాదించాలన్న కాంక్ష పెరిగిపోవడంతో, ప్రజాస్వామ్యం నిర్వచనం మారిపోయింది. పార్టీ కాదు, కెరీర్ ముఖ్యమై పోయింది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్‌సీపీలో టిక్కెట్లు దక్కవని నిర్ధారించుకున్నవారు, పడిపోయిన టీడీపీ ఇక లేవడం కష్టమని గట్టిగా నమ్మినవారికి బీఆర్ఎస్ తమ రాజకీయ కెరీర్‌కు ఒక అవకాశంగా కనిపించ వచ్చు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరో ముఖ్య విషయమేంటంటే.. తెలంగాణలో ఆంధ్రావారి ఓట్లున్నాయి కానీ ఆంధ్రలో తెలంగాణ ఓట్లు లేవు.



దశాబ్దాలుగా ఆంధ్ర ప్రాంతంలో రాజకీయాలను శాసించిన కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇప్పుడు చతికిలబడిన నేపథ్యంలో ఈ ఖాళీని ఎంతవరకు బీఆర్ఎస్ పూరించగలదనేది ప్రశ్న.

### ఎంఐఎంతో దోస్తీ అవసరం

ఖమ్మం సభకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ రాకపోవడం వెనుక వ్యూహాత్మక రాజకీయం ఉన్నదా? అన్న అనుమానాన్ని పక్కన పెడితే ఎంఐఎం కేవలం ముస్లింల ప్రయోజనాల కోసం పోరాడే పార్టీ. బీఆర్ఎస్–ఎంఐఎం మైత్రిని తెలంగాణలోని కమలనాథులు తమకు అనుకూ లంగా మలచుకుంటున్నారు. ముఖ్యంగా భైంసా అల్లర్ల వ్యవహారంలో ప్రభుత్వం సరిగ్గా వ్యవహ రించలేదన్న ఆరోపణలను ఎదుర్కొంది. దీన్ని బీజేపీ తన ప్రచారాస్త్రంగా వాడుకుంటోంది. ఇదిలా ఉండగా తెలంగాణలో 12.7% ముస్లిం ఓటర్లున్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో, కనీసం 40 నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నందున, ఎంఐఎంను కేసీఆర్ నిర్లక్ష్యం చేయడం సాధ్యం కాదు. అట్లాగని మిగిలిన వర్గాలను నిర్లక్ష్యం చేయకూడదు కదా. అదీకాకుండా హైదరాబాద్ పాతబస్తీలో ఎంఐఎందే ఆధిపత్యం. ఇక్కడి ఏడు అసెంబ్లీ స్థానాలు ఆ పార్టీకి కంచుకోట. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ముస్లింలు ఉన్నప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, కరీంనగర్‌ల్లో వీరి ప్రాబల్యం అధికం. తెలంగాణ సామాజికాభివృద్ధి నివేదిక–2017 ప్రకారం 1.73 మిలియన్ల మంది ముస్లింలు కేవలం హైదరాబాద్‌లోనే నివసిస్తున్నారు. అంటే మొత్తం రాష్ట్రంలోని ముస్లిం జనాభాలో ఇక్కడ 43.5%. మరి జంటనగరాల్లో 24 అసెంబ్లీ స్థానా లుండగా వీటిల్లో పదింటిని ముస్లింఓటర్లు కచ్చితంగా ప్రభావితం చేయగలరు. రాష్ట్రంలో షాదీముబారక్, ముస్లింల కోసం ఇంగ్లిష్ మీడియం స్కూళ్లను ప్రారం భించడం, డిప్యూటీ ముఖ్యమంత్రిగా ముస్లింను చేసిన నేపథ్యంలో కేసీఆర్ పట్ల ముస్లింలలో సానుకూలత వ్యక్తమైనా, కేంద్రంలోని బీజేపీతో సాన్నిహిత్యం వీరికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఇదే సమయంలో కేసీఆర్ మీద ముస్లింలలోని కొన్ని వర్గాల్లో అనుమానాలు కూడా లేకపోలేదు. ముస్లింల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధుల్లో పూర్తిగా వినియోగం కావడంలేదన్నది వారి ఆరోపణ. 2017 బడ్జెట్‌లో ముస్లింలకు కేటాయించిన నిధుల్లో 41.7% మాత్రమే ఖర్చుచేశారని, అంతకుముందు ఏడాది మరింత దారుణంగా 27.89% నిధులు మాత్రమే ఖర్చు చేశారని, అంతకు పూర్వం మూడేళ్ల కాలంలో పరిశీ లిస్తే ముస్లింలకు కేటాయించిన బడ్జెట్‌లో 60%కు మించి నిధులు ఖర్చుచేయలేదన్నది కూడా ఆరోపణ. రాష్ట్రంలోని ముస్లింలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తరించిఉన్నారు. గ్రామాల్లోని ముస్లింలు కాంగ్రెస్‌కు అనుకూలం కాగా, పట్టణం ప్రధానంగా హైదరాబాద్ ముస్లింలు ఎంఐఎంకు అనుకూలంగా ఉంటారు. అయితే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత విశ్వ సించదగ్గ నేతగా కేసీఆర్‌ను ముస్లింలు పరిగణిస్తారు. 2018 ఎన్నికలను పరిశీలిస్తే దాదాపు 60 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్ల సంఖ్య 10శాతం వరకు ఉంది. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ దాదాపు క్లీన్‌స్వీప్ చేసింది. అదేవిధంగా ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో కూడా పార్టీ అడుగుపెట్టగలిగిందంటే కారణం ముస్లిం ఓట్లే.

### ఖమ్మంలోనే ఎందుకు?

ఖమ్మం జిల్లాలోని ఇద్దరు ముఖ్యనేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు కొత్త సంవత్సరం మొదటిరోజున తమ అనుయాయు లతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ మారే సంకేతాలిచ్చినప్పటికీ, తుమ్మల గుంభనంగానే ఉండిపోయారు. నిజానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గతంలో వైఎస్ఆర్‌సీపీ తరపున గెలిచారు. తర్వాత జగన్ ఆంధ్ర రాజకీయాలకు పరిమితం కావడంతో గులాబీ పార్టీలో చేరిన తర్వాత లూప్‌లైన్‌లో పెట్టడంతో ప్రస్తుతం అసంతృప్తితో ఉన్నమాట వాస్తవం. సహజంగానే బీజేపీ వీరిద్దరి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. తుమ్మల నాగేశ్వరరావు ఏ పార్టీలో ఉన్నా ఆయన ఆత్మ మాత్రం తెలుగు దేశమే! కానీ ఆ పార్టీకి ఇక్కడ భవిష్యత్తు లేకపోవ డంతో, బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అంటున్న బీజేపీలో చేరి తన అదృష్టం పరీక్షించుకుంటారా అన్నది ఆయన బయట పెట్టడంలేదు. ఇటీవల చంద్రబాబు ‘ఘర్‌వాపసీ’ అంటూ తెలంగాణలోకి ఎంట్రీ ఇవ్వడంతో అటువైపు మొగ్గుచూపుతారా? చూడాల్సి ఉంది. ఇన్నేళ్లుగా ఏమీ పట్టించుకోకుండా ఒక్కసారిగా వచ్చి మద్దతు ఇవ్వండని కోరే చంద్రబాబును విశ్వసించడం కష్టం. కాగా ఇన్ని పరిణామాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలోనే బలంగా ఉన్నామని నిరూపించుకోవడానికే కేసీఆర్ ఖమ్మంను వేదికగా చేసుకున్నారని భావించాలి.

### పోటీ ఎక్కడి నుంచి!

2023లో మేఘాలయ (60), నాగాలాండ్ (60), త్రిపుర (60), కర్ణాటక (224), ఛత్తీస్‌గఢ్ (90),మధ్యప్రదేశ్ (230),మిజోరం(40), రాజస్తాన్ (200),తెలంగాణ(119) రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. త్రిపురలో ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగనున్నాయి. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు, వీటిని ప్రీఫైనల్‌గా పరిగణిస్తు న్నారు. త్రిపురలో బీజేపీ– ఐపీఎఫ్‌టీ కూటమి, నాగాలాండ్, మేఘాలయల్లో అక్కడి ప్రాంతీయ పార్టీలతో బీజేపీ జూనియర్ భాగస్వామిగా జట్టుకట్టి అధికారంలో కొనసాగుతోంది. దక్షిణ భారతదేశం లోని కర్ణాటకలో మేలో జరిగే ఎన్నికల్లో ప్రధానంగా తలపడేవి బీజేపీ, కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్). తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు తలపడుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఈ ఏడాది నవంబర్–డిసెంబర్ మధ్యకాలంలో ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ ప్రధాన ప్రత్యర్థులు బీజేపీ–కాంగ్రెస్ పార్టీలు. ఇక ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్

లలో అధికారంలోఉన్న కాంగ్రెస్ తన పట్టును నిలుపుకోవాలని పోరాడుతోంది. ఈ రాష్ట్రాల్లో ప్రధాన ప్రత్యర్థి బీజేపీ. ఇక తెలంగాణలో కేసీఆర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో తలపడాలన్న ఆలోచనతో తెరాస పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చారు. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే తెలంగాణలో తప్ప మిగిలిన ఏ రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ పోటీ చేసే పరిస్థితి లేదు.

**పేరు మార్పుతో భయం!**

తెలంగాణ రాష్ట్ర సమితిలోని 'తెలంగాణ' స్థానంలో 'భారత' అనే పదం చేరడం గులాబీ నేతలను భయపెడుతోంది. ఈ మార్పు ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉంటుందేమోనన్నది వీరి భయం. అదే నిజమైతే తమ కొంప కొల్లేరేనన్న ఆలోచన వారికి నిద్రపట్టనివ్వడంలేదు. గతంలో మాదిరి ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కూడా లేదు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌కు ప్రజల్లోకి దూసుకెళ్లే వజ్రాయుధం లాంటి మరో 'నినాదం లేదా సెంటిమెంట్' తక్షణావసరం.

**ప్రతిపక్షాల వ్యూహాలు**

2022లో ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగాయి. కమలం పార్టీ ఐదు రాష్ట్రాల్లో అంటే గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో అధికారాన్ని కైవసం చేసుకోగా కాంగ్రెస్ కేవలం హిమాచల్‌ప్రదేశ్‌తో సరిపెట్టుకుంది. ఇక్కడ విపక్షాలు మూడు రకాల వ్యూహాలను అనుసరించాయని చెప్పాలి. మొదటిది– ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రాజకీయాల్లో కొత్త పంథా అనుసరించారు. దేశంలో 'సంప్రదాయ వాదాన్ని' ఎదుర్కొనడానికి 'మధ్యేమార్గ– సంప్రదాయ మార్గాన్ని' ఎన్నుకొని ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అంటే 'హిందూత్వం పట్ల మెతక వైఖరి' అనుసరిస్తూ ముందుకు సాగడం. కొన్ని సమయాల్లో మైనారిటీల పట్ల మౌనంగా ఉండటం. ఈ మార్గం కొంతమేర ఫలితాలనిచ్చినట్టు ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఈ విధానంలో బీజేపీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో హిందూత్వను దూకుడుగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంచేశారు. ఇది పంజాబ్‌లో ఫలించి పార్టీని అధికారంలోకి తెచ్చింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్, 15 సంవత్సరాల బీజేపీ ఆధిపత్యానికి చరమగీతం పాడగలిగినప్పటికీ, ఇక్కడ కమలం పార్టీ స్వయం కృతాపరాధాలను కూడా విస్మరించలేం. అయితే దీనివల్ల ఒక ప్రతికూలత కూడా ఉంది. బీజేపీకి హిందువులు బలీయమైన ఓటుబ్యాంకుగా ఉన్న ప్రాంతాల్లో ఈ 'సిద్ధాంతం' పని చేయదు. పైగా కాంగ్రెస్ నుంచి వేరుపడినందుకు ముస్లింలు నమ్మబోరు. ఇది కొన్ని రాష్ట్రాల్లోనే పనిచేస్తుంది. ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో కాంగ్రెస్‌ను ఓడించి అధికారం లోకి రావడంలో ఈ విధానం ఉపయోగపడింది. రెండవది–రాహుల్ గాంధీ 'తాను అనుసరించేదే సరైంది' అనే దృక్పథంతో ముందుకెళ్లారు. ఇందు కోసం ఆయన ఎన్నికల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే విధానాన్ని పక్కనబెట్టడమో లేక నిరవధికంగా వాయిదా వేయడమో చేస్తూ ముందుకు సాగిపోయారు. కాంగ్రెస్ బేస్ వేగంగా కుంచించుకుపోతున్నా, ముఖ్యమైన నేతలు పార్టీని వీడుతున్నా పట్టించుకోని వైఖరి అవలంబించారు. ఈ వైఖరి పార్టీ కార్యకర్తలతో సంబంధాన్ని కోల్పోయేలా చేసి కొండనాలిక్కి మందేస్తే ఉన్న నాలిక ఊడిపోయిన చందంగా తయారైంది. మూడో విపక్ష విధానం ఆయా రాష్ట్రాల పరిస్థితులనుబట్టి అనుసరించేది. బలీయమైన ప్రాంతీయతత్వాన్ని కలిగిన గట్టి ప్రాంతీయ నాయకుడు ఉండటం. బీజేపీకి ఇప్పుడు ఇటువంటి నాయకుల కొరత బాగా ఉంది. పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్, తెలంగాణలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఒడిశాలో నవీన్ పట్నాయక్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఢిల్లీలో కేజ్రీవాల్ ఈ కోవకు చెందిన విపక్ష నేతలు. ఎక్కడికక్కడే ప్రాంతీయ సమస్యల అడ్డంకు లున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా వీరి వ్యూహాలు కొనసాగాయి. వీరిలో నవీన్ పట్నాయక్, స్టాలిన్‌లకు జాతీయస్థాయికి ఎదగాలన్న ఆలోచనలు లేవు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో ముఖ్యపాత్ర వహించాలనుకుంటున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఆయన వ్యూహంపై పూర్తి స్పష్టత లేదు.



పినరయ్



మాన్

**బీజేపీ వ్యూహం**

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఏ రాష్ట్రానికి అనుగుణంగా అక్కడి పరిస్థితులను బట్టి తన వ్యూహాలను పన్నుతోంది. ముఖ్యంగా దక్షిణాదిలో విస్తరించాలన్న లక్ష్యంతో ఒక్కొక్క చోట ప్రత్యేకవ్యూహంతో ముందుకు వెళుతోంది. తెలంగాణలో ప్రభుత్వ అవినీతి, హిందూ వ్యతిరేక పాలన అన్న అంశాలపై ముందుకు సాగుతోంది. అదేవిధంగా తమిళనాడులో బలీయంగా ఉన్న ద్రవిడ వాదాన్ని ఎదుర్కొనడానికి ప్రధాని మోదీ తలపెట్టిన 'తమిళ–కాశీ సంగమం' కార్యక్రమం గడచిన నవంబర్ 27 నుంచి డిసెంబర్ 16 వరకు సాగింది. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో తమిళ భాషా సంస్కృతులకు మరింత ప్రాచుర్యం కలిగించడం ప్రధాన లక్ష్యం. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నవంబర్ 19న మోదీ ప్రారంభించారు. రెండు ప్రాంతాలకు చెందిన మేధావులు, విద్యార్థులు, తత్వవేత్తలు, కళాకారులు, వర్తకులు పరస్పరం తమ తమ సంస్కృతులపై పరస్పరం అవగాహన పెంచుకునే కార్యక్రమం ఇది. తమిళ చారిత్రక గ్రంథాలైన శిలప్పదికారం, మణిమేఘలైలలో తమిళనాడు–వారణాసిల మధ్య వెయ్యేళ్ల అనుబంధాన్ని వివరించిన విషయానికి ఎక్కువ ప్రాచుర్యం కల్పిస్తూ ద్రవిడ వాదాన్ని దెబ్బకొట్టా లన్నది వ్యూహం. అన్నాడీఎంకే బలహీనపడిన నేపథ్యంలో ఆ స్థానాన్ని భర్తీచేసే వ్యూహాన్ని ఇక్కడ అనుసరిస్తోంది. కశ్మీర్‌లో పహారీ ముస్లింలకు ఎస్టీ హోదా ఇవ్వడం, 2024 లోకసభ ఎన్నికల్లో కేరళలో, తిరువనంతపురం, అట్టింగళ్, పథనంతిట్ట, త్రిస్సూర్, పాలక్కాడ్, కాసరగాడ్ లోక్‌సభ స్థానాలపై దృష్టిపెట్టడం వంటివి బీజేపీ వ్యూహాలు.


దేశంలోని అధికార, ప్రతిపక్షాలు తమ తమ వ్యూహాలతో ముందుకెళుతున్న నేపథ్యంలో కేసీఆర్ మరింత దృఢమైన వ్యూహాన్ని అనుసరించక తప్పదు. అన్నింటికంటే ముందు జాతీయ నాయకుడిగా గుర్తింపురావాలి. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలి. ఇవన్నీ ఇప్పటికిప్పుడు జరిగేవి కావు. పూర్తి సంక్షేమ కార్యక్రమాలు కూడా ఒక్కోసారి ఫలితాల నివ్వవు. మతాలు, కులాలు, వర్గాల వారీ లెక్కలు కూడా అన్నివేళలా పనిచేయవు. ఎందుకంటే అసంతృప్తులు అన్ని వర్గాల్లో ఉంటారు. అలయన్స్ రాజకీయాలు మనదేశంలో కొంతకాలం నడిచినా అవి ఉత్తమ పాలనను అందించలేకపోయాయి. ఇప్పుడు కేసీఆర్ కూడా కూటమి రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తే, జాతీయ స్థాయిలో కుమ్ములాటల్లో తాను కూడా భాగస్వామి కావాల్సివస్తుంది. ఒంటరిగా పోరాడాలంటే బీఆర్ఎస్ ఇంకా శైశవావస్థలోనే ఉంది. ఇరవై ఎనిమిదేళ్ల కేసీఆర్ రాజకీయం అంతా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణకే పరిమితమైందన్న సంగతిని విస్మరించలేం. మంచి వ్యూహకర్తే అయినా కారుమేఘాల వంటి బీజేపీ వ్యూహాలను ఎలా ఎదుర్కొంటారో కాలమే నిర్ణయించాలి. ఈ ఉదంతానికి సంబంధించిన విశ్లేషణలకి కొసమెరుపు కేసీఆర్ వెంట ఉంటాం అంటున్న వామపక్షాలు బీఆర్ఎస్ చేసే మేలు ఎంతో పట్టించుకోవడానికి ఎవరూ ఆసక్తిగా లేరు. ★

# మరో విజయమే లక్ష్యంగా

**ఈ ఏడాది జరగనున్న 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు భారతీయ జనతా పార్టీ సమాయత్తమవుతోంది. ఇటీవల ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహించిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం ఇందుకు వేదికైంది. 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలను ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించేందుకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కర్ణాటక, ఈ ఏడాది ఆఖర్లో మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీలకు; వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ అన్ని ఎన్నికల్లోనూ కాషాయ జెండా రెపరెపలాడాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పార్టీ గట్టి సంకల్పం తీసుకుంది. గుజరాత్ మాదిరిగా ఘన విజయం సాధించాలని పార్టీ శ్రేణులకు ఉద్బోధ చేసింది. అదే సమయంలో అతి ధీమాకు పోయి వ్యవహరించ వద్దని హెచ్చరించింది. హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో వైఫల్యం నేపథ్యంలో ఈ మేరకు అప్రమత్తం చేసింది.**

పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలాన్ని 2024 జూన్ వరకు పొడిగిస్తూ జాతీయ కార్యవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నడ్డా నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని తీర్మానించింది. ఆయన పనితీరు, చిత్తశుద్ధిపై పార్టీకి గల విశ్వాసానికి ఈ నిర్ణయం తిరుగులేని నిదర్శనం. నడ్డా పదవీ కాలం పొడిగింపును రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించగా జాతీయ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నడ్డా నేతృత్వంలో చాలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించింది. మొత్తం 120 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే 73 చోట్ల పార్టీ నెగ్గింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా అప్పటి అధ్యక్షుడు అమిత్ షా పదవీ కాలాన్ని పొడిగించిన విషయం గమనార్హం.

ఇక్కడ నడ్డా గురించి నాలుగు మాటలు చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. 62 సంవత్సరాల జగత్ ప్రకాశ్ నడ్డా హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన వారు. ఆయన తండ్రి పట్నా వర్సిటీలో ప్రొఫెసర్ కావడంతో నడ్డా పుట్టింది, పెరిగింది బిహార్ లోనేనని చెప్పవచ్చు. మితభాషి, మృదుభాషి అయిన నడ్డా ప్రచారానికి, ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. నిరంతరం పని చేయడానికే ప్రాధాన్యమిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలను ఇష్టపడతారు. ఆయన రాజకీయ ప్రస్థానం ఏబీవీపీ ద్వారా ప్రారంభమైంది. 1991లో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా, 1993లో హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో విపక్షనేతగా పనిచేశారు. 1998లో రాష్ట్ర మంత్రి అయ్యారు. 2010లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 2020 జనవరిలో పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి పార్టీ పురోగతికి క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నారు. తన పనితీరుతో ప్రధాని మోదీ మెప్పు పొందారు.



ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల విషయానికి వస్తే... త్రిపురలో పార్టీ అధికారంలో ఉంది. రేపటి ఎన్నికల్లో అగర్తలలో అధికార పీఠాన్ని కాపాడుకోవడం పార్టీ ముందున్న ప్రధాన సవాల్. ఇది ఒకప్పుడు సీపీఎంకు కంచుకోట. ఈసారి సీపీఎం సైతం సర్వశక్తులూ ఒడ్డుతోంది. మేఘాలయలో సంగ్మా నాయకత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ అధికారంలో ఉంది. నాగాలాండ్‌లో సంకీర్ణ సర్కారు నడుస్తోంది. ఈ రెండు చోట్ల అధికారంలో బీజేపీ భాగస్వామిగా ఉంది. త్రిపురలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, నాగాలాండ్, మేఘాలయలో అధికారాన్ని కైవసం చేసుకోవడం పార్టీ లక్ష్యం. ఇప్పటికే ఈ మూడు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పర్యటించి వేల కోట్ల రూపాయల విలువైన పనులకు శంకుస్థాపనలు చేసి, అనేక పథకాలను ప్రారంభించడం ద్వారా పరోక్షంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. త్వరలో ఈ మూడు రాష్ట్రాలను పార్టీ అగ్రనేతలు సందర్శించి ప్రచారాన్ని తీవ్రతరం చేయనున్నారు. వీటి తర్వాత మరో ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో, కర్ణాటకలో ఎన్నికలు జరగనున్నాయి. కర్ణాటకలో పార్టీ అధికారంలోఉంది. దక్షిణాదిన పార్టీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. లింగాయత్ నాయకుడు బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే పార్టీ ఎన్నికలను ఎదుర్కోనుంది. ప్రధాని మోదీ ఇప్పటికే ఈ రాష్ట్రాన్ని చుట్టి వచ్చారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సభల ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది చివర్లో పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లో ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలోని పార్టీ అధికారంలో ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఒకింత ఎక్కువ సీట్లు వచ్చాయి. తర్వాత రోజుల్లో ఏర్పడిన రాజకీయ పరిణామాల్లో భాగంగా కమల్ నాథ్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలగా, బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. ఇక్కడ చౌహాన్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలా? లేదా? అనే అంశంపై పార్టీ తర్జనభర్జన పడుతోంది. 200 స్థానాలు గల రాజస్థాన్ అసెంబ్లీకి 2017లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు సాధించి సర్కారును ఏర్పాటు చేయగా, బీజేపీ గణనీయమైన సీట్లే గెలుచుకుంది. అయిదేళ్లకోసారి అధికార పార్టీని ఓడించి, ప్రతి పక్షానికి అధికార పగ్గాలు అందించే సంప్రదాయం ఇక్కడ ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ గెలుపుపై పార్టీ ఆశాభావంతో ఉంది. 2017కు ముందు వరుసగా 15 ఏళ్లపాటు రమణ్ సింగ్

నాయకత్వంలో చత్తీస్‌గఢ్‌లో అధికారంలో కొనసాగిన పార్టీ గత ఎన్నికల్లో ఓడిపోయింది. మళ్లీ అధికారాన్ని సాధించే దిశగా పావులు కదుపుతోంది.

దక్షిణాదిన ఎన్నికలు జరగనున్న మరో కీలక రాష్ట్రం తెలంగాణ. ఇక్కడ ప్రస్తుతం అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (భారాస...పూర్వపు 'తెలంగాణ రాష్ట్ర సమితి'–తెరాస)ని ఓడించి అధికారాన్ని అందుకునేందుకు పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ప్రజా సంగ్రామ యాత్రల ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళుతున్నారు. భారాస ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన విజయం సాధించారు. ఇటీవల జాతీయ కార్యవర్గ సమావేశాల్లో బండి సంజయ్ పనితీరుపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. అంతకుముందు వివిధ సందర్భాల్లోనూ సంజయ్ పనితీరును ఆయన మెచ్చుకున్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు ధర్మపురి అరవింద్, సోయం బాపురావు, కె.లక్ష్మణ్ తదితరులు దూకుడుగా

చేరువకావాలన్నారు. పాస్మాండాలు ముస్లింలలో వెనుకబడిన వర్గం. ఇప్పటివరకు రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల వల్ల వీరికి లబ్ధి చేకూరలేదు. వీరికి చేరువ కావడం ద్వారా ఓటు బ్యాంకును విస్తరించు కోవడం పార్టీ వ్యూహంగా ఉంది. 'ఎన్నికల కోసం కాకుండా పేదల సంక్షేమానికి పాటు పడండి. ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లండి. ముఖ్యంగా యువతకు చేరువకండి' అని ప్రధాని మోదీ పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు. అదే సమయంలో అతివిశ్వాసానికి పోవద్దని, దానివల్ల నష్టపోయే ప్రమాదం ఉందంటూ 1998నాటి మధ్యప్రదేశ్ అనుభవాన్ని గుర్తు చేశారు. అప్పుడక్కడ దిగ్విజయ్ సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ విషయాన్ని గుర్తించకుండా పార్టీ అతి విశ్వాసంతో ముందుకు సాగింది. ఫలితంగా హస్తం పార్టీ అక్కడ అతి స్వల్ప ఆధిక్యంతో అధికారం అందుకుంది. మళ్లీ అటువంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని



# 'కమలం' సంకల్పం

ప్రజల్లోకి వెళుతున్నారు. భారాస సిట్టింగ్ స్థానాలైన దుబ్బాక, హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయం సాధించడం బీజేపీకి మంచి ఊపు తెచ్చింది. హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో పార్టీ గణనీయంగా డివిజన్లు గెలుచుకోవడం, మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయానికి చేరువగా రావడం పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పార్టీ ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు అనుగుణంగా కేంద్ర నాయకత్వం రాష్ట్రంలో తరచూ పర్యటనలు జరుపుతోంది.

తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా వచ్చే ఏడాది జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించేందుకు కమలనాథులు గట్టి కసరత్తే చేస్తు న్నారు. అన్నివర్గాల ప్రజలకు చేరువవడం ద్వారా పార్టీకి విజయం సాధించి పెట్టాలని ప్రధాని మోదీ నాయకులకు పిలుపునిచ్చారు. బోహ్రాలు, పాస్మండాలు, సిక్కులు, ఇతర అనేక వర్గాల ప్రజలకు

పార్టీ శ్రేణులను మోదీ హెచ్చరించారు. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అతి తక్కువ తేడాతో పార్టీ అధికారానికి దూరంగా ఉండిపోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు. అదే సమయంలో అనవసర వ్యాఖ్యలకు, వివాదాస్పద ప్రకటనలకు దూరంగా ఉండాలని మోదీ పిలుపునిచ్చారు. వీటివల్ల పార్టీ పలుచనయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. సినిమాలు వంటి సున్నితమైన అంశాలపై వ్యాఖ్యలకు దూరంగా ఉండాలన్నారు. వీటివల్ల అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలు పక్కకు పోతాయన్నారు. షారూఖ్ ఖాన్ నటించిన 'పఠాన్' సినిమాలో కాషాయాన్ని కించపరిచారంటూ, ఆ సినిమాను బహిష్కరించాలంటూ కొందరు పార్టీ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. విపక్షాలు, ఇతర వర్గాలు రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పైనే పూర్తిగా దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల్లో

గెలుపే లక్ష్యంగా సాగిన జాతీయ కార్యవర్గ సమావే శాల్లో మోదీ ఆచితూచి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు కూడా సంయమనం పాటించాలని ప్రజల విశ్వాసం చూరగొనడంపైనే పూర్తిగా సమయం వెచ్చించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా నిరుపేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం, అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం, 370 అధికరణ రద్దు ద్వారా కశ్మీరుకు స్వేచ్ఛ కల్పించడం, కరోనా మహమ్మారిని ఎదుర్కొన్న తీరు, జీ–20 సదస్సుకు అధ్యక్షత వహించే అవకాశం మన దేశానికి లభించడం, ఈబీసీ రిజర్వేషన్లు వంటి అంశాలపై ప్రచారం చేయడం, కలసికట్టుగా పనిచేయడం ద్వారా పార్టీని విజయతీరాలకు చేర్చాలని సూచించి సరైన దిశానిర్దేశం చేశారన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమైంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా వచ్చే ఏడాది జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించేందుకు కమలనాథులు గట్టి కసరత్తే చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజలకు చేరువవడం ద్వారా పార్టీకి విజయం సాధించి పెట్టాలని ప్రధాని మోదీ నాయకులకు పిలుపునిచ్చారు.**



ఫ్లైట్ ఆఫీసర్ నివేదిత



కమాండ్ ఆఫీసర్ షాలిజా




ఫ్లైట్ లెఫ్టినెంట్ కాంతా

# వనితా సేనతో శాంతి స్థాపన

రగిలే పొగలు, పగిలే బాంబులు, మండే మంటలు
మృత్యుదేవత నీలినీడలు..పారాడే లోతుగుంటలు!
సైనిక భాషలో 'శాంతి'కి సరైన అర్థం ఏముంది?
ఎవరివో ఆర్తనాదాలు చెవుల్ని బద్దలు చేస్తున్నాయి
దొంగ తోడేళ్ల కుట్రలూ కుహకాల ధ్వనులు వినవస్తున్నాయి
ఎముకల కొరుక్కుతినే చలిలో కాళ్లూ చేతులూ కొంకర్లు పోతున్నాయి
నెత్తురు గడ్డకట్టింది, చూపంతా బిగబట్టి ఉంది
కత్తులూ తుపాకులూ కదం తొక్కే కోర కదన వేదిక ఇది....
జ్వలన ప్రజ్వలనాల్లో కర్తవ్య నిర్వహణం, పరీక్షల నిరీక్షణాక్షణం!

కవినేత్రం చూసిన ఆ దృశ్యాన్ని మనం ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. యుద్ధం అనేది ఎప్పుడూ అంతే! శాంతి పరిరక్షణ సదా కత్తి మీద నడకే!! అటువంటి స్థితిగతుల్లో మహిళామణులు ముందుకే నడవటమన్నది ఎప్పుడూ విశేషమే. ప్రపంచంలో ఎక్కడ ఏ వైపరీత్యం తలెత్తినా, ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నా ప్రత్యక్షమవుతోంది వనితాశక్తి. సంక్షోభ నివారణ దిశగా తన వంతు బాధ్యత నెరవేర్చి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఇక మన భారత సైన్యంలోనైతే ఇంకొంత మందికి, అందునా అధికారిణులకు పూర్తిస్థాయి కల్నల్ హోదా కలిగిస్తున్నారు. ప్రస్తుతం లెఫ్టినెంట్ కల్నల్స్‌గా ఉన్నవారిని త్వరలోనే కల్నల్స్ చేయనున్నారు. వీరంతా రణక్షేత్రంలోనే కాకుండా ఇంజనీరింగ్, సిగ్నలింగ్, ఆర్మీ ఎయిర్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్ తదితర విభాగాలకు చెందినవారు. స్పెషల్ సెలెక్షన్ బోర్డు ద్వారా పదోన్నతులు అందుకుంటున్న పడతులు. ఇంటా బయటా ఇంతటి ఏర్పాటు పూర్వాపరాల్ని మనమిప్పుడు పరిశీలిద్దాం.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

ప్రపంచంలోని పలు దేశాల్లో అతివలు సైనిక హోదాలతో పని చేస్తున్నారు. ముఖాముఖి పోరాటాల్లో కొందరు, సహాయక – అనుబంధ విభాగాల ద్వారా మరికొందరు. చరిత్రను పరికించి చూస్తే, రహస్య సాయుధ దళాల సభ్యులుగా పోరు సాగించిన వారెందరో కనిపిస్తారు. వారంతా తుపాకులు చేత పట్టినవారే. శతాబ్ది నాటి సంఘటనలను గుర్తు చేసుకుందాం. అప్పట్లో ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ ఉండేది. పోరాట వీరులకు ఆయుధాలందించడం, ప్రత్యర్థుల తంత్రాల గుట్టుమట్లను తెలుసుకోవడం కూడా వారి పని. అణచివేత పెరిగిపోవడంతో, నాడు చిట్టగాంగ్ ఉద్యమంలో సాయుధ స్త్రీలు పటిమ చాటారు. బాంబులు తయారుచేసి ప్రయోగించిన వారూ అప్పట్లో ఉన్నారు. అవన్నీ ఆంగ్లేయ దురహంకార పాలనకు వ్యతిరేకంగా కొనసాగిన కార్యకలాపాలు. ఆ త్యాగాలు, తెగువ సాటిలేనివి. సమయ సందర్భాలకు అనుగుణంగా వ్యవహరించి, దేశభక్తిని చూపిన ముదితలెందరో. భారత స్వాతంత్ర్య సమరంలో పురుషయోధులతో పాటు నారీమణులూ అనేకమంది ఉండటాన్ని నేటికీ కథలుగా చెప్తున్నాం, వింటున్నాం, చదువుతున్నాం. కాలపరిణామాల్లో భాగంగా ఎన్నెన్నో మార్పు చేర్పులు చోటుచేసుకున్నాయి.

భారత స్వాతంత్ర్య సాధన దరిమిలా, జాతీయ రక్షణ అకాడమీలో ముదితలకూ ప్రాతినిధ్యం లభించింది. పదాలు, నావికా, వైమానిక దళాధిపతులతో సంప్రదింపులు అనంతరం– వీరనారుల పాత్ర, ప్రాధాన్యం పెరిగాయి. అదే సందర్భంలో పరమోన్నత న్యాయస్థానం కూడా, రక్షణ దళాలు కూడా మహిళలకు సముచిత స్థానమివ్వడాన్ని స్వాగతించింది. ఫలితంగా అకాడమీ నిర్వహించిన ప్రవేశ పరీక్షకు అభ్యర్థినులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తదుపరి స్థితిలో సైనిక పాఠశాలలు, మిలటరీ సంస్థల్లో కూడా స్త్రీ స్థానం హెచ్చింది.

రక్షణ రంగంలో సైతం వారు చరిత్ర సృష్టించే సావకాశం విస్తృతమైంది. మహిళలెందరో త్రివిధ దళాల్లో చేరి రాణిస్తున్నారు. శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరిస్తూ, యుద్ధనీతిలో రాటుదేలి, పోరు మార్గాల్లో ముందు నిలిచి, ఆధునికతకు పర్యాయ పదంగా మారుతున్నారు.



ఫ్లైట్ ఆఫీసర్ దీపిక

**కాంతి దీపమాలికలు**

ఝాన్సీలక్ష్మి, రుద్రమదేవి – ఇలా ఎందరు లేరు ధీరవనితలు! ఆ అందరూ స్ఫూర్తి ప్రదాతలే. వర్తమానానికి వస్తే, మన నౌకాదళంలోని యుద్ధ హెలికాప్టర్లను నడిపేవారిలో కొందరు నారీమణులే! వారిని ఎయిర్‌బార్న్ టెక్నిషియన్లుగా పరిగణిస్తుంటారు. తొలి ఇద్దరిలో హైదరాబాద్‌కు చెందిన రీతీసింగ్ ఒకరైతే, ఘజియాబాద్‌కు సంబంధించిన కుముదినీ త్యాగి మరొకరు. ఉభయులూ నావికా విభాగపరంగా (కమాండ్ నిఘా సంబంధిత) కఠోర శిక్షణ పొందారు. ఇద్దరూ బీటెక్ కంప్యూటర్స్ చేసినవారే. అలాగే మరో ధీరవనిత అంబాలా. సమర విమానాలు నడిపే స్క్వాడ్రన్‌కు ఎంపికయ్యారు. ఇదంతా భారతదేశీయమైతే, ఇదే ఆదర్శం, ఇతర దేశాల అభినందనలనీ అందుకుంది. ఇప్పటికీ మన దేశంలో, ప్రత్యేకించి విమానదళంలో వందలాది అధికారిణులున్నారు. పైలెట్లుగా, నావిగేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అంతెందుకు – ఫ్లైట్ లెఫ్టినెంట్ కాంతా. ఇదివరలోనే పాకిస్థాన్‌తో జరిగిన సమరంలో ఆమె పాల్గొన్నారు. మరో ఇద్దరు ఫ్లైట్ ఆఫీసర్లు గురించీ ప్రస్తావించుకోవాలి మనం. అటు తర్వాత దీపిక, నివేదిత. భావన అయితే నాడు తొలి ఫైటర్ పైలెట్. ఇలా 1995, 1999, 2006, 2012, 2019, తదుపరి సంవత్సరాల్లో సైతం నారీశక్తి నిరూపితమైంది. మొట్టమొదటి శాశ్వత కమిషన్డ్ ఆఫీసర్‌గా షాలిజా సేవలను గుర్తు చేసుకోవాలి. పోరాటపటిమ కనబరచినవారిలో మింటీ, పద్మావతి, పునీత, ప్రతిభ వంటి పలువురు పురస్కారాలు సాధించారు. మిలిటరీతో పాటు పారా మిలిటరీ విభాగాల్లోనూ స్త్రీలదే ఆధిక్యత. తీరప్రాంత పరిరక్షక దళ పారామిలిటరీ విభాగాల్లోనూ స్త్రీలదే ఆధిక్యత. తీరప్రాంత పరిరక్షక దళ అధికారులుగా ఒకేసారి నలుగురు ఎంపికైన సందర్భమూ ఉంది. ఆరేళ్లకిందట అసోం రైఫిల్స్ దళంలో కూడా శతాధికంగా మహిళలు చేరారు. విమెన్ రైఫిల్ బృందంలో, సెంట్రల్ పోలీస్ ఫోర్స్‌లో కూడా బాగా పనిచేసిన వారున్నారు. సరిహద్దు భద్రతాదళంలో విధి నిర్వహణతో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన వారూ ఎందరెందరో. శాంతి పరిరక్షణే లక్ష్యంగా జీవితాల్ని అంకితం చేసినవారే వీరంతా. ఉదాహరణలు మరెన్నో.

**తరగని క్రియాశీలత**

నితికా గురించి ఎంత చెప్పినా తక్కువే. పెళ్లయిన కొన్ని నెలలకే భర్త అమరుడయ్యారు. ధైర్యాన్ని కూడగట్టుకున్న ఆమె జీవిత భాగస్వామి ధ్యేయాలనే స్ఫూర్తిగా స్వీకరించారు. అవిశ్రాంతంగా శ్రమించి, లెఫ్టినెంట్‌గా రంగంలోకి దిగారు. సైనిక ధీరుడిగా పోరాడుతూ యుద్ధక్షేత్రంలోనే తుదిశ్వాస విడిచిన ఆయనకు తన లక్ష్య సాధనను అంకితమిచ్చారు. తానూ సైన్యంలో అడుగుపెట్టడమే భర్తకిచ్చిన నివాళి అన్నారు. వేరొక నారీరత్నం శివ. తాను సియాచిన్‌లో కెప్టెన్. అది పాకిస్థాన్ సరిహద్దుల్లోని పర్వత ప్రాంతం. అక్కడ ప్రథమంగా ఆమె భద్రతా విధులు నిర్వర్తించి 'శభాష్' అనిపించుకున్నారు. సముద్రమట్టానికి వేలాది అడుగుల ఎత్తున ఉండేచోట, మంచువల్ల శరీరం గడ్డకట్టుకుపోతున్న ప్రాంతాన కర్తవ్య నిర్వహణ అంటే మాటలా? మరోవైపు, వివిధ దేశాల్లో శాంతి సామరస్యాలే ప్రధానంగా కృషిచేసిన వనితలూ అనేక మంది దీనిని విశిష్టంగా స్వీకరించిన ఐక్యరాజ్య సమితి తన కార్యక్రమాలను విస్తరించింది. అంతర్జాతీయ శాంతి పరిరక్షణ పేరిట బృందాలను నియోగిస్తూ వచ్చింది. అంటే శాంతిస్థాపనను శాశ్వతీకరించడం. దీన్ని దళంగా రూపుదిద్ది ఎనిమిది దశాబ్దాలు దాటింది. క్రియాశీలకంగా వేలాది సిబ్బంది నియమితులయ్యారు. ఘర్షణలు, సంఘర్షణల తదుపరి ఆయా ప్రాంతాల్లో ఉండి, స్థితిగతులన్నింటినీ సమగ్రంగా సమీక్షించడం దళ బాధ్యత. మునుపటి శాంతి స్థాపన ఒప్పందాల సమర్థ అమలుకు సహకరించడమూ విధుల్లో ఒక భాగం. ఒక్క భద్రత అంశమే కాదు; సామాజిక, ఆర్థిక పురోగమనానికి చర్యలూ దీనితో ముడివడి ఉన్నాయి. ఇదే శాంతి భద్రతల పరిరక్షకులను వాడుకలో 'బ్లూహెల్మెట్స్' అని పిలుస్తుంటారు. వారంతా లేత నీలిరంగు దుస్తులు ధరించడమే దీనికి కారణం. నియంత్రణ సమస్తం సమితిదే. శాంతి రక్షణకు కార్యాచరణ విభాగం సభ్య దేశాల సహాయ సహకారాలతో పని చేస్తుంటుంది. నిర్వహణ, విస్తరణలను ఆసాంతం పర్యవేక్షిస్తూ ఉంటుంది.

**బాధ్యత అందరిదీ**

విభిన్న ప్రాంతాల్లోని శాంతిపరిరక్షక బృందాలకు అండదండగా నిలవడాన్ని భారత్ తన కర్తవ్యంగా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఏ దేశాన ఎటువంటి సహకారం అవసరమైనా, తాను ఉన్నానంటూ ముందుకొస్తోంది. తన సేవా బృందాలనే, ప్రత్యేకించి వైద్యసిబ్బందినీ కొరియా ప్రాంతానికి పంపించింది. సోమాలియా,కాంగో మొదలైన దేశాల్లో నియుక్తమైన ఐరాస విభాగాలకు సహాయ హస్తం అందించింది. అందరూ స్త్రీలే ఉన్న టీమ్ నిర్మాణ ప్రక్రియను చేపట్టడం మరింత విశేషం. అలా ఒక ప్రత్యేక పరిరక్షక బృందమే కొన్ని సంవత్సరాల క్రితం లైబీరియా పరిసర ప్రాంతాలకు వెళ్లింది. సైనికులైనా, పోలీసులైనా అంతా వనితలే. వారు చిత్తశుద్ధితో తమవంతు కర్తవ్యాలకు పరిపూర్ణ న్యాయం చేశారు. ఇందులోనే దౌత్యం, సేవ, భద్రత, చేయూత వంటి అనేకం నెలకొన్నాయి. సమితికి ప్రత్యేకమైన నిధులుండటం అత్యంత కీలక అంశం. అవి సభ్య దేశాల నుంచే సమకూరాలి కాబట్టి, ఆ విధంగానూ మన దేశం తోడూ నీడా అవుతోంది. ఇటువంటి కృషి కలాపాలన్నీ సర్వసహజంగానే యుద్ధ భయాన్ని నివారిస్తాయి. ప్రజల సహజ సిద్ధ హక్కులను పరిరక్షిస్తాయి. శాంతిని శాశ్వతంగా స్థాపించడమనేది ఉమ్మడి కర్తవ్యం. సాంస్కృతిక, వారసత్వ సంపదల పరిరక్షణలూ ఒనగూడుతాయని అందరమూ ఆశించవచ్చు. శాంతి సంరక్షణలో వనితల బాధ్యతాయుత నిర్వాహకత్వం ఎంతైనా వందనీయం, అభినందనీయం. లక్ష్యమూ, దాని సాధనా ఉన్నత రీతుల్లో ఉంటాయంటే స్త్రీ భాగస్వామ్యమే మూలం. ఇది ఎప్పటికప్పుడు రుజువవుతూనే ఉంది. ★



**రాష్ట్రంలోని అవినీతి, కుటుంబ, వారసత్వ ప్రాంతీయ పార్టీల వల్ల ప్రజలకు ముప్పు ఏర్పడిందని, కుటుంబ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడటమే లక్ష్యంగా పని చేస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో స్పష్టంచేసింది. జనవరి 24న భీమవరంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాంతీయ పార్టీల తీరు, ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలు, అభివృద్ధి నిరోధక చర్యలు, అవినీతి, వ్యవస్థీకృత దోపిడీపై చర్చ జరిగింది. ప్రాంతీయ రాజకీయ పార్టీలకు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి లేదని, స్వప్రయోజనాల కోసం ప్రజలను పీడించుకు తింటున్నాయని బీజేపీ మొదటి నుంచి విమర్శిస్తూనే ఉంది. ఇచ్చిన హామీలను నెరవేర్చక, సమస్యలను పరిష్కరించక జేబులు నింపుకోవడమే మార్గంగా ప్రాంతీయ పార్టీలు పని చేస్తున్నాయని, ప్రజాప్రతినిధుల నుంచి నాయకుల వరకు భూకబ్జాలు, వనరుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.**



అవినీతిని ప్రశ్నించిన వారిని వేధించి, బాధించి అక్రమకేసులు పెట్టి హింసకు గురిచేసి ఇబ్బందులు పెడుతోందని మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విషయాల్లో వైఫల్యం చెందిందని, సమస్యలు పరిష్కారం కాక, అభివృద్ధి జరగక, ఉపాధి లేక, ధరల భారంతో, శాంతిభద్రతలు క్షీణించి అన్ని విధాల వెనుకబడి పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆదాయం చాలక, అప్పులు కూడా చేసి నగదును పంచుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తీసే స్థాయికి తీసుకెళ్లిందని స్పష్టం చేసింది. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి రాష్ట్రానికి ఏర్పడిన ప్రమాదాన్ని తక్షణం తొలగించాల్సిన ఆవశ్యకతను చర్చిస్తూ, ప్రజల తరఫున బీజేపీ పోరాడుతుందని హామీ ఇచ్చింది. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలంతా బీజేపీకి ఓటేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధిపై పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చింది.

**పరిష్కారం కాని హామీలెన్నో!**

వైసీపీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేసింది. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజధాని లేదు. తెదేపా ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం, శాసనసభలో తీర్మానం చేయడంతో, నాటి ప్రతిపక్ష వైసీపీ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి 7,500 కోట్ల ఆర్థిక సహాయం చేసింది. తెదేపా ప్రభుత్వం అలసత్వం వల్ల రాజధాని నిర్మాణంలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో తెదేపా ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల అవినీతిలో కూరుకుపోయిందని పుస్తకాలు ప్రచురించి తాము అధికారంలోకి వస్తే విచారణ చేస్తామని వైసీపీ ప్రకటించింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి రాష్ట్రంలో పాదయాత్ర చేసి ప్రతి నియోజకవర్గంలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో ఆయనను నిరుద్యోగులు కలిశారు. మొత్తం 2.40 లక్షల ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొంటూ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించడం ద్వారా వాటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, పోలీసు కానిస్టేబుల్ ఖాళీలు భర్తీ చేస్తామని కూడా హామీ ఇచ్చారు. ప్రభుత్వోగులు తమకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరగా అధికారంలోకి వచ్చిన రెండు వారాల్లో వారి కోరిక తీరుస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కాంట్రాక్టు ఉద్యోగాలు రెగ్యులర్ చేస్తామన్నారు. ఇవి కాక వివిధ కులాలకు చెందిన వారి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పెరిగిన ధరలు తగ్గిస్తామని పేర్కొంటూ 'బాదుడే బాదుడు' అనే నినాదం కూడా ఇచ్చారు. పల్లె ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస పోనవసరం లేకుండా వారికి గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. మద్యం నిషేధిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. పోలవరం నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, అవినీతిని వెలికి తీస్తామని చెప్పారు. ఇవి కాక నవరత్నాల పేరుతో నగదు బదిలీ చేస్తామని కూడా హామీ ఇచ్చారు. కాని అధికారంలోకి వచ్చాక ఏ హామీని అమలు చేయలేదు. వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని శాసన సభలో తీర్మానం చేశారు. అమరావతి నిర్మాణం ఆపేశారు. పోలవరం నిర్మాణం కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంపై ఎన్నో ఆరోపణలు చేసినా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని, ఈ విషయంలో రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందంపై ప్రతిపక్షాలు బహిరంగంగా ప్రశ్నిస్తున్నాయి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఆపివేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయలేదు. మెగా డీఎస్సీ లేదు. నిరుద్యోగుల పోరాటంతో దిగివచ్చి ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. నవరత్నాల పథకాలు అమలు కోసం వార్డు సచివాలయ ఉద్యోగాలు ప్రకటించి భర్తీ చేశారు. పెరిగిన వస్తువుల ధరలు అదుపు చేయలేదు సరికదా రెట్టింపయ్యాయి. మద్యం నిషేధించ లేదు సరికదా ప్రభుత్వమే నాసిరకం మద్యం విక్రయిస్తోంది. పైగా మద్యంపై వచ్చే ఆదాయాన్ని 15 ఏళ్లపాటు తాకట్టుపెట్టి అప్పు తెచ్చింది.

**స్వప్రయోజనాలే ముఖ్యమా?**

మూడున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వ పనితీరును గమనిస్తే అందరికీ అర్థం అయ్యేది ఒక్కటే. ఆ పార్టీకి అధికారమే తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు అవసరం లేదు. 2019లో అధికారంలోకి వచ్చింది మొదలు మరలా 2024 ఎన్నికల్లో ఎలా గెలవాలన్న ఆలోచనే తప్ప మరోటి లేదు. ఇచ్చిన హామీలు

# ప్రాంతీయ పార్టీలతో అభివృద్ధి అసాధ్యం!



**తురగా నాగభూషణం**

నెరవేర్చడం, సమస్యలు పరిష్కరించడం, ధరలు అదుపు చేయడం వల్ల ప్రజలు ఉపశమనం పొందుతారు. జరుగుతున్న పలు రకాల ప్రాజెక్టులు పూర్తిచేయడం వల్ల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. కొత్తగా పరిశ్రమలు ఏర్పడితే రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంది. కాని ఇవేమీ పట్టించుకోవడం లేదు.

అభివృద్ధి చేస్తే ఓట్లు వస్తాయనే నమ్మకం ప్రభుత్వానికి లేనట్లు ఆ పార్టీ నాయకుల సంభాషణల్లో తెలుస్తోంది. డబ్బు మాత్రమే ఓట్లు వేయించగలదని ఆ పార్టీ నమ్ముతోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. నవరత్నాల పథకాల పేరుతో డబ్బు పంపిణీని మూడున్నరేళ్లుగా కొనసాగిస్తోంది. ఇప్పటికి రూ. 1.80 లక్షల కోట్ల నగదును లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు మంత్రులు, ముఖ్యమంత్రి సభల్లో ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. నగదు బదిలీల ముఖ్య ఉద్దేశం ఓట్లు కొనుగోలు చేయడమే అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ పథకాలకు నిధుల కోసం పన్నులు, కరెంటు ఛార్జీలు అయిదు సార్లు పెంచారు. బస్సు ఛార్జీలు పెంచారు. పెట్రోలు, డీజిల్ ధరలు కేంద్రం తగ్గించినా రాష్ట్రం తగ్గించలేదు. మద్యం ధరలు మూడింతలు పెంచింది. పాలసీ పేరుతో ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ఆరు నెలల పాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధిని దూరం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా వారికి ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోలేదు. రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరగక రైతులు మిల్లర్లకే తక్కువ ధరకు అమ్ము కుంటున్నారు. రైతులకు సబ్సిడీపై ఇచ్చే యంత్ర పరికరాలు, ఉద్యాన రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను మూడేళ్లుగా అమలుచేయక, ఇటీవల తూతూ మంత్రంగా అయిందనిపించారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ అమలుచేయడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల జీవనోపాధి, స్వయం ఉపాధి పథకాలు, కేంద్ర భాగస్వామ్య పథకాలు మూడున్నరేళ్లుగా నిలిపి వేయడంతో ఆయా వర్గాలు అసంతృప్తికి లోనైనట్లు బీజేపీ కార్యవర్గ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు.

**కొత్త సమస్యలు**

ఇక సమస్యలను ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కార్యవర్గం విమర్శించింది. రాష్ట్రంలో మూడున్నరేళ్ల నుంచి రహదారుల నిర్మాణం జరగలేదు. దెబ్బతిన్న రహదారులకు కూడా కనీసం మరమ్మతులు చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులకు చెల్లించక పోవడంతో రోడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ప్రభుత్వం మారే వరకు రోడ్ల నిర్మాణం చేపట్టబోమని కొందరు కాంట్రాక్టర్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది కాక పంచాయతీల్లో అయితే అసలు పనులే జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు పంపిన నిధులను దారిమళ్లిస్తోంది. వాలంటీర్లను ఏర్పాటుచేసి పనులన్నీ వారితో చేయించడంతో సర్పంచులకు పనిలేకుండా పోవడంతో వారు ప్రభుత్వంపై ఉద్యమానికి దిగారు. జీతాలు పెంచక పోవడం, పాత పెన్షన్ విధానం అమలు చేయక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమం చేశారు.

**అభివృద్ధిపై చిత్తశుద్ధి ఏదీ?**

వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని బీజేపీ కార్యవర్గం విమర్శించింది. ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేసిందని, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులు తప్ప మరే విధమైన అభివృద్ధి పనులు జరగడం లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంత నిధులు ఇవ్వక పోవడంతో ముఖ్యమైన నడికుడి–శ్రీకాళహస్తి, కోటిపల్లి– నరసాపురం మధ్య నూతన లైను నిర్మాణం ఆగిపోయింది. ఇక కేంద్రం పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి అనుమతిని ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం నాలుగింటికి మాత్రమే శంకుస్థాపనలు చేసింది. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, కాకినాడ పెట్రోకెమికల్ సమూహం, శ్రీకాళహస్తి ఎలక్ట్రానిక్స్ పారిశ్రామిక క్లస్టర్, బెంగుళూరు–చెన్నై పారిశ్రామిక క్లస్టర్, శ్రీసిటి పారిశ్రామిక సమూహం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో రెండు సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్ (నేషనల్ ఇన్వెస్ట్ మెంట్ మ్యానుఫాక్చరింగ్ జోన్)ల ఏర్పాటుకు కేంద్రం అనుమతిని ఇస్తే భూసేకరణ చేయకపోవడంతో పరిశ్రమలు ఏర్పడక, ఇవి అందుబాటులోకి రాలేదు. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని కార్యవర్గం ఆందోళన వెలిబుచ్చింది.

**శాంతిభద్రతలపై ఆందోళన**

వైసీపీ ప్రభుత్వం స్టేట్ టెర్రరిజానికి పాల్పడుతున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పాలనా వైఫల్యాన్ని, అవినీతిని, రౌడీయిజాన్ని ప్రదర్శిస్తోన్న ప్రభుత్వం తనను ప్రశ్నిస్తోన్న పార్టీలు, ప్రజలు, ఉద్యమకారులకు సమాధానం చెప్పలేక, సమస్యలు పరిష్కరించక, కార్యకర్తలు, పోలీసులచే ఎదురుదాడులకు దిగుతోందనేది విపక్షాల వాదన. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తమ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయడం లేదని బీజేపీ ఆరోపిస్తోంది.

ప్రతిపక్షాలను ఉద్యమాలు చేయనీయకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం జారీచేసిన జీవో నెంబరు 1ను తక్షణం రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 65 ఏళ్లలో జరగని అభివృద్ధిని మోదీ ప్రభుత్వం 9 ఏళ్లలో చేసి చూపించిందని, పలు జాతీయ విద్యాసంస్థలు, లక్ష కోట్లతో రహదారులు, ఫ్లైవంతెనలు, రైల్వేప్రాజెక్టులు, ఓడరేవులు నిర్మిస్తోందని, పోలవరం నిర్మాణానికి పూర్తి నిధులిస్తోందని, పేర్కొంది.

*వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్*

వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని బీజేపీ కార్యవర్గం విమర్శించింది. ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేసిందని, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులు తప్ప మరే విధమైన అభివృద్ధి పనులు జరగడం లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంత నిధులు ఇవ్వక పోవడంతో ముఖ్యమైన నడికుడి–శ్రీకాళహస్తి, కోటిపల్లి– నరసాపురం మధ్య నూతన లైను నిర్మాణం ఆగిపోయింది.

❋ రామాయణంలోని పాత్రలు ❋



# ఆదర్శప్రాయుడు శ్రవణ కుమారుడు

రామాయణంలోని పాత్రల్లో చిన్నదైనప్పటికీ శ్రవణ కుమారుడి పాత్ర కీలకమైనదిగానే చెప్పుకోవలసి ఉంటుంది. శ్రవణ కుమారుడి తల్లిదండ్రుల శాపమే లేకపోతే దశరథుడికి పుత్రవియోగ దుఃఖం ఉండేది కాదు. అంటే రాముడిని అడవులకు పంపే అవసరం ఉండేది కాదు. రావణ సంహారమే జరిగి ఉండేది కాదు. శ్రీరాముడి జననానికి ముందే దశరథుని జీవితంలో సంభవించిన విచిత్ర విషాద సంఘటన శ్రవణ కుమారుని వృత్తాంతం. రాముడు వనవాసానికి వెళ్లిన తర్వాత దశరథుడే ఈ వృత్తాంతాన్ని కౌసల్యకు చెప్పుకొంటాడు. పాత్ర విషయానికి వస్తే... తల్లిదండ్రుల పట్ల ఎంతటి అంకితభావం కలిగి ఉండాలో చెప్పే మహోన్నత వ్యక్తిత్వం గల పాత్ర శ్రవణ కుమారుడు. ఇతని తండ్రి శంతనవుడు, తల్లి జ్ఞానవతి. 'వినికిడి' అంటే.. శ్రవణ ప్రధానమైన అస్త్రవిద్యతో అనగా 'శబ్దభేది'తో కొట్టబడిన మునికుమారుని కరుణామయ గాథ శ్రవణమై.. ముని కుమారుని పేరు శ్రవణుడుగా, శ్రావణుడుగా మారిందని భావించవచ్చు. ఏదేమైనా శ్రవణుని చరిత్ర, తల్లిదండ్రుల పట్ల భక్తికి ప్రతీకగా లోకంలో నిలిచిపోయింది. తల్లిదండ్రుల సేవలో తరించిన ఉత్తములైన కుమారులు భారతీయ సాహిత్యంలో చాలామంది కనిపిస్తారు. వృద్ధులైన తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టి, స్వయంగా మోస్తూ తీర్థయాత్రలకు తిప్పిన శ్రవణ కుమారుడి కథను రామాయణం వివరించింది. తండ్రి ఆనతి మేరకు రాజ్యాధికారాన్ని వదులుకొని శ్రీరాముడు అడవుల బాటపట్టిన విషయమూ వర్ణించి చెప్పింది.

రామాయణంలో నామమాత్రంగా కనిపించిన శ్రవణ కుమారుని పాత్ర అనంతర కాలంలో చిగురులు తొడిగి అద్భుతమైన ఇతివృత్తమై, ఎందరో మహాపురుషులకు ఆదర్శప్రాయమైంది. ★

దోర్బల పూర్ణిమాస్వాతి

# నువ్వూ తిట్టుకో

భగవాన్ రమణమహర్షితో చనువున్న ఓ యువకుడు ఓరోజు ఆదరాబాదరగా వచ్చి నమస్కరించాడు.

అతని వాలకం చూసి రమణమహర్షి అతనేదో కంగారుగా ఉన్నాడని గ్రహించారు.

"ఏంటీ, నీలో ఏదో అలజడి కనిపిస్తోంది. ఏమైందేమిటీ? ఎవరన్నా ఏదన్నా అన్నారా?" అని అడిగారు భగవాన్.

"ఎలా గ్రహించారు స్వామీ? నిజమే. నన్నొకడు తరచూ ఇష్టమొచ్చినట్లల్లా తిడుతున్నాడు. ఆ మాటలు వింటుంటే కోపమొస్తోంది. ఆ సమయంలో ఏదో తెలియని బాధ. తట్టుకోలేకపోతున్నాను. ఏం చేయాలో తెలీడం లేదు. ఈ కోపాన్ని ఎలా అధిగమించాలి?" అని సలహా అడిగాడు.

"ఓస్. ఇంతేనా. అప్పుడు నువ్వేం చేయాలంటే నువ్వూ అతనితో కలిసి నిన్ను నువ్వు తిట్టుకో....సరిపోతుంది" అన్నారు భగవాన్.

ఆ మాట యువకుడికి అర్థం కాలేదు.

"నన్ను నేను తిట్టుకోవడమేంటి గురువుగారూ" అని అడుగుతూ అమాయకంగా మొహం





❋ 'మొక్క'బడి ❋

అత్యంత మహత్త్యం కలిగిన పుష్పాలలో మల్లికార్జున పుష్పం ఒకటి. దీనినే శివలింగ పుష్పం అంటారు. ఈ పుష్పంతో శివుడిని పూజించడం వల్ల విశేష ఫలితం కలుగుతుందని పండితులు చెబుతున్నారు. అసలు శివలింగ పుష్పాలు ఎలా ఉంటాయి? వీటితో శివుడిని పూజించడం వల్ల కలిగే ఫలితాలు ఏమిటి? వివరాలను తెలుసుకుందాం. ఈ పుష్పాలు

# మహిమాన్వితం

శివలింగ వృక్షం నుండి లభిస్తాయి. ఈ వృక్షాలు దక్షిణ భారతదేశంలో, దక్షిణ అమెరికాలో ఎక్కువగా ఉంటాయి. దీనిని నాగ లింగ వృక్షం అని కూడా అంటారు.వీటిని నాగమల్లి, మల్లికార్జున పుష్పాలుగా కూడా పిలుస్తూ ఉంటారు.

ఈ పుష్పాల మధ్య భాగం పడగ విప్పిన సర్పంలాగా ఉంటుంది. ఈ వృక్షం ఆకులు వెంట్రుకల లాగా ఉంటాయి. ఈ శివలింగ పుష్పాలు కొమ్మలకు బదులుగా వెంట్రుకలాంటి భాగాలకు పూస్తాయి. పుష్పాల పై భాగాన నాగపడగ కప్పినట్టు ఉండి లోపల శివలింగాకృతిలో ఉంటాయి. వీటిని నాగమల్లి పుష్పాలుగా కూడా పిలుస్తూ ఉంటారు. ఇవి ఎంతో చక్కని



పెట్టాడు.

అప్పుడు భగవాన్ ఇలా అన్నారు...

"కోపాలూ తాపాలూ అన్నింటికీ ఈ దేహమే మూలం. ఎవరైనా మనల్ని తిడుతున్నప్పుడు ఈ దేహాన్ని చూసే తిడతారు. కనుక నువ్వూ ఏం చేస్తావంటే నిన్ను ఎవరైనా తిడుతున్నప్పుడు అతనితో కలిసి నిన్ను నువ్వే తిట్టుకో. నిజానికి తిట్టేవారి మధ్య ఉంటేనే మనకు ప్రయోజనం. మనల్నెవరైనా తిడుతున్నారంటే మనల్ని నిద్ర లేపుతున్నారని, మనల్ని 'చైతన్యపరుస్తున్నార'ని అర్థం. మన కళ్లు తెరిపిస్తున్నారని తెలుసుకోవాలి. కనుకే చెప్తున్నా.. తిట్టే వాళ్ల మధ్య ఉంటేనే ఏదన్నా లాభం. మనల్నెప్పుడు. పొగిడే వారి మధ్య ఉంటే ఎప్పటికీ కళ్లు తెరవం, ఆ ఆనందం నుంచి ఇవతలకు రాలేం. అలా రావడానికి మనసు ఒప్పుకోదు. దానివల్ల చెరుపే తప్ప లాభముండదు" అని. ★



# మల్లికార్జున పుష్పం

పరిమళాన్ని వెదజల్లుతూ ఉంటాయి.

ఈ పుష్పాలు సర్వ దేవతలకు.. ముఖ్యంగా శివుడికి ఎంతో ప్రీతికరమైనవి. ఈ పుష్పాలతో శివున్ని పూజించడం ప్రతి భక్తునికి ఒక వరం. వీటితో శివుడిని పూజించిన వారు జన్మరాహిత్యం పొంది కైవల్యం చేరుకుంటారని శివపురాణం చెబుతోంది. శివలింగ పుష్పాలను దేవుడి తలపై లేదా భుజస్కంధాలపై మాత్రమే సమర్పించాలి. పార్వతీదేవికి ఈ పుష్పాన్ని మాంగల్యంలో సమర్పించాలని పండితులు చెబుతున్నారు. శివలింగ పుష్పంతో పూజలు చేయడం వల్ల కోరిన కోరికలు తీరుతాయని.. ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు కలుగుతాయని పండితులు చెబుతారు. ★

## మార్కాపురంలో ఆర్ఎస్ఎస్ సద్భావన సదస్సు





**ఒంగోలు :** మార్కాపురం ఖండ సద్భావన సదస్సు ఒంగోలు జిల్లా, మార్కాపురంలో జనవరి 22న జరిగింది. 12 కులాల నుండి 72 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు తులసి సూర్యప్రకాశ్ ప్రసంగించారు. ఖండ సంఘచాలక్ పానుగంటి శ్రీనివాస్, విభాగ సంపర్క ప్రముఖ్ చెంచురామయ్య, జిల్లా కార్యకారిణి సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ★

## స్వావలంబన దిశగా..



**కర్నూలు :** హిందూ సమాజంలోని చిరు వ్యాపారులను స్వావలంబన దిశగా నడిపించేందుకు కర్నూలు మహానగరంలోని నగరేశ్వర ఉపనగర్ శాఖ కార్యకర్తలు తమ వంతు కృషి చేస్తున్నారు. తిరిగి చెల్లించే పద్ధతిన తోపుడు బండ్లకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటిదాకా 8 మందికి బండ్లు అందించారు. ఈ క్రమంలోనే జనవరి 23న స్థానిక ఎస్.వి.ఎస్. హైస్కూల్ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్. సహ క్షేత్ర ప్రచారక్ భరత్ చేతుల మీదుగా ఇద్దరికి బండ్లు అందించారు. ఆరోగ్య భారతి నగర కార్యదర్శి కుంపటి కృష్ణయ్య, ఇంకా ఎ. రమణయ్య, మేఘనాథ రావు, డా॥ మేడూరి రామశర్మ, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. ★

ఆనాటి రాత్రి శయన మందిరంలోనికి అడుగుపెట్టిన భర్తను సాదరంగా లోనికి తీసుకొని వచ్చి శయ్యపై కూర్చుండపెట్టింది నూతన వధువు. తాను నేలపై కూర్చుండి అతని పాదాల మీద పారిజాత, అశోకపుష్పాలు ఉంచింది.

"ఇదేమి పని? నీవు కూర్చుండవలసినది నేలపై కాదు, నా హృదయసీమలో" అని విక్రమాదిత్యుడు ఆమెను లేవతీసి, తన ప్రక్కన కూర్చుండ పెట్టుకున్నాడు.

"పూజ చేసినది నాలో స్త్రీత్వాన్ని మేలుకొలిపిన నా నాథుడికి. ఆనాడు యోగ మాయాదేవి మందిరంలో మిమ్ము చూసిన క్షణమే నా హృదయంలో నిలుపుకున్నాను. మీరెవరో నాకు తెలియదు. కుమారులు లేని కారణంగా కాబోలు నా తండ్రి నాకు వీరవిద్యలను నేర్పించారు. నేను మగువనన్న ఊహ నాలో ఏనాడూ లేదు. ఆనాడు మీ గానం నాలో నిద్రాణమైన స్త్రీత్వాన్ని మేలుకొలిపింది. నా మనసులో మీ రూపం ముద్రితమైపోయింది."

విక్రమాదిత్యుడు మాటలాడేలోగానే "మీ వివరాలు తెలిసికోవాలని ఎంతగానో అనుకున్నాను. ఇంద్రప్రస్థాన్ని ముట్టడించినప్పుడు అంతఃపుర వాసులను కట్టడి చేసి లోపలనే ఉంచి వేసినారు. మాతామహులు నన్ను రణరంగంలో యుద్ధం చేసేందుకు అనుమతించలేదు" అని లక్ష్మీదేవి అన్నది.

"స్త్రీ రక్షణ ప్రభువుల బాధ్యత"

"అజయమేరు నగరానికి తిరిగివచ్చిన తర్వాత మా జనకులు నా వివాహ ప్రసక్తి తెచ్చినారు. నేను నిత్య కన్యకగానో, బౌద్ధ సన్యాసినిగానో ఉండి పోగలనని చెప్పాను. నా మనసులో మీకు తప్ప మరి ఎవరికి స్థానం లేదు. కానీ తండ్రి గారితో ఆ విషయమేమని చెప్పగలను? మీ గురించి తెలియదు. మీ మనసు తెలియదు."

విక్రమాదిత్యుడు ఆమె చుట్టూ చేయి వేసి "నా మనసును నీవు ఆనాడే గెల్చుకున్నావు. పురుష రూపంలో ఉన్నప్పటికీ, 'నేను పురుషుడనే' అని నీవు ఉద్ఘాటించినప్పటికీ నేను నమ్మలేకపోయాను. నీవు భువనైక సుందరివని ఆనాడే గ్రహించాను. కానీ రాజధర్మం ముందు నీ ప్రేమ తరంగిణి ఆగిపోయింది. పరమేశ్వర కటాక్షంతో ప్రేమధర్మాలు ఒక చోటనే సిద్ధించినాయి" అన్నాడు.

"మా తండ్రిగారు అనేక రాజ్యాల నుండి చిత్రపటాలు తెప్పించినారు. నాకు నచ్చినవారినే వరించవచ్చునని అన్నారు. చిత్రపటాలను చూసి, అందరినీ తిరస్కరించి, భగవత్సన్నిధిలోనే ఉండి పోవాలనుకున్నాను. కానీ నా పూర్వజన్మ సుకృతం కొద్దీ మీ పటం కన్పించింది. నా వలపు పంట పండింది."

"నీది మాత్రమే కాదు. మన ఇద్దరి వలపు పంట పండింది. భగవంతుని కరుణ".

మీకొక రహస్యం చెప్పనా? ఆనాడు నా పేరు వీరసేన అని మీకు తెలియచేశాను. అందులో అసత్యమేమీ లేదు. నాకు వీరలక్ష్మీదేవి



ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

6




అని పేరు పెట్టారు. ఆంతరంగికులకే ఆ విషయం తెలుసు. వీరా అనీ, వీరసేనా అనీ తండ్రిగారు పిలుస్తూ ఉంటారు”.

“వీరా!” అని విక్రమాదిత్యుడు పిలిచాడు.

“మహావీరా!” అని నూతన వధువు చిరునవ్వుతో భర్త ఎదపై తలపెట్టుకున్నది.

* * *

మరునాడు మిహిరుడు విక్రముని దగ్గరకు వెళ్లి, “మిత్రమా! సెలవు!” అన్నాడు.

“అదేమి? ఉజ్జయినికి అందరము కలిసియే పోవచ్చును.”

‘‘వైద్యశాస్త్రంలోని ప్రాథమిక సూత్రాలను అభ్యసించేందుకు తక్షశిలకు పయనమవుతున్నాను. ఆపైన పారసీకం వెళ్లి యవన జ్యోతిషం నేర్చుకో వాలని ఉన్నది. అలెగ్జాండరు దండయాత్ర అనంతరం పారసీకం గ్రీకుల వశమైన సంగతి నీకు తెలియనిది కాదు. అతని సేనాధిపతి సెల్యూకసు వారసులే కొంతకాలమక్కడ రాజ్యం చేశారు. ఆ సమయంలో గ్రీసు నుండి అనేక మంది పండితులు వచ్చి, అక్కడ నివాసమేర్పరుచుకున్నారు. నేడు పారసీకంలో గ్రీకుల అధికారం లేనప్పటికీ, యవన పండితులు వెనుకకు పోలేదు”.

‘‘మాతృ సమానురాలు, గురుపత్ని నీ విదేశయానాన్ని అంగీకరించినారా?


“పితృదేవులే ఆమెను ఒప్పించినారు. శీఘ్రంగా తిరిగి రావలెనని జననీ జనకుల ఆదేశం”.

‘‘నా కోరిక కూడా అదే. శాస్త్ర విజ్ఞానం సంపాదించి త్వరలోనే వచ్చెదవు గాక”.

“నీ కోరిక కనుక తప్పక తీరగలదు. నీవు కోరిన కన్యయే నీకు గృహిణిగా లభించినది కదా!”

“నీకెట్లు తెలిసినది?”

మిహిరుడు విక్రముని కౌగిలించుకుని, “స్నేహితుని అంతరంగాన్ని గ్రహించలేనా? వివాహ వేదిక మీద నీ ముఖ కవళికలే చెప్పాయి” అన్నాడు.



“మనసులోని ఊహలు ముఖం మీద కన్పించాక నాకు మహారాజు పదవికి అర్హత ఉన్నదా?’’ విక్రమాదిత్యుడన్నాడు.

‘‘అదేమిమాట? నాకు తప్ప ఎవరికీ నీ మనోభావాలు తెలియవు. ఇక సెలవు!”.

* * *

వివాహం జరిగిన వారానికి అజయరాజు విక్రమాదిత్యునితో ‘‘ఇదివరలోనే విన్నవించు కున్నాను. నాకు పుత్ర సంతానం లేదు. తామే ఈ రాజ్యలక్ష్మిని కూడా స్వీకరించవలసినది. నా కుమార్తెకు వీరోచిత విద్యలను నేర్పించినాను. రాజనీతి కూడా నేర్చుకున్నది. అయినప్పటికీ సనాతన సంప్రదాయాలననుసరించి స్త్రీకి సింహాసనార్హత లేదు. అజయమేరు రాజ్యం దాయాదుల పాలు కావడం భావ్యం కాదు. నా కోరిక మన్నించవలసినది” అన్నాడు.

విక్రమాదిత్యుడు మంత్రులతో సంప్రదించి, అంగీకారం తెలిపాడు. శుభ ముహూర్తాన విక్రమాదిత్యుని పట్టాభిషిక్తుని చేసిన అనంతరం అజయరాజు కోరికపై పురోహితులు ‘‘విక్రమా దిత్యుడు త్వరలో చక్రవర్తి కాగలడు’’ అని ఆశీర్వదించారు.

* * *

ఉజ్జయినీ నగరానికి తిరిగివచ్చిన వెంటనే విక్రమాదిత్యుడు భార్యా సమేతుడై ఆశ్రమానికి వెళ్లి తల్లిదండ్రులకు నమస్కరించాడు.

“అగ్నివంశ సంజాత అజయరాజు పుత్రిక, విక్రమాదిత్యుల భార్య వీరలక్ష్మి నమస్కరిస్తున్నది. ఆశీర్వదించ ప్రార్థన”.

“అమ్మా! వీర, పుత్ర పౌత్రాభివృద్ధిగా, దీర్ఘ సుమంగళిగా వర్ధిల్లు!”

“ధన్యురాలను!”

“నీవు విశేష వీర విద్యలను అభ్యసించినావని తెలిసి ఆనందించాం. అవంతీ రాజ్య సంరక్షణలో నీ విద్య ఉపయుక్తమగును గాక”.

“తమ ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష”

‘‘కుమారా! రేపు ఉదయమే ఇరువురూ పరమేశ్వరాలయానికి వెళ్లి, స్వామిని అర్చించుట శ్రేయస్కరం.”

“జనకుల ఆజ్ఞ.”

నూతన వధూవరులు మరొకసారి నమస్కరించి, రాజధానికి మరలారు.

* * *

రాజ దంపతులు కార్తిక మాసంలో సోమవారం ఉదయమే శివాలయానికి వెళ్లి, పరమేశ్వర దర్శనం చేసికొన్నారు.

పూజానంతరం విక్రముడు “ద్వాదశ జ్యోతిర్లింగా లలో ఈ లింగమొకటి. మహాకాళునిగా ఇక్కడ స్వామి ప్రసిద్ధుడు” అని తెలియజేసినాడు.

“లింగం దక్షిణముఖంగా ఉన్నదేల?” అని వీరలక్ష్మి ప్రశ్నించింది.

‘‘ఇక్కడ స్వామి మహాకాళునిగా అర్చనలు అందుకుంటున్నాడు. కాలు లేదా యమధర్మరాజు మహాకాళుని ఆజ్ఞ లేనిదే ఎవరి ప్రాణమునూ హరించ లేడు. స్వామికి విన్నవించిన అనంతరమే ఏ జీవి ప్రాణాన్నయినా తనతో తీసుకొని వెళ్లాలి. యమధర్మ రాజు దక్షిణ దిక్కులో నివాసముంటాడు కాబట్టి మహాకాళుడు దక్షిణ ముఖంగా ఇక్కడ కొలువై నిలిచినాడు” అని వివరించాడు.

‘‘ప్రతి దేవాలయంలోనూ శివలింగాన్ని ఏ విధంగా ప్రతిష్టించినా, ఆలయంలో దక్షిణామూర్తి విగ్రహం ఉండడం నీవు చూసియే ఉందువు” అని విక్రమాదిత్యుడు అన్నాడు.

ఇరువురూ మహాకాళి నామంతో వెలసిన అమ్మవారి దర్శనం చేసికొన్న తర్వాత విక్రముడు “ద్వాదశ లింగాలలో ఒకటి, అమ్మవారి అష్టాదశ పీఠాలలో ఒకటి ఉజ్జయినిలో నెలకొని ఉండుట ఈ నగర ప్రజల పురాకృత పుణ్యఫలం. శ్రీశైలం, వారణాసిలో సైతం జగన్మాతా పితరులు ఈ విధంగా

కొలువైనారు" అని చెప్పినాడు.

"అమ్మ ఎంతటి అదృష్టానికి నోచుకున్నదో, పతిలో సగభాగమైనది" అని వీరలక్ష్మి భర్త చేతిని తన చేతిలోనికి తీసికొన్నది.

"వీరయేనా ఈ మాటలంటున్నది?" విక్రముడు చిరునవ్వుతో ప్రశ్నించినాడు.

"జగదంబను మించిన వీరవనిత ఎవరు? మహిషాసుర సంహార సమయంలో పురుషులైనా ఆమెను మించగలరా? రాక్షస సంహారంలో ఆమె వజ్రం కన్నా కఠినమైన శరీరం కలది. భర్త సన్నిధిలో శిరీష కుసుమము కన్నా సుకుమారి".

"నీ వలెనా?"

"జగన్మాత పాదరేణువుగా ఉండేందుకైనా అర్హత లేని దానను. నాకూ, ఆమెకూ పోలిక ఒక్క విషయములోనే. పతి ఎడబాటును నేను కొంచెమైనా సహించలేను. ఆమె వలె సగభాగమైన ఎంత బాగుండునో?"

"దేవాలయంలో ప్రేమ విషయాలు మాట్లాడ తగునా?"

"నన్ను మీరు హాస్యములాడుట న్యాయమా?"

ఇరువురూ సన్నగా నవ్వుకొన్నారు. ఆపైన దేవాలయ శిఖరానికి నమస్కరించి, రథమునెక్కి ప్రాసాదమును చేరుకొన్నారు.

* * *

మిహిరుడు వాయవ్యదిశగా పయనించి, పాంచాల రాజ్యాన్ని దాటి తక్షశిల చేరుకున్నాడు. శ్రీరామచంద్రుడు భరతుని కుమారులిద్దరకూ రాజ్యాలిచ్చిన సమయంలో భరతపుత్రుడు తక్షునకై నిర్మింపచేసిన నగరమే కాలక్రమేణ తక్షశిలగా పేర్గాంచింది. తక్షశిలలోని విద్యాలయం జగత్ప్రసిద్ధం. మిహిరుడు విద్యాలయ కులపతులను దర్శించి తన కుల గోత్రాలనూ, నివాసాన్నీ విన్నవించి, నమస్క రించాడు.

కులపతి సాదరంగా "ఆదిత్యదాసుల గురుకులం మాకు తెలిసినదే. విద్యార్థులనేకులు విశేష విద్యార్జనకై మా వద్దకు వస్తూంటారు" అన్నాడు.

వైద్యశాస్త్రంలోని ప్రాథమికాంశాలు నేర్చుకోవా లని ఉన్నది. ఖగోళ శాస్త్రానికి అనుబంధమైన వైద్య విద్యా విషయాలను తెలుసుకోవాలని నా కోరిక".

"అటులనే" అని చెప్పి కులపతులు మిహిరుని వైద్యాచార్యుల వద్దకు పంపించినాడు. మిహిరుడు యవన జ్యోతిషం అభ్యసించవలెనన్న కోరిక ఉందని తెలిసిన తర్వాత ఆయన "నీవు గ్రీకు, పారసీక భాషలు నేర్చుకోవడం మంచిది. పారసీక రాజ్యాన్ని కొంత కాలం గ్రీకులు పాలించడం చేత అక్కడ పారసీక, గ్రీకు భాషలు రెండూ వ్యవహారంలో ఉన్నాయి. గ్రీకు నేర్వడం సులభం. సంస్కృతం వలె ఉంటుంది. మన విద్యాలయంలోనే నీవు రెండు భాషలనూ అభ్యసించ వచ్చును" అని అన్నాడు.

వైద్యశాస్త్రాంశాలనూ, గ్రీకు, పారసీక భాషలనూ ఒక సంవత్సరంలో నేర్చుకున్న మిహిరుడు జననీ, జనకులకు లేఖ రాశాడు. తాను పారసీక రాజ్యానికి పయనమవుతున్నాననీ, యవన ఖగోళ శాస్త్ర మభ్యసించి, తిరిగి రాగలననీ తెలియజేశాడు. తల్లిదండ్రుల ఆశీర్వాదబలమూ, భగవదనుగ్రహమూ తాను త్వరలో తిరిగి వచ్చేలా చేయగలవని అన్నాడు.

* * *

మిహిరుడు పారసీక రాజధానిని చేరుకునేసరికి సాయంకాలమైంది. భరత భూమిలో జరిగినంత సులభంగా పారసీక రాజ్యంలో ప్రయాణం సాగలేదు. భరతఖండంలో రాజులూ, సంపన్నులూ వితరణ శీలులై మార్గమంతటా వసతి సౌకర్యం, అన్నదానం ఏర్పాటు చేసినారు. గ్రీకుల పాలనలో కొంతకాలం ఉండడమేమో, కారణమేమో తెలియదు కానీ పారసీక రాజ్యంలో బాటసారులకు ఎటువంటి సదుపాయాలు లేవు. వృక్ష ఛాయలో విశ్రాంతి. ఫలాలే ఆహారం.

నగర ప్రవేశం తరువాత మిహిరునికి రాత్రి ఎక్కడ ఉండాలన్న ప్రశ్న ఉదయించింది. కొంతసేపు ఆలోచించి, ధైర్యం చేసి ఎదురుగా ఉన్న ఇంటి తలుపు తట్టాడు. తలుపు తీసిన వ్యక్తి స్త్రీ. అన్య కాంతలను చూడరాదన్న నియమాన్ని అనుసరించి, కనులు దించుకుని, "నా నామధేయం మిహిరుడు. భరతభూమిలోని ఉజ్జయినీ నగరవాసిని. కార్యార్థినై..." అని చెప్పే లోగానే ఆమె "నా పేరు ఖనా. నేను ఈ దేశ వాసిని" అని అన్నది.



నగర ప్రవేశం తరువాత మిహిరునికి రాత్రి ఎక్కడ ఉండాలన్న ప్రశ్న ఉదయించింది. కొంతసేపు ఆలోచించి, ధైర్యం చేసి ఎదురుగా ఉన్న ఇంటి తలుపు తట్టాడు. తలుపు తీసిన వ్యక్తి స్త్రీ. అన్య కాంతలను చూడరాదన్న నియమాన్ని అనుసరించి, కనులు దించుకుని, "నా నామధేయం మిహిరుడు. భరతభూమిలోని ఉజ్జయినీ నగరవాసిని. కార్యార్థినై...." అని చెప్పేలోగానే ఆమె "నా పేరు ఖనా. నేను ఈ దేశ వాసిని" అని అన్నది.

మిహిరుడు ఈమె తన వివరాలు ఎందుకు చెబుతున్నదోనని ఆశ్చర్యపడి, "నాకు ఈ రాత్రి మీ గృహ ప్రాంగణంలో నిద్రించేందుకు అనుమతినీయ ప్రార్థన" అన్నాడు.

ఖనా సమాధానమిచ్చే లోగానే ఇంటిలో నుంచి వచ్చిన పురుషుడు విషయం తెలిసికొని "ప్రాంగణంలో ఎందుకు? లోపలే శయనించ వచ్చును. రండి" అని మిహిరుని లోపలకు తీసుకొని వెళ్లి, ఒక గదిని చూపించాడు. అలసి ఉన్న మిహిరుడు శయ్యపై పడుకున్న మరుక్షణమే నిద్రించాడు.

మరునాడు ఉదయమే మేల్కొన్న మిహిరుడు గృహ యజమానికి కృతజ్ఞతను తెలియజేసి, సెలవిప్పించమని అడిగాడు. ఆయన "ఇక్కడనే కాలకృత్యాలు తీర్చుకుని వెళ్లవచ్చును" అన్నాడు. మిహిరుడు స్నాన జప, సంధ్యావందనాదికాలు పూర్తి చేసుకొని వచ్చిన తర్వాత గృహ యజమాని మిహిరుని రాకకు కారణమడిగాడు.

తాను ఖగోళశాస్త్ర విద్యార్థిననీ, యవన జ్యోతిషం నేర్చుకొనేందుకు వచ్చాననీ మిహిరుడు చెప్పినాడు.

"యవనులుండు ప్రదేశం మీకు అనుకూలంగా ఉండదు. విద్యార్జనకై గ్రీకు గురువుల వద్దకు పోవచ్చును కానీ అక్కడ ఉండడం భరతభూమి వాసులకు కష్టం. మీరు మా ఇంటినే ఉండవచ్చును. మేము అగ్ని ఆరాధకులం. ఆచార వ్యవహారంలో భరత ఖండ ప్రజలకూ, మాకూ సామీప్యమున్నది."

"మీకు ఇబ్బంది కల్గించుట..."

"ఇబ్బంది ఏమున్నది? ఇంట ఉన్నది ఇద్దరమే. నేనూ, నా పుత్రిక ఖనా, దాస దాసీ జనమున్నది."

"కృతజ్ఞుడను... స్వయంపాక నియమమున్నది. నేనే నా భోజనమునకు ఏర్పాటు చేసికొనగలను."

"సరే"

* * *

మిహిరుడు వీధిలోనికి వెళ్లి, దారి తెలిసికొని బియ్యం, పప్పు, పెరుగు, కుండలు కొని తెచ్చు కున్నాడు. తక్షశిల విద్యాలయ కులపతులు పారసీక భాష ఎందుకు నేర్చుకొనమన్నారో అతనికి బోధపడింది.

ఇప్పుడు వంట చేయవలెను. ఎట్లు? ఇంటిలో ఉన్నప్పుడు హోమం కోసం అగ్ని వ్రేల్చటం అలవాటయిన కార్యమే. ఇక కష్టమేమున్నది? ముందుగా రెండు కర్రలతో అగ్నిని రగిల్చి, మరికొన్ని కర్రలను చేర్చి, కుండలో నీరు, బియ్యం పోసి పెట్టినాడు. గడియకు అన్నం పొంగినది. ఉడికినది కాబోలునని పక్కన పెట్టి, వేరొక కుండలో పప్పు, నీరు పోసి పెట్టినాడు. పొంగిన వెంటనే దింపినాడు.

"ఇదేమి అన్నమిట్లున్నది? ఒక ప్రక్కన మెత్తగా పిండి వలెనున్నది. మరొయొక ప్రక్కన బియ్యమే. పప్పు ఉడుకనే లేదు. ఖగోళశాస్త్రం కంటే పాకశాస్త్రమే కష్టతరమా?"

అతని కనుల ముందు మాతృదేవత ఛాయాదేవి కదలాడింది. ఆమెకు నమస్కరించి, మధ్యాహ్న సంధ్యావందనం నిర్వర్తించి, భోజనం ముగించినాడు.

(సశేషం)


కృష్ణార్జునులు నరనారాయణులు కాగా భీష్మాచార్యుడు శిఖరాయమానుడు. జగద్గురువు శ్రీకృష్ణుడు, మహర్షి వేదవ్యాసుడితో సరితూగే వ్యక్తిత్వం ఆయనది. మహాభారతానికి కేంద్ర బిందువు. తాను పెంచి పోషించిన వంశం ఒడుదొడుకులను ఎదుర్కొంటూ, దుష్టచతుష్టయం చేష్టలతో నిర్వీర్యం అవుతుండగా సమస్త పరిణామాలను నిశ్చలచిత్తంతో గమనిస్తూ పరిస్థితులను అధిగమించిన స్థితప్రజ్ఞుడు. జీవితాంతం అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా ఓటమిని ఎరుగుని ధీరుడు, మహావీరుడు. కనుకనే అనంతరం కాలంలో 'భీష్మాచార్యుడు లాంటి వారు' అనే ఉపమానంగా స్థిరపడిపోయాడు.



# ధర్మకోవిదుడు.. స్థితప్రజ్ఞుడు

భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు. భీషణమైన ప్రతిజ్ఞ వల్ల భీష్ముడయ్యాడు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడిలా, ద్వాపరంలో ఆయన పితృవాక్య పాలకుడిగా నిత్యస్మరణీయుడు. తండ్రిమాటపై రఘురాముడు వనవాసానికి వెళితే, తండ్రికిగల మరో వివాహ అభిలాషను నెరవేర్చేందుకు ఈయన ఆజన్మ బ్రహ్మచర్యం స్వీకరించాడు. 'ప్రహ్లాద నారద పరాశర పుండరీక/వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్' అని పేర్కొన్నట్లు ఆయన పరమ భాగవతోత్తముడు, నిత్యస్తవనీయుడు. చక్రవర్తి కావడానికి అవకాశం ఉండీ, ప్రలోభాలకు అతీతంగా రాజ్యాన్ని నడిపాడు. రాజ్యసంరక్షణకు కంకణబద్ధుడై రాజప్రతినిధిగానే ఉన్నాడు. పాండవుల పట్ల అనుచితంగా వ్యవరిస్తున్న ధార్తరాష్ట్రుల పక్షాన ఉన్నా న్యాయపక్షపాతి. పాండవుల పక్షాన న్యాయం ఉందని తెలిసీ కర్తవ్య నిష్ఠతో దుర్యోధనుడి పక్షాన నిలిచి పోరాడాడు. దుర్యోధనాదులకు హితవు చెప్ప ప్రయత్నించాడు. ధర్మపక్షపాతి వాసుదేవుడు అండ ఉండగా పాండవులకు పరాజయం ఉండదని ఆయనకు తెలుసు.

భీష్ముడు మహావీరుడే కాదు. ధర్మకోవిదుడు. 'భీష్ముడి లాంటి వ్యక్తి ముల్లోకాల్లోనూ లేదు. నీతి నియమాలు, సత్యం, వేదవిద్యలు, దానం, యజ్ఞాధి కరణం.. వంటివి ఆచరించాడు, పోషించాడు. ధార్మికజీవితం, బ్రహ్మచర్య దీక్షతో ఆజన్మాంతం అగ్నిహోత్రంలా మనుగడ సాగించాడు' అని సాక్షాత్తు శ్రీకృష్ణుడే ప్రకటించడం ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి ప్రబల నిదర్శనం. తాను ఏయే అంశాలలో విశిష్టుడో చెప్పుకున్న శ్రీకృష్ణుడు 'ఆయుధాలు ధరించిన వారిలో భీష్ముడిని (భీష్మ శ్శస్త్రభృతా మహమ్)' అన్నాడు. యుద్ధంలో భీష్ముడి విజృంభణ, రౌద్రాకారం వాసుదేవుడినే కల్లోలపరిచాయి. కనుకను కురుక్షేత్రం సంగ్రామంలో 'ఆయుధం పట్టను' అని అర్జునుడికి ఇచ్చిన మాటను పక్కనపెట్టి సుదర్శనం చేపట్టి భీష్ముడిపై లంఘించ బోయాడు. కురుకుల పితామహుడికీ కావలసింది అదే. 'దేవాదిదేవా నీ చేతులలో మరణించడం కంటే అదృష్టం మరేముంది' అని ముకుళిత హస్తాలతో సాగిలపడ్డాడు.




డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

'అయినవారందరిని సంహరించి నేను సాధించేది ఏముంది?' అని కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అర్జునుడు నీరసపడగా, యుద్ధానంతరం జ్ఞాతులను కోల్పోయి దుఃఖంతో కుమిలిపోతున్నాడు ధర్మరాజు. అప్పుడు అర్జునుడికి కర్తవ్యబోధ చేసిన భగవానుడు, ఇప్పుడు ధర్మరాజుకు సాంత్వన కలిగించవలసి వచ్చింది. అందుకు భీష్ముడే సమర్థుడని, ఆయనకు తెలియని విషయాలు, విశేషాలు లేవని, భావి తరాలకు ఆయన నోట కర్తవ్యబోధ జరగాలని భావించాడు. ధర్మజుడిని అంపశయ్యపై ఉన్న ఆయన వద్దకు తీసుకు వెళ్లాడు. 'ధర్మశాస్త్రాన్ని ఆపోశన పట్టిన మీరు ధర్మజునికి శాంతిమార్గం ఉపదేశించండి' అని కోరాడు. 'జగద్గురువు సమక్షంలో నా బోధనలా? నేను ధర్మకోవిదుడనని, ధర్మమూర్తినని మన్ననలు అందుకుంటున్నప్పటికీ కొన్ని సందర్భాలలో అధర్మాన్ని నిలదీయలేని, అన్యాయాలపై స్పందించ లేని నాకు ధర్మపన్నాలు వల్లించే అర్హత ఉందా?'అనే సంశయంతో ఆత్మపరిశీలన చేసుకున్నాడు కురుకుల పితామహుడు. 'నాడు దుర్యోధనుడి దుస్సాంగత్యంలో ఉన్నాను కనుక ధర్మం ప్రకాశించ లేదు. అప్పుడు కలుషితమైన రక్తాన్ని దేవదేవుడి సారథ్యంలోని అర్జునుడు తన శరాలతో తీసివేసినందున ఇప్పుడు నిర్మల మనస్కుడను' అని సమాధాన పరచుకుని శ్రీకృష్ణాదేశ అమలుకు ఉపక్రమించాడు.

'సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ ఇంద్రియ నిగ్రహం కలిగి, ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే వారు శిష్టులు. సత్యవాదమే మహాయజ్ఞం. సత్యాన్ని ధర్మం కాపాడుతుంది కనుక మనిషి సత్యతత్పరుడు కావాలి. ఆహార నియమమయే తపస్సు. అదే మహాధర్మం. నియమబద్ధమైన నడవడితో కష్టాలను అధిగమించగలుగుతారు. లోభం వల్ల అధర్మం, దుఃఖం కలుగుతాయి. కోపం, కపటం, మోసాలకు కారణమైన లోభాన్ని వదలాలి. ధైర్యం లోపిస్తే అరిషడ్వర్గాలు తోడేళ్లలా కలబడతాయి. సంతృప్తితో తృష్ణను జయించవచ్చు. భయాన్ని విడిచిపెట్టాలి. దయాగుణం జాగృతమైతే అసూయ తొలగిపోతుంది. తల్లిదండ్రులు, గురువు వేదత్రయం, త్రిమూర్తుల వంటివారు. కన్నవారి పట్ల ప్రేమానురాగాభిమానాలు కలవారు ఇహపరాలలో గౌరవం పొందుతారు. గురువును సేవించేవారు అవ్యయానందం పొందుతారు. సాధనతో సోమరితనాన్ని, శౌర్యంతో భయాన్ని వీడాలి' అని అనేకానేక ధర్మ సూత్రాలు వివరించారు. వీటిని సకల మానవాళికి దివ్యోపదేశంగా చెబుతారు. 'భీష్మగీత' సార్వ కాలీనం. ముఖ్యంగా వర్తమానకాలంలో వ్యక్తిత్వ వికాసం, ప్రతి ఒక్కరికి కర్తవ్య బోధగా పెద్దలు చెబుతారు.

ఏకాదశి తిథి శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది. అలాంటి దానికి ఒక వ్యక్తి పేరు నిర్ణయం కావడానికి ఆయన వ్యక్తిత్వం ఎంత ఉన్నతంగా ఉండాలి! ఆ విశిష్టత దక్కిన మహనీయుడు భీష్ముడు. అంపశయ్యపై యాభయ్ ఆరు రోజులు ఉన్న తర్వాత ఇచ్ఛా మరణం వరంతో మాఘ శుద్ధ అష్టమి నాడు దేహత్యాగం చేశాడు. పంచప్రాణాలను సప్తమి నుంచి ఏకాదశి వరకు వరుసగా అయిదు రోజులలో ఒక్కొక్కటి విడిచి పెట్టాడని పండితులు చెబుతారు. ఆయనకు ముక్తి ప్రసాదించిన భగవానుడు, తరువాత వచ్చిన ఏకాదశిని 'భీష్మ ఏకాదశి'గా ప్రకటించాడు. దానినే 'జయ ఏకాదశి' అనీ వ్యవహరిస్తారు. ఆ రోజున ఉపవాసం ఉండి, విష్ణు సహస్ర నామపారాయణంతో ఆయనను అర్చిస్తారు. ★



షెహబాజ్

ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత ఒకవైపు, సైన్యం హెచ్చరికలు, పాక్ నాయకులను ఎవరినీ బతకనివ్వబోమని ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్ నాయకుల బెదిరింపులు మరోవైపు పాకిస్తాన్‌ను గడగడలాడిస్తున్నాయి. రెండు రొట్టె ముక్కలు చేసుకోవటానికి గోధుమ పిండిలేక తొక్కిసలాడుకుంటూ ఆహార ధాన్యాల కొరతతో అల్లాడుతున్నారు జనం. రేపేమవుతుందో అంతుచిక్కని పరిస్థితి. ఇంతకీ పాక్ కు ఏమైంది? ఇలాంటి పరిస్థితిలోకి ఎందుకు దిగజారింది? అదంతా స్వయంకృతం. వరుస దురాగతాల వికృత ఫలితం. ఒకప్పటి పాపాలే నేడు శాపాలుగా మారి ఆ దేశాన్ని వెంటాడుతున్నాయి.

# సంక్షోభం.. స్వయంకృ

పాక్ దివాలా అంచుకు చేరుకుందా? అక్కడ ఆకలిచావులు తప్పేలా లేవా?

దాని వల్ల రేపోమాపో అంతర్యుద్ధం చోటుచేసు కుంటుందా?.. అంతర్జాతీయ సమాజాన్ని కలవర పరుస్తున్న ప్రశ్నలివి.

అక్కడ కొత్తగా పుట్టిన పిల్లలకు పాలు లేవు. విద్యుత్తు సౌకర్యం అందుబాటులో లేదు. చాలా ప్రాంతాలు అంధకారంలో మగ్గుతున్నాయి. హాస్పిటళ్లలో ముఖ్యమైన ఇన్సులిన్, మధుమేహానికి సంబంధించిన మందులు కూడా దొరకటం లేదు. పాలు నుంచి పెట్రోలు వరకూ అన్ని నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకాయి. గోధుమ పిండి కోసం జనం షాపుల ముందు క్యూ కడుతున్నారు. ప్రభుత్వం పొదుపు చర్యలకు దిగింది. కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని నియంత్రించారు. షాపులు, మాల్స్‌ను రాత్రి 8.30కే మూసివేస్తున్నారు. పాక్‌లో దైనందిన జీవితం ఘోరంగా మారిపోయింది. దాంతో ఆకలి చావులు, రేపో మాపో అంతర్యుద్ధం ప్రమాదం పొంచి ఉందన్న భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

పాకిస్తాన్‌లో కొంత భాగం విడిపోయింది. మరో నాలుగు ప్రాంతాలు విడిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి. తెహ్రీక్-ఈ-తాలిబాన్ సమాంతర ప్రభుత్వం నడుపుతోంది. ఇస్లామాబాద్ ప్రభుత్వం తమ ఉనికిని చాటుకోవటానికి తరచూ ఇక్కడ సైన్యాన్ని ప్రయోగిస్తూ ఉంటుంది. రాబోయే రోజుల్లో పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ ఈ ప్రాంతంపై బాంబు దాడులు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇదే జరిగితే, దానివల్ల భారత్‌కే కాదు, ప్రపంచంలోని ఇతర దేశాలకూ అదో పెద్ద సమస్యగా మారుతుంది.

ఒకప్పుడు పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండేది. అక్కడ పాలన ఎలా సాగుతోందో అధ్యయనం చేయటానికి, 1970 ప్రాంతాల్లో అరబ్, ఆఫ్రికా దేశాల ప్రతినిధులు అక్కడికి వెళుతుండేవారు. జనరల్ మహమ్మద్ జియా ఉల్ హక్ హయాం వచ్చేసరికి అంతా మారిపోయింది. భారత్‌తో యుద్ధానికి సిద్ధమయ్యారు. అతని హయాంలోనే పాక్ ఆటంబాంబును సిద్ధం చేసుకుంది. ఒకవేళ పాకిస్తాన్ లో అంతర్యుద్ధం మొదలయితే, ప్రత్యేక స్థానాల కోసం పోరాటం మొదలయితే, భారత్ మాత్రమే కాదు, ప్రపంచం మొత్తం ప్రమాదంలో పడుతుంది. ఈ అణ్వాయుధాల్లో ఏ కొన్నో తీవ్రవాదుల చేతుల్లో పడితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భయాన్ని అడ్డం పెట్టుకునే పాకిస్తాన్ ధనిక దేశాల నుంచి ఇప్పటి వరకూ సాయం గుంజుకుంటోంది. కొవిడ్, ఉక్రెయిన్ యుద్ధం అంతర్జాతీయ సమాజం చేతులు కట్టేశాయి. ఇప్పుడదే సమస్యగా మారింది.

**భారీ వరదలతో ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నం**

గత ఏడాది వచ్చిన భారీ వరదలు పాక్ ఆర్థిక పరిస్థితిని దారుణంగా దెబ్బతీశాయి. 15 శాతం జనాభాపై దీని ప్రభావం పడింది. 20 లక్షల ఇళ్లు దెబ్బతిన్నాయి. 1739మంది చనిపోయినట్టు ప్రభుత్వమే ప్రకటించింది. వరదలవల్ల పాక్‌కు సంభవించిన నష్టం 30 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఈ వరదల వల్లనే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ కోలుకోలేనంతగా దెబ్బతిందని స్వయంగా ప్రపంచ బ్యాంకు పేర్కొంది. 'పాక్ ఆర్థికాభివృద్ధి మరింత తగ్గి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2 శాతానికి పడిపోతుంది. అది జూన్ 2022లో అంచనా వేసిన దానికంటే రెండు శాతం తక్కువ' అని తన అధ్యయన నివేదికలో స్పష్టం చేసింది. 'ప్రాంతీయంగా కూడా పాకిస్తాన్ ప్రభావం ఇండియా, మాల్దీవులు, నేపాల్ పైన పడుతుంది. ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంకలలో రాజకీయ ఆర్థికసంక్షోభాలకు ఇదేకారణం. దీనివల్ల అంతర్జాతీయవృద్ధి 1.7 శాతంగా ఉంటుంది' అని వివరంగా పేర్కొంది.

పాకిస్తాన్ విదేశీ నిల్వలు (ఫారెన్ ఎక్స్ ఛేంజి రిజర్వ్) వేగంగా తరిగిపోతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అవి ప్రస్తుతం 4.3 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఇవి కేవలం మూడు వారాల ఎగుమతులకు సరిపోతాయి. ప్రపంచ దేశాల నుంచి పాక్ దాదాపు 100 బిలియన్ డాలర్లను అప్పుగా తెచ్చింది. ఇందులో 21 బిలియన్ డాలర్లను ఈ

**అంకెల్లో పాక్**

- పాక్ జనాభా 24 కోట్లు. అందులో 35.7 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.
- గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 121 దేశాల్లో, ఆ దేశం 99వ స్థానంలో ఉంది.
- జీడీపీ 376 బిలియన్ డాలర్లు. అందులో వ్యవసాయం వాటా 19శాతం. ఆహార ధాన్యాల అవసరం ఆ దేశానికిప్పుడు అత్యధికంగా కనిపిస్తోంది.
- పాక్ విస్తీర్ణం 19 కోట్ల 67 లక్షల ఎకరాలు. అక్షరాస్యత 58శాతం
- మన దేశం కంటే ఒక రోజు ముందు అంటే, ఆగస్టు14,1947న స్వాతంత్ర్యం పొందింది.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

ఏడాదే చెల్లించాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పు ఇచ్చేవాళ్లు లభిస్తే తప్ప అది బయటపడటం కష్టం. ఇంతకు ముందు ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్.) దాన్ని ఒడ్డున పడేసింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పాకిస్తాన్ ప్రధాని షెహ్ బాజ్ షరీఫ్ సాయం కోసం అర్థించినప్పుడు, ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివా సానుకూలంగా స్పందించ లేదు. గత ఏడాది ఇచ్చిన ఆరు బిలియన్ డాలర్ల రుణానికి సంబంధించి ఇచ్చిన మాటను నిలుపుకోలేదని ఆరోపించారు కూడా. విదేశీనిల్వలను నియంత్రించటంలో సెంట్రల్ బ్యాంకు జోక్యం తగ్గించాలని, పన్ను విధాలను సరళీకరించాలని, బడ్జెట్ లోటు తగ్గించాలని అప్పట్లో ఐఎంఎఫ్ షరతు విధించింది. 'పాకిస్తాన్ ఆర్థికంగా సుస్థిరతను సాధించాలని కోరుకుంటున్నాం' అని అమెరికా ప్రతినిధి వ్యాఖ్యానించటం తప్ప వీసమెత్తు సాయం చేయటానికి ముందుకు రాలేదు. సౌదీ అరేబియా ఇంతకుముందు అందించిన రెండు బిలియన్ డాలర్ల సాయానికి అదనంగా మరో బిలియన్ డాలర్లు అందించేందుకు ముందుకు

# తాపరాధం

వచ్చింది. దుబాయ్ ఒక బిలియన్ డాలరు ఇచ్చేందుకు అంగీకరించినట్టు వార్తలొచ్చాయి. దీనితో సంక్షోభం నుంచి తేలిగ్గా గట్టెక్కుతామన్నది పాక్ అభిప్రాయంగా ఉంది.

"పెరట్లో పాములు పెంచుతున్నప్పుడు అవి పొరుగువారిని మాత్రమే కాటేయాలని ఆశించ కూడదు. చివరికి అవి వారిని కూడా కాటేస్తాయి" అని దశాబ్దం క్రితం హిల్లరీ క్లింటన్ పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు ఓ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం పాక్‌లో పరిణామాలు చూసినప్పుడు ఆ మాటలు అక్షరసత్యం అనిపించకమానవు. ఎందరో అంతర్జాతీయ తీవ్రవాదులకు పాక్ ఆశ్రయం కల్పించింది. ఒసామా బిన్ లాడెన్ పాక్‌లోనే రక్షణ పొందారు. భారత్‌లో కీలకమైన ఉగ్రవాదదాడులను పర్యవేక్షించిన అబ్దుల్ రహమాన్ మక్కీ ఉండేది పాకిస్తాన్ లోనే. దావూద్ ఇబ్రహీం ఇప్పటికీ అక్కడే మకాం ఉన్నారు. పైకి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉన్నా, పాక్‌లో వ్యవహారాలు నడిపించేది సైన్యమే. పాక్ చరిత్రలో హత్యలు, తిరుగుబాట్లు సర్వసాధారణం. 1947లో భారత విభజన తర్వాత పాకిస్తాన్ మొదటి ప్రధానిగా ఉన్న లియాఖత్ అలీఖాన్ నుంచి నిన్న మొన్నటి ఇమ్రాన్ ఖాన్ వరకూ ఇదే పరిస్థితి. మనకు, పాకిస్తాన్‌కు మధ్య మూడు మార్లు (1948, 1961, 1975) యుద్ధాలు సంభవించాయి. పాలకులు,




సైన్యాధ్యక్షులు మారుతున్నారు. కానీ వారి వ్యవహార శైలిలో, భారత్ పట్ల వారి వైఖరిలో పెద్దగా మార్పు కనిపించటం లేదు. ఈ మధ్యనే పాక్ ప్రధాని షెహబాజ్ చిలకపలుకులు పలికారు. 'భారత్‌తో మూడు యుద్ధాలు చేశాం. అది మాకు ఇచ్చింది ఏదైనా ఉంటే అది పేదరికం, మరిన్ని కష్టాలు, ఇంకాస్త నిరుద్యోగం' అని ఆవేదన వ్యక్తం చేయటమే కాదు. 'యుద్ధాలతో మాకు బుద్ధొచ్చింది. మేం భారత్‌తో శాంతినే కోరుకుంటున్నాం' అన్నారు. ఇది నమ్మదగిన మాట కాదన్న విషయాన్ని పాక్ తీరు తెలిసిన వాళ్లెవరయినా అంగీకరిస్తారు. రిపబ్లిక్ డే ముందర ఢిల్లీలో టెర్రరిస్టు దాడికి వ్యూహం పన్నిన ఇద్దరు అనుమానితులను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. వీరికి పాకిస్తాన్ టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయని ప్రకటించటం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది. పాక్ ఆగడాలను అంతర్జాతీయ వేదికల పైన భారత్ దునుమాడుతూనే ఉంది. 'కొన్ని దేశాలు తమ విదేశాంగ విధానం మేరకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటే, మరికొన్ని దేశాలు టెర్రరిస్టులపై చర్యలు తీసుకోకుండా పరోక్షంగా దాన్ని ప్రోత్సహిస్తున్నాయి' అని భారత ప్రధాని మోదీ పాక్, చైనాలను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. భారత అధ్యక్షతన నిర్వహించిన ఐరాస భద్రతా మండలి సమావేశంలో, జీ 20 సమావేశాల్లో, టెర్రర్ ఫండింగ్ పైన నిర్వహించే సమావేశాల్లో ఇదే కీలక అంశంగా నిలుస్తోంది.

**భారత్ ఒక్కటే భద్రం**

ఒకప్పుడు బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలు భవిష్యత్తు ఆశా దీపాలనే భావన ఉండేది. బ్రెజిల్లో ఏం జరిగిందో నిన్న మొన్న చూశాం.


అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలయిన ట్రంప్‌నకు మద్దతుగా ఆయన అనుచరులు కేపిటల్ హిల్ పైన దండెత్తినట్టు, బొల్సనోరా అనుచరులు బ్రెజిల్ పార్లమెంటును చుట్టుముట్టారు. దాంతో ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడయిన లులా రోడ్డెక్క వలసి వచ్చింది. రష్యా పరిస్థితి నానాటికి బలహీనమవుతోంది. జీరో కొవిడ్ పాలసీ వల్ల చైనా ఆర్థిక స్థితి పైకి కనిపించనంత దారుణంగా దెబ్బతిందన్న వార్తలు వస్తున్నాయి. మనకు పాకిస్తాన్ ఒకవైపు, శ్రీలంక మరోవైపు ఉన్నాయి. రెండూ సంక్షోభంతో తల్లడిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ స్థిరంగా ఉండటం ఒక్కటే మనకు ఊరటనిచ్చే అంశం. ★



# ఇకనైనా బుద్ధి మార్చు

**నేను హెన్రీ కిసింజెర్‌ను (అమెరికన్ దౌత్యవేత్త, మేధావి) అయి ఉంటే భారతదేశం ఇటీవలి కాలంలో సాధించిన ప్రగతిపై ఒక సిద్ధాంతవ్యాసం (Treatise) రాసి ఉండేవాడిని. ఆసియా ఖండంలో, ఆపై ప్రపంచంలో ఒక ముఖ్య పాత్రధారిగా, నిర్ణయాత్మక శక్తిగా భారతదేశం ఎదిగింది. మోదీ పేరు చెబితేనే పాకిస్తాన్‌లో ఉలిక్కిపడతారు. మండిపడతారు. కాని ఇంతకుముందు ఎన్నడూ ఎవరూ తీసుకురాని పేరు ప్రతిష్టలను ఆయన భారతదేశానికి తీసుకొని వచ్చారు. భారతదేశాన్ని బ్రాండ్ చేయడానికి నిర్విరామంగా కృషిచేసి, సఫలీకృతుడయ్యారు.**

భారతదేశం ఏది చేయాలనుకొంటే అదే చేస్తుంది. ఎంతవరకు వెళ్లదలచుకొంటే అంతవరకే వెళుతుంది. ఏది ఎంతవరకు అవసరమో అంత మేరకు చేయగలుతున్నది. ఆ తర్వాత వేడుక చూస్తూ కూర్చోగలుగుతుంది. స్వతంత్ర విదేశీ విధానాన్ని అనుసరిస్తుంది. అది అగ్రరాజ్యమైన అమెరికాకు ఒక నమ్మకమైన మిత్రదేశం. అది మనకు నచ్చలేదు. మనం (పాకిస్తానీలు) కలలుకంటూ మనలను మనం మోసపుచ్చుకుంటున్నాం. రెండు రకాలుగా మాట్లాడటాన్ని (రెండు నాల్కల ధోరణి) ఒక కళగా అభ్యసించి, నిష్ణాతులమయ్యాం. అమెరికాను ప్రతినాయకునిగా చిత్రీకరిస్తుండటం మనకు పరిపాటి. అమెరికా భారత్‌ను విమర్శించినపుడు సంతోషిస్తుంటాం. రష్యా మీద అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాతో ఏ దేశమూ వాణిజ్య సంబంధాలు పెట్టుకోకూడదు. కాని భారతదేశం ఆ ఆంక్షలను ఏ మాత్రమూ లెక్కచేయ లేదు. రష్యా నుండి చౌకగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నది. పరోక్షమార్గంలో ఆ చమురును ఎగుమతి చేసి, రష్యాకు డాలర్లు సమకూర్చి పెడుతున్నది. రెండు అగ్రరాజ్యాలు పరస్పరం తలపడుతున్నాయి. ఒకదానికి వ్యతిరేకంగా మరొకటి యుద్ధంలోకి ఉన్నాయి. ఆ రెండు ప్రత్యర్థి సైనిక అగ్రరాజ్యాలు భారత్‌ను తమ మిత్రదేశంగా పేర్కొంటున్నాయి. ఇది దౌత్య తిరుగుబాటు కాకపోతే, మరేది దౌత్య విప్లవం?



**షాజాద్ చౌదరి**

ఇదంతా ఒకే ఒక పదం చుట్టూ తిరగటంవలన వచ్చింది.ఆ పదం– ఔచిత్యం లేదా సందర్భశుద్ధి (Relavant). భారతదేశం ప్రపంచానికి తగినట్లుగా ప్రవర్తిస్తున్నది. విస్తీర్ణం, జనాభా, మార్కెట్లవల్ల మాత్రమేగాక అనుసరిస్తున్న విధానాల వల్ల, దాని ప్రభావం ప్రపంచమంతా విస్తరించింది. దాని పాదముద్రలు ప్రపంచమంతా కనపడు తున్నాయి. దానితో ప్రపంచానికి అది ముఖ్య దేశమయింది. ప్రపంచంలోనే ఇంగ్లండ్‌ను మించి పోయి భారతదేశం ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. 2037 నాటికి మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి ఎదగాలని భారతదేశం ఆకాంక్ష. అందుకు తగిన ప్రణాళికలను అది రూపొందించుకుంటున్నది. 600 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా దానికి విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయి. పాకిస్తాన్ దగ్గర 4.5 బిలియను డాలర్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా రోజు రోజుకు క్షీణిస్తున్నాయి. దినదినగండంగా కాలం గడుపుతున్నది.

భారత వృద్ధిరేటు ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన దేశాల వృద్ధిరేటుతో పోటీ పడుతున్నది. చైనా తర్వాత గత 3 దశాబ్దాలలో అత్యంత వేగంగా వృద్ధి చెందిన దేశం భారత్. దాని అభివృద్ధి ప్రక్రియ కొనసాగుతుందనీ, సమీప భవిష్యత్తులో అందుకు అడ్డంకులు లేవనీ ఆర్థిక పండితుల అంచనా. ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనికబలం దానికి ఉంది. సైనిక శక్తిగా భారతదేశం మూడవ స్థానంలో ఉంది. సంఖ్యకు తగ్గ సామర్థ్యం దానికి ప్రస్తుతం లేకపోవచ్చు. ఆ విషయం భారత్‌కూ తెలుసు. అందుకే తన శక్తి ప్రస్తుతం లేకపోవచ్చు. దానికి ఆ విషయం తెలుసు. అందుకే తన శక్తి సామర్థ్యాలను సైనికపరంగా, రక్షణ పరంగా అతి వేగంగా పెంచుకోవటానికి గట్టి ప్రయత్నం చేస్తున్నది.

ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 140మంది భారతీయులు ఉన్నారు. మొదటి వందమందిలో నలుగురు భారతీయులే. మిట్టల్ ఉక్కు దిగ్గజం. అంబానీలు రక్షణరంగ ఉత్పత్తుల నుంచి 2250 వరకు అనేక వర్తక వ్యాపారాలలో వర్ధిల్లుతున్నారు. ఇన్ఫోసిస్ గురించి చెప్పవలసిన పని లేదు. అది ఐటీ రంగంలో అగ్రగామి సంస్థ. ప్రపంచమంతా దానిపేరు ప్రసిద్ధం. ఇంకా అలాంటి సుప్రసిద్ధాలు అనేకం భారతీయ కంపెనీలకు ఉన్నాయి. వ్యవసాయోత్పత్తులు, ఐటీ ఎగుమతులలో భారతదేశం అగ్రగామి. వ్యవసాయ దిగుబడి రేట్లు ప్రపంచ రేట్లలో సరిసమానంగా ఉన్నాయి. 140 కోట్లమంది జనాభా ఉన్నప్పటికి, స్థిరమైన, పొందికైన, క్రియాత్మకమైన రాజ్య వ్యవస్థను నెలకొల్పటం లోనూ, కాపాడు కోవటంలోనూ భారతదేశం విజయం సాధించింది. దాని పాలనా వ్యవస్థ కాలానికి ఎదురొడ్డి, ఆటు పోటులను తట్టుకొని, నిలబడగలిగింది. ఒక దృఢమైన ప్రజాస్వామిక వ్యవస్థకు ఎటువంటి ప్రాథమిక అంశాలు ఉండాలో, వాటన్నిటినీ భారత దేశం కాపాడుకోగలిగింది. అది అత్యంత సమర్థంగా, సామాజిక న్యాయంతో నడిచే సమాజం కాకపోవచ్చు. కాని ఒక దేశాన్ని, సమాజాన్ని పటిష్టంగా నిర్మాణం చేయటానికి కావలసిన సాధనాలను గట్టిగా పట్టుకొంది. చాలామంది దృష్టిలో (పాకిస్తాన్‌లో) భారత్ ప్రభుత్వం తగినంత సెక్యులర్‌గా లేదనే అభిప్రాయం ఉంది. కాని దానికి ఒక సెక్యులర్ రాజ్యాంగం ఉంది (పాకిస్తాన్ ఒక మత రాజ్యం). మోదీ హయాంలో అదొక మత– జాతీయవాదం ద్వారా తన అస్థిత్వాన్ని, గొప్పదనాన్ని గట్టిగా ప్రకటిస్తున్నది. అది తడబడటం లేదు. బలంగా తన వాదనను వినిపిస్తున్నది. ప్రపంచ వేదిక మీద నిర్భయంగా చెబుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా రైటిస్టుల హవా నడుస్తున్నది. అందుకు భారత్‌ను తప్పుపట్టవలసిన పనిలేదు.

పాకిస్తాన్‌కు సవాళ్లు ఎదురవుతున్నాయి. తన కోసం కాక, అది భారత్ కోసం, మోదీ కోసం పని చేస్తున్నట్లుగా ఉంది. క్రియాశీలకంగా గాక, ప్రతి క్రియాత్మకంగా పాకిస్తాన్ విధానాలు, చర్యలు ఉండటంతో భారత్‌కు, మోదీకి అది కలసి వస్తున్నది.

భారతదేశానికి 1992లో 9.2 బిలియను డాలర్లు విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయి. 2004లో అది వంద బిలియను డాలర్లు అయింది. మన్‌మోహన్‌సింగ్ హయాంలో అవి 252 బిలియను డాలర్లు కాగా, మోదీ హయాంలో విదేశీ మారక నిల్వలు 600 బిలియన్ డాలర్లు దాటాయి. భారత స్థూల జాతీయ ఉత్పత్తి 3 ట్రిలియన్ డాలర్లు కానున్నది. ఇది చరిత్రాత్మకమైన పెరుగుదల. కనుక పెట్టుబడులు భారతదేశంలోకి వరదలా ప్రవహిస్తు న్నాయి. విదేశీ పెట్టుబడుల గమ్యస్థానం భారత్ అయింది. సౌదీ అరేబియా పాకిస్తాన్ సోదర దేశం. వాగ్దానం చేసిన 7 బిలియన డాలర్ల పెట్టుబడులు పెట్టమని పాకిస్తాన్ కాళ్లవేళ్ల పడుతుండగా భారత్‌లో 72 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడ్తున్నట్లుగా భారత్ అడగకుండానే ప్రకటించింది. పాకిస్తాన్ చైనా ఉక్కు కౌగిలిలో ఉంది. మొన్న జెనివాలో జరిగిన పాకిస్తాన్ దాతల సమావేశంలో ఒక పది బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టటానికి చైనా ఎట్టకేలకు

# కుందాం!




అంగీకరించింది.

పాకిస్తాన్‌కు ఇష్టమైన 'కొరడా దెబ్బలు కొట్టి ఆనందించే ప్రియుడైన' అమెరికా కూడా అంతకంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టటానికి ముందుకు రాలేదు. దివాలా తీయటానికి సిద్ధంగా ఉన్న పాకిస్తాన్‌ను ఆదుకోవటానికి ఎవరు వస్తారు? చైనా, అమెరికాలు రెండూ పాకిస్తాన్‌ను ఒకే విధంగా చూస్తున్నాయి. పాకిస్తాన్‌కు గల అవకాశాలను తక్కువగా ఉన్నాయనే ఆలోచనే చేస్తున్నారు తప్ప ఆదుకోవటానికి, పెట్టుబడులు ద్విగుణీకృతం చేయటానికి ఉత్సాహంగా లేరు.

చైనా, భారతదేశాలదే రాబోయే శతాబ్దం. పాకిస్తాన్, భారతదేశాల మధ్య పూడ్చలేని అగాథం నెలకొంది. పాకిస్తాన్ భారతదేశాన్ని ఆర్థికంగా అధిగమించి ముందుకు పోలేనంత వెనుక ఉంది. దక్షిణ ఆసియాకే అదివరకు పరిమితం అయిన భారతదేశం తన సంకెళ్లను తెంచు కొంది. దాని విదేశీ విధానం కొత్త పుంతలు తొక్కుకున్నది. పాకిస్తాన్ కేంద్రంగా ఉన్న విధానం నుండి దూరంగా జరిగింది. దానితో దాని దృష్టి ఆసియా అంతా విస్తరిం చింది. దక్షిణ ఆసియా అంశాలకే పరిమితం కాకుండా తన దృష్టికోణాన్ని విస్తరించుకోగలగటమే దాని విజయం. రాజీవ్‌గాంధీ నుండి మోదీ వరకు భారత విదేశాంగ విధానం పాకిస్తాన్ నుండి దూరంగా జరగటం స్పష్టంగా కనపడుతుంది. దాని ప్రభావం విస్తృత మయింది. భారత్‌కు వ్యతిరేకంగా చైనాతో జతకట్టాం. ఆ రెండు దేశాలు ఏటా వంద బిలియన్ డాలర్లు వ్యాపారం చేసుకుంటున్నాయి. ఆ స్థాయిలో వ్యాపారం చేసుకొనే దేశాలు యుద్ధాలకు దిగవు. కనుక వాస్తవాలను గ్రహించే సమయం ఇది.

కశ్మీర్‌కు ప్రత్యేక పతిపత్తి ఇచ్చిన 370వ అధికరణాన్ని రద్దుచేసి, పాకిస్తాన్‌ను రాజకీయంగా భారతదేశం కోలుకోలేని దెబ్బకొట్టింది. అక్కడి జనాభాను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది. ఇతర ప్రాంతాల జనాభా అక్కడకు నెమ్మదిగా చేరుతున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన పాతతరాలు క్రమంగా కనుమరుగు అవుతున్నాయి. ప్రజాస్వామికంగా ఒప్పించే ప్రయత్నాలు కొత్తతరాన్ని ఆకట్టుకుంటు న్నాయి. కశ్మీర్‌లో అసాధారణ రీతిలో తన సైనికశక్తిని భారత్ మోహరించింది.



పాకిస్తాన్ అందుకు తగినట్టు స్పందించి శక్తిని కోల్పోయింది. సైనికపరంగా మన సైన్యం భారత్‌తో సరితూగలేదు. మోదీ ప్రభుత్వం కశ్మీర్‌లో మనం ఊహించని రీతిలో కొత్త వాస్తవికతను ప్రతిష్టించింది. పాకిస్తాన్ ప్రధాన ఎజెండా మారలేదు. అయినప్పటికీ నూతన పరిస్థితులకు అనుగుణంగా ముందుకు వెళ్లే ప్రయత్నం చెయ్యాలి. మన పొరుగు దేశంలో జోరుగా పుంజుకుంటున్న అభివృద్ధి కార్యకలాపాలవల్ల పాకిస్తాన్ ప్రయోజనం పొందాలంటే మన విధానాలు మారాలి. పాకిస్తాన్ ప్రజలను పేదరికంలోకి నెట్టి వేస్తున్నారు. దేశం దివాలా దిశగా ఉంది. వాగాడంబరం ఆపి, మారిన పరిస్థితులకు తగిన విధానాలను అనుసరించాలి. జి-27, జి-20లోనూ భారతదేశం క్రియాశీలక పాత్రను పోషిస్తున్నది. ప్రపంచ దక్షిణాది దేశాలకు (Global South) అది నాయకత్వం వహిస్తున్నది. వాతావరణ మార్పు (Climate Change), మహమ్మారి (Pandemic), సాంకేతిక పరిజ్ఞానం చొరబాటు, సమ్మిళిత పురోగతి (equitable progress) వంటి కీలకమైన అంశాల పరిష్కార దిశలో భారతదేశం మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేసే స్థితిలో ఉంది. విదేశీ విధానంలో తనకంటూ ఒక ప్రత్యేకత ఉంది. దానికి కట్టుబడి ఉంటున్నది. ఏ వత్తిడిలకు అది లొంగదు. తన స్వతంత్రతను నిలబెట్టుకున్నది. ప్రదర్శిస్తున్నది. అది కొన్నిసార్లు అహంకార పూరితంగా కనపడవచ్చు. దానిపట్ల విముఖత్వాన్ని కలుగచేయవచ్చు. కాని తన ప్రత్యేకతను, స్వతంత్రను వక్కాణించటానికి మోదీ ప్రభుత్వం ఏ మాత్రమూ వెనుకాడటంలేదు. మోదీ భారతదేశాన్ని ప్రపంచ వేదిక మీద ఒక కీలకమైన ఘట్టానికి తీసుకొని వచ్చారు. దాని ప్రభావం ప్రపంచమంతా పడుతు న్నది. భారతదేశ మహత్తర రచనలో పాకిస్తాన్ ఒక అథోజ్ఞాపిక అయిపోయింది. వాస్తవాలు కళ్లకు కనపడుతుండగా, కళ్లుమూసు కోవటం మంచిది కాదు.

భారత్‌పట్ల మన విధానాన్ని పునరాలోచించు కోవాలి. చైనా, భారత్, పాకిస్తాన్‌ల త్రికూటమిని ఏర్పరిచేందుకు ధైర్యంగా చొరవ తీసుకోవాలి. ఆసియా మీద దృష్టి పెట్టి విస్తృత ఆర్థిక అభివృద్ధి కోసం, తద్వారా లబ్ధి పొందేందుకు కృషిచేయాలి. అప్పుడే భౌగోళిక ఆర్థిక పరిస్థితులను ఒక వ్యూహంగా మార్చుకోగలుగుతాం. బహుకాలం నుండి అనుస రిస్తున్న విధానాల నుండి, చేస్తున్న ఆలోచనల నుండి సుదూరంగా జరగటం, ధైర్యంగా కొత్త ఆలోచనలు చేయగలగటమే ఈ నూతన రూపావళిని (New Paradigm) ను ఎదుర్కోగలదు. లేకుంటే పాకిస్తాన్ చరిత్రలో ఒక అథోజ్ఞాపికగా మాత్రమే మిగులు తుంది.

**(పాకిస్తాన్ పాత్రికేయుడు, రాజకీయ, రక్షణ, భద్రతా నిపుణుడు, విశ్లేషకుడు షాజాద్ చౌదరి 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పత్రికలో జనవరి 19న ప్రచురించిన 'On India' వ్యాసానికి భావానువాదం)**

**అను: డా॥ బి.సారంగపాణి**

# నమో 1.0 2023-2


**ఒక నిర్దిష్ట ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతి బడ్జెట్ ప్రతి సందర్భంలోను ప్రత్యేకమైనదే. ఇది దేశ ఆర్థిక విధానానికి సంబంధించి గతం నుండి భవిష్యత్తుకు బాటలు వేసే వర్తమాన వసూళ్లు, చెల్లింపుల అంచనాల చిట్టా. గత వాస్తవాల పరిగణనతో భవిష్యత్తును అంచనా వేయడం శాశ్వతంగా కొనసాగే ప్రక్రియ. రాబోయే బడ్జెట్ 2023-24 పైన కూడా గత 8 సంవత్సరాల నరేంద్ర మోదీ పరిపాలన ప్రభావం స్పష్టంగా ఉంటుంది. అందువల్ల, బడ్జెట్ 2023-24కు సంబంధించి మూడు భాగాలుగా చూస్తూ, అన్ని ముఖ్య అంశాలను విశ్లేషించుకోవాలి. రాబోయే కేంద్ర బడ్జెట్ కాల పరిమితి పూర్తయ్యే నాటికి దేశం 2024 సాధారణ ఎన్నికలకు సిద్ధమవుతూ ఉంటుంది. ఈ వాస్తవంతో పాటు, కరోనా ప్రభావం, ప్రపంచ ఆర్థిక మందగమనం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, వస్తు,సేవల సరఫరా గొలుసుకు అంతరాయం కలుగుతున్న ప్రస్తుత పరిస్థితులు కూడా పరిగణనలోనికి వస్తాయి. వీటన్నిటి కారణంగా జాతీయ అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషకుల మదింపుతో పాటు, అధికార విపక్షాలకు కూడా రాబోయే బడ్జెట్ పైన ప్రత్యేక దృష్టి ఉంది.**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటి దఫా (2014-2019)లో పాలనకు సంబంధించి ముఖ్య నిర్ణయాలను ప్రణాళికా బద్ధంగా అమలు చేసింది. నమో 2.0లో ప్రవేశపెట్టిన కొత్త పథకాలు, ప్రాజెక్టులతో పాటు 1.0లో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు కూడా కొనసాగుతాయి. నమో 2.0లో పేదలకు అవసర మైన ప్రాథమిక సౌకర్యాల కోసం అన్ని రకాల అవస్థాపన సదుపాయాలు సృష్టించేందుకు శ్రద్ధ చూపుతున్నది. మరోవంక దేశ ఆర్థిక స్థిరత్వం కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నది. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించే ముందు 2011-12 ధరల ఆధారంగా 2012-13, 2013-14 ఆర్థిక సంవత్సరాలకు వృద్ధి రేటు 5.1%, 6.9%గా ఉంది.

నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి చేపట్టిన కార్యక్రమాల క్రమాన్ని ఒకసారి గమనించాలి. మొదటగా గ్రామీణ భారత దేశంలో 100% బహిరంగ మూత్ర, మల విసర్జన నిర్మూలన కోసం (ODF) చేపట్టిన చర్యలు. ఇవి అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం పారిశుధ్యం కోసం ప్రతి గృహానికి మరుగు దొడ్లు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద ఈ పథకం అమలు చేశారు. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 2, 2014న మోదీ ప్రారంభించారు. డిసెంబర్ 2, 2022 నాటికి 100% బహిరంగా మూత్ర, మల విసర్జన నిర్మూ లించుకున్నవి (ODF)గా దేశంలోని 1,34,396 గ్రామాలను ప్రకటించారు. ఆ వెంటనే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY) అర్బన్ కింద పేదలకు గృహనిర్మాణాన్ని ఫ్లాగ్‌షిప్ మిషన్‌గా జూన్ 25, 2015న కేంద్రం ప్రారంభించింది. ఇందులో భాగంగా మొత్తం 8.31 లక్షల కోట్ల పెట్టుబడితో ఇప్పటి వరకు దేశంలో 1.23 కోట్ల గృహాలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో కేంద్రం తన వాటాగా మంజూరు చేసిన నిధులు రూ. 2.03 లక్షల కోట్లు. అందులో ఇప్పటివరకు రూ. 1.30 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయగా, 1.07 కోట్ల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. దాదాపు 65.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. అంటే 60% కంటే ఎక్కువ గ్రౌండింగ్ అయిన గృహాల నిర్మాణం ఇప్పటివరకు పూర్తయింది.

మరొకటి– ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై). కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 10.74 కోట్ల కుటుంబాలకు చెందిన 50కోట్ల మందికి నాణ్యమైన ఆరోగ్యసేవలను అందించే ఉద్దేశంతో సెప్టెంబర్ 23, 2018న పీఎం-జేఏవైని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ పథకం క్రింద మార్చి31, 2022 నాటికి దాదాపు 18 కోట్ల మందికి ఆయుష్మాన్ కార్డులు అందించారు. 3.63 కోట్ల మంది ఆసుపత్రులలో వైద్యసేవలు పొందారు. వీరి కోసం నెట్వర్క్ ఆఫ్ ఎంపానెల్డ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ల నుండి రూ. 40,000 కోట్ల మేరకు నిధులు విడుదలయ్యాయి. అర్హులైన పేద లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం నేరుగా నగదు బదిలీ చేయడం కోసం జన్‌ధన్ యోజన కార్యాచరణ చేపట్టారు. ఈ నిర్ణయంతో డిసెంబర్ 2, 2022 వరకు 47.51 కోట్ల ఖాతాలకు నగదు బదిలీ ద్వారా 2014-15 ఆర్థిక సంవత్సరం నుండి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ కింద రూ. 26.02 లక్షల కోట్లు లబ్ధి పొందారు. ఇది కాకుండా, ఏప్రిల్ 8, 2015 నుండి డిసెంబర్ 2, 2022 వరకు 10 లక్షల రూపాయల వరకు కార్పొరేట్ కాని మైక్రో ఎంటర్ ప్రైజెస్ కోసం ప్రధానమంత్రి ముద్ర యోజన కింద అందించిన రుణాల సంఖ్య 37.76 కోట్లు కావడం గమనార్హం.

ఇవేకాకుండా, మోదీ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు, గ్రామీణ భారత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2014 నుండి 2019 వరకు గ్రామీణ అభివృద్ధి కోసం వివిధ రూపాలలో రూ. 4.50 లక్షల కోట్లకు పైగా సబ్సిడీ కింద అందించింది. అదే సమయంలో అంతర్జాతీయంగా వచ్చిన మార్పులతో ఎరువుల ధరలు అసాధారణంగా పెరగడంతో కేంద్రం ఎరువుల సబ్సిడీని అదనంగా రూ. 83 వేల కోట్లకు పెంచవలసి వచ్చింది. అలాగే, వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ముఖ్యంగా వరి రైతుకు కనీస మద్దతు ధర 2022-23 సంవత్సరానికి క్వింటాల్‌కు రూ. 2,040గా నిర్ణయించిన సంగతి విదితమే. ఇది 2014-15 సంవత్సరంతో పోలిస్తే 50% అధికం. మరి గోధుమ విషయానికొస్తే, 2023-24లో కనీస మద్దతు ధర రూ. 2,125గా నిర్ణయించారు. ఇది 2013-14 సంవత్సరంతో పోలిస్తే 57.4% అధికం. పొద్దు తిరుగుడు నూనె విత్తనాలకు కనీస మద్దతు ధర రూ. 6,400/- గా 2022-23 సంవత్సరానికి(71%) కేంద్రం పెంచింది. ఇంకా, ఫసల్ బీమా యోజనలో భాగంగా 2018 నుండి డిసెంబర్ 2, 2022 వరకు 11.42 కోట్ల మంది రైతులు పేరు నమోదు చేసుకొని 25,186 కోట్లు ప్రీమియంగా చెల్లించారు. వాస్తవానికి బీమా కంపెనీలు నుండి రైతులకు వచ్చిన క్లెయిములు రూ. 1,25,662 కోట్లు. అంటే ప్రీమియం కన్నా 5 రేట్లు అధికంగా క్లెయిములు రావడం గమనార్హం. అక్టోబర్ 31, 2022 నాటికి గత ఆరు సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం కింద గరిష్ట ప్రీమియంను భరిస్తున్నాయి. ఇది కాకుండా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి



లంకా దినకర్
B.com.,F.CA.

## పాలన ప్రభావం
## 4 బడ్జెట్లో కొనసాగుతుంది!




యోజన ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 6,000, మొత్తం 11.37 కోట్ల మంది రైతులకు ఇప్పటి వరకు 12 విడతల్లో రూ.2.16 లక్షల కోట్లు కేంద్రం అందించింది. గ్రామీణ అనుసంధాన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి 2014-15 నుండి ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద విరివిగా రోడ్లు మంజూరయ్యాయి. గత 8 సంవత్సరాలుగా ఇందుకు రూ.1.72 కోట్లకు పైగా ఖర్చు చేశారు.

గ్రామీణ భారత దేశంలో నివసించే ప్రజలకు కనీస ఉపాధిని అందించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2014-2019 సంవత్సరాల మధ్య రూ.2.70 లక్షల కోట్లు, ఆ తర్వాత వరుసగా రూ.68,266 కోట్లు, రూ. 1,11,671 కోట్లు, రూ.1,00,399 కోట్లు 2019-20, 2020-21, 2021-22 సంవత్సరాలలో ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 2022 – 23లో 5.38 కోట్ల గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడానికి 211 కోట్ల పని దినాలకు 15.49 కోట్ల ఉపాధి హామీ కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రూ. 73,000 కోట్లు కేటాయించారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరాంతానికి 1 లక్ష కోట్ల రూపాయలకు పైగా వాస్తవ వ్యయాన్ని చేరుకోవచ్చని అంచనా. అత్యంత కీలకమైన జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA) అమలు ఎలా ఉంది? నమో 1.0 పాలనలో మొదటి 5 సంవత్సరాలకు (2014-2019) 80 కోట్ల మంది దారిద్ర్య రేఖ దిగువున ఉన్న కుటుంబాలకు చెందిన వ్యక్తిగత లబ్ధిదారుల ప్రయోజనం కోసం రూ. 5,54,871 కోట్ల విలువైన ఆహార సబ్సిడీని కేంద్రం విడుదల చేసింది. అదే 2004-2014 మధ్య యూపీఏ పాలనలో విడుదలైనది రూ. 5,15,963 కోట్లు మాత్రమే.

ఇంకా, దారిద్ర్య రేఖ దిగువున ఉన్న కుటుంబాల లోని మహిళల సౌలభ్యం కోసం డిసెంబర్ 2, 2022 వరకు పిఎం ఉజ్జ్వల యోజన కింద 9.57 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చారు. గ్రామ ప్రాంత గృహాలకు 100% విద్యుద్దీకరణ లక్ష్యంతో 2.82 కోట్ల ఇళ్లకు సౌభాగ్య – ప్రధానమంత్రి సహజ్ బిజిలీ హర్ ఘర్ యోజన కింద విద్యుద్దీకరించారు. అక్టోబరు, 2017 నుండి ఇప్పటి వరకు 36.87 కోట్ల ఎల్ఈడీ బల్బులు ఉన్నత్ జ్యోతి (ఉజాలా) కింద అందరికీ అందుబాటులో ఉంచారు. ఇంకా, ఆదాయపు పన్ను తగ్గింపుతో పాటు అనేక ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం అందించినందున రాబోయే తరం వ్యాపారవేత్తలను ప్రోత్సహించడంతో అంకుర పరిశ్రమల (స్టార్ట్ అప్ ఇండియా) కార్యక్రమం విజయవంతమైంది.

నల్లధనం, నకిలీ కరెన్సీని నియంత్రించడం కోసం నోట్ల రద్దు (డీమోనిటైజేషన్) అనంతర ప్రభావాన్ని విశ్లేషిస్తే అనేక వాస్తవాలు బహిర్గతం అవుతాయి. ఎందుకంటే నేడు ప్రపంచంలోనే డిజిటల్ కరెన్సీ లావాదేవీలలో భారత్ నంబర్ 1 స్థానంలో ఉంది. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలులో గణనీయమైన వృద్ధి ఉంది. మనం గమనిస్తే, చాలా కాలంగా వేచి ఉన్న జీఎస్టీ అమలు దేశానికి రికార్డు స్థాయిలో ప్రయోజనాలు అందిస్తోంది. నెలకు దాదాపు రూ.1.45 కోట్ల జీఎస్టీ వసూళ్లు అంటే ఆషామాషీ కాదు. గత సంవత్సరంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లలో అనుకూలమైన వృద్ధిని దేశం నమోదు చేసింది. నరేంద్ర మోదీ అంచనాల ప్రకారం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లు రెండూ లక్ష్యాలను అనుకూలంగా చేసుకుంటున్నాయి. పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాల కోసం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఇతర దేశాలకు భారత్ మీద ఉన్న విశ్వాసం, అంతర్జాతీయ సోదరభావాలతో భారత్ బ్రాండ్ ఇమేజ్‌ను అత్యంత సానుకూలంగా మార్చడంలో నరేంద్ర మోదీ విజయవంతమయ్యారు. ఇతర దేశాలతో విజయవంతమైన వ్యూహాత్మక, దౌత్య విధానానికి నమో 1.0 పాలనలో అనుసరించిన తీరు దోహదపడింది. నాణ్యమైన మానవ వనరుల వృద్ధికి ప్రధాని మోదీ అత్యంత



ప్రాధాన్యమిచ్చారు. ప్రధాని ఆదేశాల మేరకు ప్రాథమిక విద్య నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు దేశంలో కొత్త విద్యా విధానం కోసం లోతుగా అధ్యయనం జరిగింది. విద్యార్థులకు ప్రాంతీయ భాషలలో కోర్సులు అందించడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచేందుకు నూతన విద్యావిధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. విద్య ప్రమాణాలు పెంచేందుకు సమగ్ర శిక్షా అభియాన్, యూజీసీకి నిధుల కేటాయింపు ద్వారా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు నడుం కట్టారు. ఆ విధంగా ఉత్తమ అభ్యాసాలతో సానుకూల వాతావరణాన్ని సృష్టించాలన్న ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా ద్వారా ప్రధాని అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా విద్య, నైపుణ్య నాణ్యతను వృద్ధి చేయడం కోసం అడుగులు వేశారు. అలాగే ఉపాధి అవకాశాలను సృష్టించడానికి మేక్ ఇన్ ఇండియాతో మన ఉత్పత్తులు, సేవలకు స్వయం సమృద్ధితో పాటు మరింత మెరుగైన అంతర్జాతీయ మార్కెట్ సృష్టి కోసం ఆత్మనిర్భర్ భారత్‌ను జోడించారు.


నమో 1.0కి ముందు మన్మోహన్ సింగ్ నేతృత్వం లోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వంలోని మంత్రులు, ఇతర ప్రతినిధులపై భారీ అవినీతి ఆరోపణలు, రాజీపడిన సంకీర్ణ ప్రభుత్వ విధానాలతో పాటు ఆర్థికవ్యవస్థపై ప్రపంచ సవాళ్ల ప్రభావం చూపాయి. ప్రస్తుతం ఉన్న కరోనా, ఉక్రెయిన్-రష్యా యుద్ధం వంటి సవాళ్లతో పాటు, యూకే బ్రెక్సిట్, అమెరికా, యూరోపియన్ దేశాల ఆర్థిక వ్యవస్థ మందగమనం మన ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద సవాళ్లుగా మారాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు-పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ గురించి ప్రత్యర్థులు విమర్శలు సంధిస్తున్నప్పటికీ వాస్తవాలు వేరుగా ఉన్నాయి.

2009-10, 2013-14 మధ్య జీడీపీ సగటున 6.70%, అయితే 2014-15, 2018-19 మధ్య 7.38%గా ఉన్నమాట వాస్తవం. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తీరుని పరిశీలించిన తర్వాత, ఈ ప్రభుత్వం అంత్యోదయ ఆధారంగా సంక్షేమ పథకాల అమలు, ఆర్థికాభివృద్ధి కోసం ప్రాజెక్టులతో సమ్మిళిత స్థిరమైన వృద్ధిని సాధించడం కోసం సంతృప్త స్థాయి చేరుకునే వరకు కొనసాగుతుంది. అందువల్లనే దేశంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇక నమో 2.0 సమయంలో ఇప్పుడున్న పరిస్థితుల డిమాండ్లకు అనుగుణంగా అదనపు కార్యక్రమాలతో పాటు నమో 1.0 పాలన ప్రభావం 2023-24 బడ్జెట్ మీద ఉండి తీరుతుంది. ★



**వీర సావార్కర్ చెప్పినట్టు వారంతా 'దేశం కోసం త్యాగం చేయడం జీవితాన్ని వ్యర్థం చేయడం కాద'నుకున్నారు. ఆధునిక స్వాతంత్ర్య సమరాగ్నిలో ఎందరు సమిధలయ్యారో స్పష్టంగా తెలుసుకోవ డానికి ఇప్పటికీ సరైన ప్రయత్నమైతే జరగలేదు. సాధ్యమైనంత మేరకే అయినా ఆ ప్రయత్నం జరగాలి. ఒక ప్రత్యేక సాంస్కృతిక, రాజకీయ నేపథ్యం కలిగిన నరేంద్ర మోదీ ప్రధాని పదవిని చేపట్టారు కాబట్టి ఆజాదీ కా అమృతోత్సవ్ పిలుపు వెలువడింది. చరిత్రపుటలలో చోటు దక్కని ఎందరో త్యాగధనులను కనీసం తలచుకునే అవకాశం జాతికి వచ్చింది.**

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో మరణించిన వారు, అనుశీలన్ సమితి వంటి సంస్థలలో పనిచేస్తూ ప్రాణాలు ఇచ్చినవారు, అండమాన్ జైలులో అనామకంగా కన్నుమూసిన స్వాతంత్ర్య సమరయోధులు, గదర్ వీరులు, మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో భారత్‌లోని శ్వేతజాతి ప్రభుత్వం మీద తిరుగుబాటు లేవదీయడానికి విదేశాల నుంచి మాతృదేశానికి వస్తూ ఓడలలోనే గుఢచారులకు దొరికిపోయి ఆచూకీ లేకుండా పోయినవారు, గదర్ వీరులు ప్రధానంగా ఉన్న హిందూ-జర్మన్ పథకాన్ని అమలు చేసే పనిలో ప్రాణాలు వదిలినవారు, ఉరికంబాలను ఎక్కినవారు, హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీ, ఆజాద్ హింద్ ఫౌజ్ వీరులు, ఇక కొండకోనలలో బ్రిటిష్



గాంధీజీ

దుర్నీతి ఫలితంగా ఎన్ని ఊపిరులు ఆగిపోయాయో లెక్క తెలియదు. ఈ అమరులను తలుచుకోవడానికీ, రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళి ఘటించడానికీ గాంధీజీ వర్ధంతి (జనవరి 30) జాతికి అవకాశం కల్పిస్తున్నది. మన తరం కూడా బానిస సంకెళ్ల శబ్దాలు వింటూనే పుట్టకుండా, వాటిని తెంపిన ఈ మహనీయులందరికీ ఆచంద్ర తారార్కం రుణపడి ఉండాలి. సరే, అంటే భారతజాతి ఈ మహోన్నత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని విస్మరించిందా? కాదు, విస్మరించేటట్టు చేస్తున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ వాస్తవ స్ఫూర్తి నుంచి ఈ తరాలని దూరం చేసే కుట్ర ఒక వాస్తవం... ఈనాటికీ.

స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ పాత్రను తగ్గించి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయి' అని 126వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. కానీ ఇవాళ ఆసేతుశీతాచల పర్యంతం బోస్‌ను ఆరాధిస్తున్నారు. ఆయన పేరుతో బీజేపీ పరాక్రమదివస్ (జనవరి 23)ను తీసుకువచ్చింది. ఈ సందర్భంగా మోదీ అండమాన్ దీవులకు మన అమరజవాన్ల పేరు పెట్టారు. అంటే దేశం కోసం స్వరాజ్య సమరంలో అమరులైన వారి వారసులుగా అమర జవాన్లను గుర్తిస్తున్నట్టు చెప్పకనే చెప్పారు. ఇదొక అద్భుత నిర్ణయం. కానీ ఇలాంటి ఆలోచన ఒక దేశ రాజకీయ, సామాజిక శిబిరాలలో ఒక వర్గానికే పరిమితమవుతున్నదా? ఇప్పటికీ ఈ ప్రశ్న వేసుకోవలసి వస్తున్నది.

మార్గాలు వేరు కావచ్చు, కానీ నేతాజీ, ఆర్ఎస్ఎస్ లక్ష్యం (సమున్నత భారత్) ఒక్కటే అని బోస్ 126వ జయంతి సందర్భంగానే ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్‌భగవత్ కోల్‌కతా సభలో నివాళి ఘటించారు. కాగా జనవరి 21 ప్రాంతంలో ఆ కోల్‌కతాలోనే బోస్ కుమార్తె అనితా బోస్ చెప్పిన మాటలు కొంచెం ఆశ్చర్యం కలిగించాయి. ఆ మాటలు ఆమెవేనా? అన్న అనుమానం కలిగించేటట్టు ఉన్నాయి. 'ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి నేను విన్నదాని ప్రకారం వారిది బహుశా నేతాజీ వారసత్వాన్ని సొంతం చేసుకోవాలన్న ప్రయత్నం అయి ఉండవచ్చు. కానీ నేతాజీ హిందువే అయినా అన్ని మతాలనూ గౌరవించారు. భిన్న మతాలను పాటించేవారు సామరస్యంగా జీవించాలని కోరుకున్నారు. ఈ ధోరణి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లో కనిపించదు. సులభంగా చెప్పాలంటే వాళ్లు రైటిస్టులైతే, నేతాజీ లెఫ్టిస్ట్. భావజాల పరంగా నేతాజీకీ కాంగ్రెస్‌కూ మధ్య చాలా సారూప్యత ఉంటుంది' అన్నారామె. సెప్టెంబర్, 2022లో ఢిల్లీలో నేతాజీ బోస్ విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించినప్పుడు ఆమె కృతజ్ఞత తెలియచేస్తూ పలికిన పలుకులలో లేని ధోరణి ఇంతలోనే ఎందుకు వచ్చిందో అర్థం



నేతాజీ



సావార్కర్‌



పటేల్‌



భగత్‌సింగ్‌

# స్వరాజ్య సమరయోధులను సరైన పంథాలో అంచనా వేద్దాం!

**స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలని ఇప్పటికీ సమ్యక్‌దృష్టితో అంచనా వేసే సంస్కారం చాలా మందిలో లోపిస్తున్నదని చెప్పడానికి అనేక రుజువులు ఉన్నాయి. ఇలాంటివారు కాలమాన పరిస్థితులను బట్టి కాకుండా, వర్తమాన రాజకీయ పైత్యాలతో, కళ్లద్దాలతో ఆ మహనీయులను చూస్తున్నారు. అది సరికాదు. ఇకనైనా వారి త్యాగాన్ని సరైన దృక్పథంతో అంచనా వేయాలి. వారి జాతీయ భావాల విలువను, అందులోని శాశ్వతతత్త్వాన్ని గుర్తించాలి.**

చేసుకోవడం కష్టంకాదు. స్వతంత్ర భారత్‌ కల తప్ప మరొకటేదీ తన తండ్రి మదిలో లేదనీ, ఆయన చితాభస్మాన్ని భారత్‌కు తీసుకురావడంలో అన్ని రాజకీయ పార్టీలు చేయూతనివ్వాలని కోరారు. ఈ సమన్వయం ఇప్పుడు కనిపించక పోవడం దురదృష్టకరం. కాంగ్రెస్‌తో ఆయన విభేదాలు, గాంధీజీతో ఆయన వైరుధ్యాలు అర్థం చేసుకోదగినవి. కానీ 'నేతాజీది లెఫ్ట్‌ ధోరణి' అని తీర్పు ఇవ్వడం చారిత్రక దృక్పథం అనిపించుకోదు.

ఇక్కడ లెఫ్ట్‌ అంటే వామపక్షమని అర్థం కాదు. నిజమే. అంతర్జాతీయవాదం, స్వేచ్ఛ, సమత్వం, సౌభ్రాత్రం, పురోగామి దృక్పథం వంటి భావాలను స్థూలంగా లెఫ్ట్‌ అని పిలుస్తారు. ఇవి ఆర్‌ఎస్‌ఎస్‌, బీజేపీలో లేవని ఆమె తేల్చడం, నిజంగా బోస్‌ను ఆదినుంచి గౌరవిస్తున్న ఏకైక రాజకీయ దృక్పథాన్ని కించపరచడమే. త్రిపురి (మధ్యప్రదేశ్‌) జాతీయ కాంగ్రెస్‌ ఎన్నికల తరువాత ఆ సంస్థ నేతాజీని వెంటాడిన మాట వాస్తవం. బ్రిటిష్‌ జాతిని నిలువెల్లా ద్వేషించిన బోస్‌, రెండో ప్రపంచ యుద్ధ సమీకరణలను బట్టి జపాన్‌, జర్మనీల సాయం కోరారు. స్వదేశ స్వేచ్ఛ కోసం బ్రిటన్‌ వ్యతిరేక కూటమికి దగ్గర కావడాన్ని, సోవియెట్‌ రష్యా వ్యతిరేకతగా చిత్రించిన కమ్యూనిస్టులు బోస్‌ను ఎంత నీచంగా చిత్రించారో తలుచుకుంటే మనసు మళ్లీ మళ్లీ గాయపడుతూనే ఉంటుంది. కానీ ఆది నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌, జనసంఘ్‌, తరువాత బీజేపీ మాత్రమే బోస్‌ను మనస్ఫూర్తిగా ఆరాధిస్తున్నాయి.

విభేదాలను బట్టి కాదు. అనుసరించిన సిద్ధాంతాన్ని బట్టి కూడా కాదు. దేశం పట్ల ఒక నేతకు ఉన్న నిబద్ధత, దేశాన్ని కలిపి ఉంచే జాతీయ భావాలను నిలబెట్టడానికి, నిలపడానికి చూపిన మార్గం, చరిత్రలో వాటి జాడ, వాటిలోని, విచక్షణ, నిజాయతీ– ఇవే ఒక స్వాతంత్ర్య సమరయోధుడిని, ఒక అమరవీరుడిని ఆరాధించడానికి గమనంలోకి తీసుకోవలసిన గీటురాళ్లు. సావార్కర్‌కూ, ఆర్‌ఎస్‌ఎస్‌కూ కొన్ని అంశాలలో పొరపొచ్చాలు ఉన్నాయి. గాంధీజీ హత్య తరువాత అందరితో పాటు సర్దార్‌ పటేల్‌ కూడా ఆర్‌ఎస్‌ఎస్‌ మీద ఆగ్రహించారు. అయినా వారిని జాతి ఎప్పటికీ మహనీయులుగానే గుర్తించాలి. స్వరాజ్య సమరయోధునిగా, హిందూత్వవాదిగా, జాతీయవాదిగా, సంస్కర్తగా, రచయితగా, చరిత్రకారునిగా, అతి జాతీయవాద పంథాకు ఆద్యునిగా సావార్కర్‌ స్థానం అజరామరమైనది. ఆయన ఆంగ్లేయులను క్షమాభిక్ష వేడారు కాబట్టి చరిత్రహీనుడనే నీచులు తయారయ్యారు. అసలు యాభయ్‌ఏళ్ల జైలు శిక్ష ఏమిటి? ఒక వలస ప్రభుత్వం వేసిన ఈ అమానవీయ శిక్ష నుంచి తప్పించుకోవడానికి సావార్కర్‌ చేసిన ప్రయత్నాన్ని వలసవాద దృష్టితో చూస్తున్న ఫలితమిది. జైలు నుంచి వచ్చిన తరువాత సావార్కర్‌ చేసిన సంఘసేవ, అంటరానితనం నిర్మూలన కృషి గమనించకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం అజ్ఞానం. నెహ్రూ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా సంస్థానాలను ఏకం చేసి, స్వరాజ్య సమరం దేనికోసం పోరాడిందో దానిని నిజంగా సాధించినవారు పటేల్‌. విభజిత భారత్‌లో 46 శాతం ఉన్న సంస్థానాలను విలీనం చేయకుంటే భారత్‌ నేడు ఇలా ఉండేది కాదు. ఇది చారిత్రక సత్యం. అయినా వారిని ఆర్‌ఎస్‌ఎస్‌, బీజేపీ ఎంత గౌరవిస్తున్నాయో అందరికీ తెలుసు. భగత్‌సింగ్‌ మార్క్సిజం చదివారు కాబట్టి ఆయనను స్మరించే హక్కు సంఘ పరివార్‌కు లేనేలేదని వాదించే పిడివాద నాటు కమ్యూనిస్టులు ఎప్పుడూ ఉన్నారు. భగత్‌సింగ్‌ దేశభక్తికి తిరుగులేని చిరునామా. దేశద్రోహ చింతనకి ఆలవాలం భారతీయ కమ్యూనిస్టు దృష్టి. ఎంతో సేవ చేసినప్పటికీ, సమకాలీన సమాజాన్ని మౌఢ్యం నుంచి తప్పించడానికి శ్రమించినప్పటికీ వారు జంధ్యాలు ధరించారనే కారణాన్ని చూపించి పలువురు సంఘ సంస్కర్తలనీ, స్వాతంత్ర్య సమరయోధులనీ కూడా చరిత్ర నుంచి వెలివేయాలన్న పరమ సంకుచితులైన ఆధునిక ఛాందసవాదులూ ఇవాళ్టి స్వయం ప్రకటిత మేధావులలో కోకొల్లలు.

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలని ఇప్పటికీ సమ్యక్‌దృష్టితో అంచనా వేసే సంస్కారం చాలా మందిలో లోపిస్తున్నదని చెప్పడానికి అనేక రుజువులు ఉన్నాయి. ఇలాంటివారు కాలమాన పరిస్థితులను బట్టి కాకుండా, వర్తమాన రాజకీయ పైత్యాలతో, కళ్లద్దాలతో ఆ మహనీయులను చూస్తున్నారు. అది సరికాదు. ఇకనైనా వారి త్యాగాన్ని సరైన దృక్పథంతో అంచనా వేయాలి. వారి జాతీయ భావాల విలువను, అందులోని శాశ్వతతత్త్వాన్ని గుర్తించాలి. గతానికీ వర్తమానానికీ మధ్య అనుబంధం కొనసాగిస్తూనే, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో, సమానత్వంతో వర్తమాన భారతం పరిఢవిల్లాలన్న వారి ఆశయాన్ని శిరోధార్యం చేసుకుందాం. అదే వారికి భారతజాతి ఇచ్చే నిజమైన నివాళి. ★





జనవరి 12, జనవరి 17, జనవరి 22... ఎక్కడో ఆస్ట్రేలియాలో కొద్దిమంది హిందువులు పూజాపునస్కారాలు చేసుకునే మూడు గుళ్ల మీద ఆ తేదీలలోనే అంటే నెల రోజులు లోపుననే ఈ దాడులు జరిగాయి. ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, ఇంగ్లండ్ అంతటా హిందువులు మీద, వారి సంస్కృతి మీద నీచమైన పద్ధతిలో దాడులు చేస్తున్నారు. హిందుత్వను కూకటివేళ్లతో పెకలించాలంటూ అమెరికాలో ఒక అంతర్జాతీయ సదస్సునే (డిజ్‌మ్యాంటిలింగ్ గ్లోబల్ హిందుత్వ) నిర్వహించారు. కొన్నిచోట్ల ముస్లింలు, కొన్నిచోట్ల ఖలిస్తానీ ఉగ్రవాద మద్దతుదారులు ఈ పనికి పాల్పడుతున్నారు. ఈ అంతటికీ అదే కారణమా అంటే, కావచ్చును, కానీ, అంత తేలిగ్గా తీసుకునే విషయం అయితే కాదు. అవును, ఆస్ట్రేలియాలో ఖలిస్తానీ ఉగ్రవాదులు, ఉగ్రవాద మద్దతు దారులు హిందూ దేవాలయాలపై సాగిస్తున్న వరస దాడులకు, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మళ్లీ బీజేపీ/ ఎన్డీఏ అధికారంలోకి వస్తుందనే, హ్యాట్రిక్ సాధిస్తుందనే భయం ఒక కారణం అయితే కావచ్చును. కానీ, భారత దేశ విచ్ఛిత్తికి విఫల ప్రయత్నాలు చేస్తున్న, జాతీయ విజాతీయ శక్తులు, కాంగీ, కమ్మీ ఇత్యాది కుహనా లౌకికవాద పార్టీలు, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు, ఏపీ నుంచి ఆస్ట్రేలియా వరకు హిందూ దేవాలయాలపై ఉమ్మడిగా సాగిస్తున్న దాడులను, విరజిమ్ముతున్న విషాన్ని అంత తేలిగ్గా తీసుకోవడానికి లేదు. తస్మాత్ జాగ్రత్త

# ఖలిస్తాన్ కుంపటిని

ఆంధ్రప్రదేశ్‌లో ఏమి జరుగుతోంది? 'పిచ్చోళ్లు' దేవాలయాలపై దాడులు చేస్తున్నారు. విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. చిత్రంగా అవన్నీ హిందూ దేవాలయాలే. ఆ విగ్రహాలన్నీ హిందూ దేవీ దేవతలవే. పిచ్చోళ్ల మీద ఏం చర్యలు తీసుకుంటా మని, సెక్యులర్ ప్రభుత్వం, సెక్యులర్ రాజకీయ పార్టీలు మౌనంగా చూస్తూ ఉండిపోయాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు, పొరుగున ఉన్న తమిళనాడులో, మరో రాష్ట్రంలో, దేశంలో ఎక్కడంటే అక్కడ హిందూ దేవాలయాలు దాడులకు గురవు తున్నాయి. హిందూ వ్యతిరేక కుహనా లౌకికవాద శక్తులు,సెక్యులర్ రాజకీయాల ముసుగులో సాగిస్తున్న ఈ దాడుల వెనక విదేశీశక్తుల కుట్రలు ఒక వాస్తవం.

అలా అని ఇది ఎవరికీ తెలియని రహస్యం కాదు. అందరికీ తెలిసిన పచ్చి నిజం. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాగిస్తున్న కుట్రలు, కుతంత్రాలలో భాగంగా ఈ విధమైన దాడులు జరుగుతున్నాయి. అలాగే, అంతర్జాతీయ ఉగ్రవాదసంస్థలతో భారతీయ రాజకీయ పార్టీలకు, మరీ ముఖ్యంగా ఖలిస్తాన్ మద్దతుదారులు, ఉగ్రవాదులతో ఉన్న సంబంధాల గురించి కూడా వేరే చెప్పనక్కరలేదు. ఢిల్లీ ముఖ్య మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌కు ఖలిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధా లున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆరోపణలు చేసింది ఎవరో కాదు, ఒకప్పుడు కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితునిగా ఉన్న కుమార్ బిశ్వాస్. నిజానికి, స్వయంగా కేజ్రీవాల్, 'అయితే ఢిల్లీ ముఖ్యమంత్రి నవుతా, లేదంటే దేశాన్ని రెండుముక్కలు చేసి ఒక ముక్కకు ప్రధానమంత్రినవుతా' నంటూ తనతో అన్న మాటలను ఉటంకిస్తూ బిశ్వాస్ ఈ విమర్శ చేశారు. అంతేకాదు, తనకు ఖలిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధం లేదని కేజ్రీవాల్ బహిరంగ ప్రకటన చేయాలని కుమార్ బిశ్వాస్ సవాలు చేశారు. కేజ్రీవాల్ అలాంటి ప్రకటన ఏదీ చేయలేదు కానీ, తాను, ప్రజలకు మేలు చేసే 'స్వీట్‌టెర్రరిస్టు' ను అని ప్రకటించారు.



రాజనాల బాలకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్

ఇప్పుడు ఇదే ఖలిస్తాన్ మద్దతుదారులు ఆస్ట్రేలి యాలో దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్నారు. పక్షం రోజుల వ్యవధిలో మూడు ప్రసిద్ధ హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయి. ఈ దాడులకు పాల్పడింది ఎవరో కాదు, మనదేశంలో కుహన లౌకికవాదులు పెంచి పెద్దచేసిన ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థ మద్దతుదారులు. ఖలిస్తానీ మద్దతుదారులు ధ్వంసం చేసిన హిందూ దేవాలయాల గోడలపై, రాసిన రాతలే అందుకు సాక్ష్యం. ఆస్ట్రేలియాలో దాడులకు గురైన మూడు హిందూ దేవాలయాల గోడలన్నీ, 'ఖలిస్తాన్ జిందాబాద్', 'హిందుస్తాన్ ముర్దాబాద్' అన్న నినాదాలతో నింపేశారు.

అలాగే, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా, భారతదేశంపై విద్వేషం వెదజల్లే నినాదాలు రాశారు. తాజాగా, ఖలిస్తానీ మద్దతుదారుల దాడికి గురైన ఒక దేవాలయం మెల్‌బోర్న్‌లోని ఆల్బర్ట్ పార్క్‌లో ఉంది. అంతకు ముందు, ఖలిస్తానీ మద్దతుదారులు కారమ్ డౌన్స్‌లోని శ్రీ శివ విష్ణుదేవాలయం, మిల్ పార్క్‌లోని బీఏపీఎస్ స్వామినారాయణ మందిరం పై దాడులు చేశారు. విధ్వంసం సృష్టించారు. ఆ రెండు ప్రసిద్ధ ఆలయ ప్రాంగణాలలోని గోడలను కూడా హిందూ వ్యతిరేక, భారతదేశ వ్యతిరేక నినాదాలు, చిహ్నాలతో నింపేశారు. భారతదేశానికి, భారత ప్రభుత్వానికి మరీ ముఖ్యంగా ప్రధాని మోదీకి వ్యతిరేకంగా విద్వేషపూరిత సందేశాలతో గోడలు నిండిపోయాయి. అంతే కాదు, వేలమందిని పొట్టన పెట్టుకున్న ఖలిస్తాన్ ఉగ్రవాది భింద్రన్‌వాలేపై ప్రశంసలు కురిపించారు. (భింద్రన్‌వాలా ఎవరు ఏమిటి, అది వేరే చరిత్ర (కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలకీ, అధికార దాహానికీ కలిగిన అక్రమ సంతానమే భింద్రన్‌వాలా). హిందూ దేవాలయాలపై ఇలా వరుస దాడులు అక్కడి హిందువులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

ఈ విషయాన్ని భారత్ అంత సులభంగా తీసుకునే అవకాశం ఉండదు. భింద్రన్‌వాలాకీ, అతడిలోని రాక్షసుడికి ప్రాణ ప్రతిష్ట చేయాలన్న ఆశతో హిందూ దేవాలయాల మీద దాడులకు దిగితే సహించే విషయం కాబోదు. భారత్‌లోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఈ ఘటనలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. మెల్‌బోర్న్‌లోని రెండు హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఈ విషయంపై ఉభయ దేశాల మధ్య ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి తెలిపారు. ఇండియన్ కాన్సులేట్ జనరల్ మెల్‌బోర్న్ పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆలాగే, స్థానిక




# ఇంకా రాజేయకండి!

ఎంపీ బ్రాడ్ బట్టిన్ నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తామన్నారు.

మిల్ పార్క్‌లోని బీఏపీఎస్ స్వామి మందిరంపై జనవరి 12న, కారమ్ డౌన్స్‌లోని శ్రీ శివ విష్ణు మందిరం, జనవరి 16 మధ్య రాత్రి సమయంలో దాడులు జరిగాయి. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కానీ, ఇంతలోనే మెల్‌బోర్న్‌లోని ఆల్బర్ట్ పార్క్‌లో ఉన్న మరో మందిరం పై దాడి జరిగింది. నిజానికి, ఒక ఆస్ట్రేలియాలో మాత్రమే కాదు, బ్రిటన్, కెనడా దేశాల్లోనూ గత కొంత కాలంగా ఖలిస్తాన్ ఉగ్రవాదుల మద్దతు దారులు వరస దాడులకు పాల్పడుతున్నారు. అమెరికాలో (జనవరి 11 న) టెక్సాస్ రాష్ట్రంలోని బ్రజోస్ పట్టణంలోని శ్రీ ఓంకారనాథ్ అలయంలో దొంగలు పడి, విలువైన వస్తువులను దోచుకున్నారు.

ఇక పాకిస్తాన్‌లో పరిస్థితిని ప్రత్యేకించి చెప్ప వలసిన అవసరం లేదు. సింధ్ ప్రావిన్స్‌లోని శివారు ప్రాంతాల్లో హిందూ యువతులు, మహిళల్ని కిడ్నాప్‌లు చేయడం, బలవంతంగా మతం మార్చడం గురించి తరచూ వార్తలు వస్తున్నాయి. అది అక్కడ నిత్యకృత్యంగా మారింది. హిందువులు అత్యధికంగా ఉండే థార్, ఉమర్‌కోట్, మిర్‌పుర్‌ఖాస్, ఘోట్కి, ఖైరాపూర్ వంటి చోట్ల ఈ పరిస్థితి మరీ దారుణం. నిజానికి ఈ సంఘటనలను విడివిడిగా చూస్తే, వేటికవి చిన్ని సంఘటనలు, లేదంటే 'పిచ్చోళ్ల' చేష్టలు అనిపించవచ్చును, కానీ, వాస్తవం అది కాదు. ఒక పథకం ప్రకారం కుహనా లౌకికవాద దేశీయశక్తులు అంతర్జాతీయంగా సాగిస్తున్న కుట్రలో భాగంగానే, దేశంలో విదేశాల్లో దేవాలయాలపై దాడులు జరుగు తున్నాయి. ఆస్ట్రేలియాలో జరిగిన, జరుగుతున్న దాడుల విషయానికివస్తే, ఈ దాడులు ఎవరు చేస్తున్నారు అనేది కాదు, (అది స్పష్టంగా దేవాలయాల గోడల మీది రాతలతోనే తెలిపోయింది) ఎందుకు చేస్తున్నారు? అనేదే ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న. అయితే, అది కూడా అంత చిక్కు ప్రశ్న కాదు.

గుజరాత్ అల్లర్లకు అగ్గిరాజేసిన 59 మంది కరసేవకుల సజీవ దహనం సంఘటనను వదిలేసి అనంతర పరిణామాలను వక్రీకరించి, బీబీసీ ఇప్పుడు.. ఇన్నేళ్ల తర్వాత, డాక్యుమెంటరీ ఎందుకు తీసింది? ఎందుకు ఇప్పుడే విడుదల చేసింది? నిజానికి, 20 ఏళ్ల క్రితం 2002 ఫిబ్రవరి నెలలో గోధ్రా రైల్వే స్టేషన్‌లో నిలిచిన సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–6 బోగీకి దుండగులు నిప్పంటించడంతో దాదాపు 59 మంది సజీవదహన మయ్యారు. గోధ్రా అనంతరం జరిగిన అల్లర్లలో వెయ్యి మంది వరకు చనిపోయారు. కానీ, ఈ మారణకాండకు అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యులు కాదని, సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా, బీబీసీ ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ ఎందుకు తెచ్చింది? దేశంలోని కుహనా లౌకిక వాదులు ఎందుకు చంకలు గుద్దుకుంటున్నారు? ఎన్నికల సంవత్సరం కాబట్టి. ఈ సమయంలో మత ఉద్రిక్తలను రెచ్చగొట్టేందుకు బీబీసీ ముసుగులో ఈ వికృత క్రీడకు తెర తీశారా? లేకుంటే ఎందుకీ ప్రయత్నం? జాతీయంగా, అంతర్జాతీయంగా హిందూ వ్యతిరేకత, మోదీ వ్యతిరేకత, దీనికి తోడుగా ఒక గందరగోళ వాతావరణాన్ని సృష్టించేందుకు, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాల్లో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయి.


ఖలిస్తానీ ఉగ్రవాదాన్ని అణచివేసే క్రమంలో నాడు భారత్ భారీ మూల్యాన్నే చెల్లించాల్సి వచ్చిందనే విషయాన్ని, దేశప్రజలు ఎప్పటికీ మరిచిపోరాదు. పంజాబ్‌లో దాదాపు 1,1694 మంది సాధారణ పౌరులు, 1784 మంది భద్రతా సిబ్బంది ఉగ్రవాదా నికి బలయ్యారు. 8000 కు పైబడి ఉగ్రవాదులు భద్రతాదళాల చేతులలో హతమయ్యారు. ఒక ప్రధాని, ఒక ముఖ్యమంత్రిని ఖలిస్తానీ ఉగ్రవాద మూకలు మింగేశాయి. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఉగ్రవాదం పంజాబ్‌ను యాభై సంవత్సరాలు వెనక్కు నెట్టింది. ఇప్పుడు మళ్లీ ఉగ్రవాద భూతం జడలు విప్పుకోవడం, పంజాబ్‌కే కాదు దేశానికి ఎంతమాత్రం క్షేమం కాదు. అందుకే, మనల్ని మనం తస్మాత్ జాగ్రత్త అని అప్రమత్తం చేసుకోక తప్పదు. ఖలిస్తాన్ భూతాన్ని తిరిగి ఆవాహన చేస్తే అది బీజేపీకో, ఆరెస్సెస్‌కో, హిందువులకో మాత్రమే ప్రమాదం కాదు. దేశంలోని అన్ని మతాలకి, అన్ని వర్గాలకి. ఇది కాంగ్రెస్ వంటి విధ్వంసక పక్షాలు గుర్తించడం అవసరం. తమ పార్టీ నేత, ఈ దేశ ప్రధానిని చంపిన చరిత్ర వారికి ఉన్నా ఫర్వాలేదు. మోదీని దించడానికి మాత్రం వాళ్లని ఉపయోగించుకోవచ్చునన్న నీచపు బుద్ధి కాంగ్రెస్ ప్రదర్శిస్తున్నది. ఢిల్లీలో రైతు ఉద్యమం పేరుతో తిష్టవేసిన ఖలిస్తానీ ఉగ్రవాదులకు మళ్లీ చేయి అందించి ఇంతవరకు తీసుకువచ్చిన పాపం విపక్షాలది కాదని ఎలా అనగలం? ఆస్ట్రేలియాలోనే కావచ్చు. లేదా భారత్‌లోనూ కావచ్చు. ఆ ఘటనలతో హిందువుల మనోభావాలు అంతగా గాయపడినా ఒక్క రాజకీయ పార్టీ కూడా నోరు విప్పదేం? ★



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

# 'దేవుడుబాబు' పూడిపెద్ది

**అనాథ యువకుడు అసామాన్యుడిగా ఎదిగి, స్వరాజ్య సమరానికి, దీనజనోద్ధరణ కోసం సర్వం ధారపోశారు. ఎందరికో వివాహాలు చేయించిన తాను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కూతురి పెళ్లి వాయిదా పడినా చింతించ లేదు. పేదల ఆకలి తీరడమే ప్రధానంగా భావించి దానధర్మాలు, సమాజసేవకు అంకితమైన ఆయనను విశాఖవాసులు 'దేవుడుబాబు'గా స్మరించుకుంటారు. ఆయనే పూడిపెద్ది సుందరరామయ్య.**




'వందేమాతరం అంటున్నది మా తరం పదం పదం గళం గళం కలగలిపి నిరంతరం'... అంటూ ఉద్యమించి, బ్రిటిష్ వారి తుపాకులకు ఛాతిని చూపి ప్రాణత్యాగానికైనా సిద్ధపడిన ఎందరో త్యాగధనుల ఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్ర భారతం. పదహారేళ్ల ప్రాయపు యువ కిశోరాల నుంచి ఆరు పదుల వయసు పైబడిన వారు ఎందరో స్వరాజ్య సమరంలో కదం తొక్కారు.

అలాంటి మహనుభావులలో చాలా మంది పేర్లు, వారికి సంబంధించిన పూర్తి వివరాలు గానీ ప్రజానీకానికి అంతగా తెలియదు. వారు స్వాతంత్ర్య సమరానికి ఇచ్చినంత ప్రాధాన్యం ప్రచారానికి కాని, నాటి ప్రముఖులతో తీయించుకున్న ఛాయాచిత్రాలను సేకరించి, భద్రపరుచుకోడానికి గానీ ఇవ్వకపోవడమే కారణం అయి ఉంటుంది. అలా ఎన్నో 'వీర' మాణిక్యాలు మరుగున పడిపోయి ఉన్నాయి.

అలాంటి వారిలో విశాఖ జిల్లా ఎలమంచిలి సమీపంలోని దిమిలి గ్రామానికి చెందిన పూడిపెద్ది సుందరరామయ్య ఒకరు.


పూడిపెద్ది కృష్ణమూర్తి, వెంకటరత్నం దంపతులకు సుందరరామయ్య ఆగష్టు 12, 1912న జన్మించారు. తండ్రి దిమిలి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. తాతముత్తాతల కాలం నాటి నుంచి వారంతా బాలాత్రిపుర సుందరీదేవి ఉపాసకులు. సుందరరామయ్యకు కూడా ఆ వారసత్వం అబ్బింది. ఆయనకు పదిహేనేళ్ల వయసులో తల్లిదండ్రులు పది నెలల తేడాతో కన్నుమూశారు. చిన్నతనం నుంచి ధైర్యం, స్వతంత్ర భావాలు కలిగిన ఆయన అనాథగానే స్వశక్తితో ఎదిగారు. కేంబ్రిడ్జి స్కూల్లో ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రులయ్యారు.

తమ పదిహేడవ ఏట (1929) స్వరాజ్య ఉద్యమబాట పట్టిన సుందరరామయ్య అతిపిన్న వయసులోనే స్వాతంత్ర్యం కోసం పోరాడిన యువకుడిగా మన్ననలు అందుకున్నారు. మహాత్మాగాంధీ 1929-45 మధ్య కాలంలో ఐదుసార్లు విశాఖపట్నం రాగా రెండుసార్లు ఆయనను దర్శించుకున్నారు. ఆయన పిలుపు మేరకు ఆయన చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఏప్రిల్ 28, 1929న విశాఖపట్నంలో జరిగిన పెద్ద బహిరంగ సభలో ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ గురించి గాంధీజీ చేసిన ప్రసంగం, అప్పటికే దేశభక్తి గల ఆయనను మరింత ఉత్తేజ పరిచింది.

పట్టభద్రులైన వెంటనే విశాఖ హార్బర్ (పోర్టు ట్రస్ట్)లో టైం సూపర్‌వైజర్ ఉద్యోగం లభించింది. కానీ బ్రిటిష్ వారిచ్చిన దుస్తులు, గడియారం ధరించి పని చేయడం ఇష్టం లేక నెలరోజులకే రాజీనామా చేశారు. చదువు పట్ల గల ఆసక్తితో మళ్లీ అటువైపు దృష్టి మళ్లించి న్యాయశాస్త్రంలో చేరారు. అంతలోనే (1933) గాంధీజీ నుంచి పిలుపు రావడంతో మరునాటి నుంచి జరగబోయే న్యాయశాస్త్రం తుది సంవత్సరం పరీక్షలను మానుకుని స్వాతంత్ర్య సమరం దిశగా సాగిపోయారు. ఇక అక్కడనించి వెనుతిరిగి చూడకుండా, వి.వి.గిరి, తెన్నేటి విశ్వనాథం, మల్లెమడుగు జగన్నాథరావు, చెరుకువాడ నర్సింహారావు పంతులు, దేశభక్త కొండా వెంకటప్పయ్య, మల్లవరపు వెంకట కృష్ణారావు, మారేపల్లి రామచంద్ర కవి, దిగుమర్తి వెంకటరామస్వామి, దిగుమర్తి జానకీ బాయి, కొల్లూరు సూర్యం గుప్తా తదితర నాయకులతో కలసి సహాయ నిరాకరణ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, తదితర స్వాతంత్ర్య ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

**పెందుర్తి రైల్‌రోకో**

విశాఖ జిల్లా పెందుర్తి రైల్వేస్టేషన్ పట్టాలపై కూర్చుని నిర్వహించిన రైల్‌రోకో కార్యక్రమం చాలా విజయవంతమైంది. ప్రముఖ స్థానిక నాయకులు యాభై మంది దాకా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి పేర్లను ఒక శిలా ఫలకంపై చెక్కించి పెందుర్తి పంచాయతీ కార్యాలయంలో ప్రతిష్ఠించడం విశేషం. అది నేటికీ అక్కడ దర్శనమిస్తుంది. పైన పేర్కొన్న నాయకులతో జైలుకు వెళ్లారు. అక్కడి ఆంగ్లేయ అధికారుల అడిగే ఏ ప్రశ్నకైనా వారందరూ



ఉగాది వసంత పూడిపెద్ది
(సుందరరామయ్య కుమార్తె)
9849455367



'వందేమాతరం' అనే చెప్పేవారట. 'వందేమాతరం' అని నినదించిన ప్రతిసారి లాఠీతో పది దెబ్బలు కొట్టాలన్నది బ్రిటిష్ వారి ఆజ్ఞట. వారు ఆ దెబ్బలకు వెరవకుండా 'వందేమాతరం' నినాదం ఇచ్చేవారు. స్వాతంత్ర్య ఉద్యమాలలో ఉత్సాహంగా పాల్గొన్న వారెవ్వరికి ఎక్కడ ఉద్యోగాలు ఇచ్చేవారు కారు. సొంతగా వ్యాపారాలు కూడా పెట్టుకోనిచ్చే వారు కారు. అలా చేస్తే ఏదో వంకతో అరెస్ట్ చేసి ఖైదు చేసి హింసించే వారు ఆంగ్లేయులు. దాంతో సుందర రామయ్య సహా ఇతర ముఖ్యనాయకులు, కొన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లారు. విజయనగరం దగ్గరి తుర్కమ్మెరువు అనే కుగ్రామంలో కొన్నాళ్లు తలదాచుకున్నారు. ఆ తరువాత కొందరు కోల్‌కతలో మారుపేర్లతో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ తలదాచుకున్నారు.

**దొరల మనసు గెలిచి...**

ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధసమయంలో ఆంగ్లేయ ప్రభుత్వం ఒక పనికి టెండర్‌లను పిలిచినట్లు తెలిసింది. సైనికులకు, ఇతర సిబ్బందికి ఎలాంటి అనారోగ్యం కలుగకుండా ఉండేలా నాణ్యమైన ఆహారం అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆర్మీ కాంట్రాక్టులకు టెండర్లను ప్రకటించింది. 'సుందరం పంతులు' అనే పేరుతో కొటేషన్ వేసి కాంట్రాక్టు గెలుచుకున్నారు సుందర రామయ్య. చేసే పని పట్ల నిబద్ధత కలిగిన ఆయన నాణ్యమైన సరకులు, సేవలు అందించి బ్రిటిష్ ఆర్మీ అధికారుల మన్ననలు అందుకున్నారు. ఆయన నిజాయతీని మెచ్చిన బ్రిటిష్ సైనికాధికారులు డబ్బుతో పాటు లక్ష రూపాయలను బహుమానం అందచేశారు.


**సమాజసేవలో పూడిపెద్ది**

సుందరరామయ్యకు దేశ భక్తులంటే చాలా అభిమానం. ఆర్మీ కాంట్రాక్టు ద్వారా సంపాదించిన సొమ్ములో కొంగ భాగాన్ని వారికే కేటాయించేవారు. 'వందేమాతరం' అని నినదించిన వారిని ఇంటికి తీసుకు వెళ్లి భోజనం పెట్టించడంతో పాటు ఆర్థిక సహాయం చేసేవారు. యువకులు అధిక సంఖ్యలో ఉద్యమాలలో పాల్గొనేలా వారికి ఉచిత భోజన వసతులు కల్పించేవారు. వారి ఇళ్లకు పంపడానికి డబ్బు కూడా ఇచ్చేవారు. ఆయన సంపాదన ఎందరో పేదల ఆకలి తీర్చింది, ప్రాణాలు పోసింది. పురుటి నొప్పులతో బాధపడే వారిని తన కారులో ఆస్పత్రికి పంపేవారు. 'స్టోన్ హౌస్' అనే ఇల్లుకట్టించి, పేద బ్రాహ్మణ పిల్లలకు పెళ్లిళ్లు చేయించేవారు. అలా దాదాపు 105 పెళ్లిళ్లు చేయించారని చెపుతారు.

అవసరార్థులు గడప తొక్కితే వెంటనే ఆర్థిక సాయం అందించే వారు. ఎవరికైనా కష్టం ఉందని తెలిస్తే వారి ఇంటికి వెళ్లి మరీ ధన సహాయం చేసేవారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తీరిక లేకుండా ఉంటూ వ్యాపారాలను పట్టించుకోక పోవడం వలన తీవ్రంగా నష్ట పోయారు. అవసరాలకి అప్పు తీసుకున్న మిత్రులు మొహం చాటేయడంతో, కేవలం చేతిలో డబ్బులేని కారణంగా వారి పెద్ద కుమార్తె వివాహం మూడుసార్లు వాయిదా పడింది.

పేదరికం, ఆకలి రుచి ఏమిటో తెలిసి, అనాథల అవస్థలను స్వయంగా ఎరిగినవారు కావడంతో దేశంలో పేదరికం అనేది లేని రోజు రావాలని ఆకాంక్షించారు. అవసరంలో ఉన్నవారిని ఆదు కొంటూ, అందరికి ఆత్మబంధు వయ్యారు సుందరరామయ్య. ఆయన చేసిన దానధర్మాలు, సమాజ సేవకు గాను విశాఖ వాసులు 'దేవుడుబాబు'గా స్మరించుకుంటారు.

పూడిపెద్ది సుందరరామయ్యకు సంబంధించి ఇటీవల మూడు గౌరవాలు దక్కాయి. 'ప్రధాన మంత్రి యువ మెంటర్‌షిప్‌లో భాగంగా, పలువురు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలతో నేషనల్ బుక్ ట్రస్ట్ 23 భాషలలో ముద్రించనున్న గ్రంథంలో వీరి పేరూ చోటుచేసుకోవడం చెప్పుకో దగిన విశేషం. అలాగే ఆగస్టు 1, 2022న స్వాతంత్ర్య దిన వజ్రోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాశవాణిలో చేసిన ప్రసంగంలో పూడిపెద్ది గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తూ ప్రసంగించారు. అదే నెల 15 వ తేదీన ఆజాది కా అమృతోత్సవ్‌లో భాగంగా ఆకాశవాణిలో సుందరరామయ్యపై ప్రత్యేక కార్యక్రమం ప్రసారమైంది. ★



నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

# మూలమూలన విముక్తి

**పంట పొలాలలోన తెలవారులు నిద్దుర కాచి, వేకువనే ఇంటికి వచ్చి చద్ది మెతుకులు ఎంగిలి చేసో, చేయకో పశువుల వెంటపడి కాననములకు పోయెడి వాడు కాపుబిడ్డ... వీరికి వేరే ప్రపంచం తెలియదు. అటువంటి వారిపైనా నిజాం ప్రభుత్వం కక్ష బూనింది. ఎందరినో పొట్టన పెట్టుకుంది. గ్రామాల్లో నిశ్శబ్దత, భయానక వాతావరణం ఏర్పడింది. ఏం చేయాలో ప్రజలకు తోచలేదు. ఆంధ్ర మహాసభ గ్రామ కమిటీలు రైతాంగ విప్లవ కమిటీలుగా పనిచేశాయి.**

నిజాం పాలనలో తెలంగాణలోని పల్లెల్లో వెట్టిచాకిరి, అక్రమ పన్నులు, అక్రమంగా భూములు లాక్కోవడం, ధాన్యం వసూళ్లు.. వీటిని కాదన్న వారిపై దౌర్జన్యం, ఎదురు తిరిగితే చంపడం పరిపాటైంది. అయితే ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో చాలా చోట్ల రజాకార్లపై, నిజాం సాయుధ పోలీసులపై తిరుగుబాట్లు జరిగాయి.

1946 ఆగస్ట్‌లో మిర్జా ఇస్మాయిల్ హైదరాబాద్‌కు ప్రధానమంత్రి అయ్యాడు. ఇతడు ప్రజా అనుకూల ప్రధాని అని ఆంధ్రమహాసభ భావించింది. కానీ ఇతడి హయాంలోనే ప్రభుత్వం నిర్బంధాలను తీవ్రతరం చేసింది. ప్రజలు ప్రతిఘటనకు సిద్ధంగా ఉన్నారని తెలిసి ఇతడు మిలటరీని కూడా ఉపయోగించాడు. జనగామ తాలూకాలోని దేవరుప్పల, కామారెడ్డి గూడెం; సూర్యాపేట తాలూకాలో బాలెంల, పాత సూర్యాపేట గ్రామాలు, హుజుర్‌నగర్ తాలూకాలోని మల్లారెడ్డి గూడెం, భువనగిరి తాలూకాలోని పులిగిల్ల గ్రామంలో మిలటరీ కాల్పుల కారణంగా స్థానిక నాయకులు వీరమరణం పొందారు.

బాలెంలపై సాయుధ దాడికి ప్రభుత్వం రిజర్వు దళాలను పంపింది. దళాలు తెల్లవారుఝామున గ్రామంపై దాడి చేసి కాలకృత్యాలకు వెళ్లిన వారిపైన, సోదాల పేరుతో ఇండ్లలో చొరబడి స్త్రీ, పురుషుల పైన దెబ్బల వర్షం కురిపించారు. దాంతో కొందరు యువకులు గార్ల అనంతరెడ్డి, పటేల్ మట్టారెడ్డి నాయకత్వంలో వారిపై తిరగబడి 25 మంది సాయుధ పోలీసులను ఎదిరించగా పోలీసులు వీరిని కాల్చేశారు. దాదాపు ఇదే సమయంలో జనగామ తాలూకాలోని దేవరుప్పల, కామారెడ్డి గూడెం గ్రామాల్లోనూ మిలటరీ బలగాలు దాడులు చేశాయి. స్థానిక కార్యకర్తలను కాల్చివేశారు. ఆ కాల్పుల్లో ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడుతున్న ప్రజానీకాన్ని చూసి మిలటరీ కూడా నిరుత్సాహ పడేస్థితికి వచ్చింది.

దేవరుప్పలపై తెల్లవారి 3 గంటల ప్రాంతంలో దాడిచేసి పురుషులందరినీ అరెస్టు చేశారు. ఈ ఊరు అమరజీవి దొడ్డి కొమరయ్య జన్మస్థలం. ఇక్కడ మందడి సోమిరెడ్డిని, గోలి పాపిరెడ్డిని కాల్చి చంపారు. పక్క గ్రామం కామారెడ్డి గూడెం స్త్రీలు కారపుముంతలు పట్టుకొని గ్రామానికి రక్షణ కవచంలా నిలిచారు. దాంతో మిలటరీ లారీలు ఈ గ్రామంలో చొరబడటానికి ధైర్యం చేయలేదు. కొద్ది సేపటికి ఎలాగోలా గ్రామంలోనికి వచ్చి ఓ 400 మందిని అరెస్టు చేసి తీసుకువెళ్లారు. ఇందుకు నిరసనగా జనగామ, భువనగిరి తాలూకాల నుంచి సుమారు 3000 మంది ప్రజలు ఊరేగింపుగా వచ్చి తమ అసమ్మతిని తెలిపారు. దేవరుప్పల స్త్రీలు వంట చేసి వచ్చిన ప్రజానీకానికి పెట్టారు. అరెస్ట్ అయిన వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు.



బాలెంల, పాత సూర్యాపేట, దేవరుప్పల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని నాయకులు వ్యూహాలు మార్చారు. సైనికులు దాడి చేసినప్పుడు ఎదిరించకుండా జారుకోవాలని ఆదేశించారు. కాని ఆ సందేశం సకాలంలో ప్రజలకు చేరలేదు. దాంతో మల్లారెడ్డి గూడెంలో అప్పిరెడ్డి అమరుడయ్యారు. డిసెంబర్ 29, 1946న మల్లారెడ్డిగూడేన్ని మిలటరీ ముట్టడించింది. ప్రజలు మామూలు పద్ధతిలో దండోరా వేశారు. మార్చిన వ్యూహం వీరికి చేరలేదు. జనం మిద్దెల మీద ఊరు బయట చేరారు. వడిసెలలు విసిరారు. ఊరి చుట్టూ మొక్కజొన్న పొలాలున్నాయి. మిలటరీ ఎంత ఉందో కన్పించడం లేదు. ఉభయ సేనల మధ్య యుద్ధం జరిగింది.



స్వామి రామానంద తీర్థ నవంబర్ 28, 1946న ఓ పత్రికా ప్రకటన చేశారు. 'సూర్యాపేటలో మిలటరీ క్యాంపు వలెనున్నది. మిలటరీ లారీలు జోరుగా తిరుగుతున్నాయి. ఉదయం గ్రామానికి వెళుతున్నాయి. లారీలలో జనాలను ఎక్కించుకుని సాయంత్రం తిరిగి వస్తున్నాయి. నేను బాలెంలా వెళ్లాను. ఒక పోలీసు అధికారి ఇద్దరు రైతులను కాల్చి చంపాడు. దీనిపై బహిరంగ విచారణ జరిపించాలి' అని అన్నారు.

# పోరాటమే!



మిలటరీ అధికారులూ, కలక్టర్ గ్రామస్తులను లొంగి పొమ్మని హెచ్చరించారు. ప్రజలు ఖాతరు చేయలేదు. ప్రజల తరఫున ఒకరిని మధ్యవర్తిగా పంపమని కోరగా అప్పిరెడ్డిని పంపారు. కానీ వారు అప్పిరెడ్డిని, వడిసెలకు రాళ్లు అందిస్తున్న ఓ స్త్రీని కాల్చేశారు. ఈ ఘటనలో అనేకమంది గాయపడ్డారు. మిలటరీ గ్రామం మీద పడింది. చిన్న, పెద్ద, స్త్రీ, పురుష భేదం లేకుండా అందరినీ చిత్రహింసలు పెట్టింది. ప్రజలందరిని ఒకచోట చేర్చారు. ముస్లింలను వదిలేసి 400 మంది హిందువులను తీసుకువెళ్లారు. గ్రామం ఎడారి అయింది. పాడుబడినట్లైంది. మిగిలిన వారిని ఓదార్చేవారు లేరు.

నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో మార్షల్ లా ప్రకటించి సైన్యానికి అప్పగించారు. నిజాం నవాబు మొత్తం సైన్యం 50,000 కాగా దానిలో 20,000 సైన్యాన్ని ఈ జిల్లాలో దింపారు. వారు స్థానిక యువకుల్ని పట్టుకొని నాయకుల జాడ చెప్పాలని నానా యాతనలు పెట్టారు. గోళ్లలో సూదులు గుచ్చారు. స్తంభాలకు జనపనారలతో కట్టేసి పైనుంచి నీళ్లు గుమ్మరించారు. నీళ్లు పడుతూంటే నార బిగుసుకుంటుంది, యాతన పెడుతుంది. అరచేతుల మీద మంచంకోళ్లు పెట్టి మంచం మీద ఎగిరారు. కారం పూసిన కర్రలు ఆసనాల్లో దూర్చారు. నోళ్లలో మూత్రించారు. మంచుగడ్డల మీద పడుకోబెట్టి పై నుంచి నీళ్లు పోశారు. కళ్లల్లో కారం కొట్టారు. అరికాళ్లను కత్తులతో చీరారు. ఇలాంటివి ఇంకా అనేక హింసలు పెట్టారు. అయినా వారు నాయకుల జాడ చెప్పలేదు. స్త్రీలనూ హింసించారు. వారిని దిగంబరంగా తిప్పారు. మానభంగాలు చేశారు. భర్తల ముందు భార్యలను, బావ ముందు మరదలను అమానుషంగా చెరిచారు. ఆ గ్రామాల్లో పర్యటించిన కుమారి పద్మజా నాయుడు ఇలా వ్రాశారు– 'స్త్రీలను మానభంగం చేయడంలో నాజీలను తలతన్నారు. ఒక పదహారేళ్ల అమ్మాయిని మానభంగం చేయబోగా భర్త అడ్డు తగిలాడు. అతని తలకు తుపాకీ పెట్టి, భర్త ముందే భార్యను అమానుషంగా అత్యాచారం చేశారు. ఆ గ్రామాల్లో దోచుకోని ఇల్లు లేదు. అవమానభారంతో క్రుంగని స్త్రీ లేదు. గర్భిణులను, బాలింతలను కూడా హింసించారు. ఇంతకన్నా ఘోరాలు కూడా జరిగాయి' అన్నారు.

స్వామి రామానంద తీర్థ నవంబర్ 28, 1946న ఓ పత్రికా ప్రకటన చేశారు. 'సూర్యాపేట మిలటరీ క్యాంపు వలెనున్నది. మిలటరీ లారీలు జోరుగా తిరుగుతున్నాయి. ఉదయం గ్రామానికి వెళుతున్నాయి. లారీలలో జనాలను ఎక్కించుకుని సాయంత్రం తిరిగి వస్తున్నాయి. నేను బాలెంలా వెళ్లాను. ఒక పోలీసు అధికారి ఇద్దరు రైతులను కాల్చి చంపాడు. దీనిపై బహిరంగ విచారణ జరిపించాలి' అని అన్నారు. అంతేకాదు, 'మేం పాత సూర్యాపేట వెళ్లాం. మాకు ఒక స్త్రీ గుండెలు పగిలిన ఏడ్పులు వినిపించాయి. మేం లోనికి వెళ్లి చూశాం. ఆమె ఎవరో కాదు, అంతకు ముందు పోలీసు కాల్పుల్లో మరణించిన వ్యక్తి భార్య! ఆ గ్రామం నుండి 170 మందిని పోలీసులు తీసుకువెళ్లారు. అనేక మంది స్త్రీ, పురుషులపై గాయాలున్నాయి. ప్రభుత్వం ఈ మిలటరీ చర్యను వెంటనే రద్దు చేయాల'ని రామానంద డిమాండు చేశారు. లేదంటే పరిస్థితులు విషమిస్తాయని కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం తొలగించారు. నిజాం పుత్రుడు ముకర్రం జాహ్ కల్లోలిత ప్రాంతాలను దర్శించాడు. 'ప్రజలు నా బిడ్డలు. వారి బాధలు నా బాధలు' అని బట్టలు పంచిపెట్టాడు. ప్రధాని మిర్జా ఇస్మాయిల్ కల్లోలిత ప్రాంతాల్లో పర్యటించాడు. ఆ సందర్భంలో 'పరుల హింసించు వారలు బాగుపడెదు మాట వట్టిది, నాశనమ్మౌట నిజము' అన్నాడు దాశరథి కృష్ణమాచారి.

ప్రజా చైతన్యజ్వాల దొరలు– పటేల్ – పట్వారీలు, ప్రజాద్రోహులు, గూండాల గుండెల్లో మంటలు రేపింది. పాత సూర్యాపేటలో దొరను, పోలీసు పటేల్‌ను చితకబాదారు. కాళ్లు, చేతులు విరిచేశారు, చందుపట్లలో దొరను బండిలోంచి లాగి బాదారు. కడివెండిలో దోచుకోవడానికి వచ్చిన గూండాలను ఎదిరించి దేహశుద్ధి చేశారు. సీతాపురంలో పోలీసు పటేల్‌ను హతమార్చారు. రామన్నపేటలో దొరను కొట్టి చంపారు. బక్కమంతుని గూడెంలో దొరను, దొర తమ్ముని హతమార్చారు. గ్రామాలు ప్రజల పరమయినాయి. అయినా ఈ అమానుషకాండ 1947 మే చివరి వరకూ కొనసాగింది. ప్రజలు క్రమేణా బలపడి, ప్రజాశత్రువులను ఎదిరించారు. ★




కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు







# జీవితాల్లో 'వెలుగులు'

ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులకు రక్షణ కల్పించడం, వారి ఆదాయాలు రెట్టింపు చేయడమే లక్ష్యంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా 2016లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బీవై)ను ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభమై నేటికి 6 సంవత్సరాలు పూర్తికానున్నాయి. నారుమళ్ల కాలం నుంచి పంటల కోత అనంతర కాలం వరకు రిస్క్ కవరేజీ కల్పించడం ద్వారా ఈ పథకం రైతుల పరిస్థితులు మెరుగు పరిచేందుకు ఎంతగానో దోహదపడుతుంది. ఇప్పటి వరకు 38 కోట్ల మంది రైతులు ఈ పథకంలో నమోద



య్యారు. 11.73 కోట్ల మందికి పైగా రైతులు దరఖాస్తు చేసుకున్న క్లెయిమ్‌లపై రూ. 1.25 లక్షల కోట్లకు పైబడి పరిహారం అందుకున్నారు. ఇదే కాలంలో రైతులు రూ.25,185 కోట్లు ప్రీమియం చెల్లించారు. తాము చెల్లించిన ప్రీమియం ఆధారంగా చేసుకున్న క్లెయిమ్‌లపై 5 రెట్లు పరిహారం (రూ.100 ప్రీమియంపై రూ.493 చెల్లింపు) అందుకున్నారు.

**అన్నదాతలకు ఆపద్బాంధువు పీఎంఎఫ్బీవై**

ఈ పథకం కింద ఏదైనా అనుకోని విపత్తు సంభవించి పంట నష్టం ఏర్పడితే 72 గంటల్లోగా ఫసల్ బీమా యాప్, సిటిజెన్ సర్వీస్ సెంటర్, లేదా సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారికి సమాచారం అందించవచ్చు. కొండచరియలు విరిగి పడడం, పెనుగాలులు, వరదలు, దుర్భిక్షాలు, కుండపోత వర్షాలు, అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో ఇది బీమా కవరేజీ కల్పిస్తుంది.

2020 ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను పునరుజ్జీవింపచేసింది. ఈశాన్య రాష్ట్రాల రైతులకు పంటల బీమాపై గతంలో 50 శాతం పరిహారం అందిస్తుండగా, దాన్ని 90 శాతానికి పెంచారు. రాష్ట్ర ప్రభుత్వాలు 10% సబ్సిడీ చెల్లిస్తున్నాయి. పీఎంఎఫ్బీవై స్వచ్ఛంద ప్రాతిపదికన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందుబాటులో ఉంది. ఇప్పటివరకు 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పీఎంఎఫ్బీవైని ఒక సారి లేదా ఎక్కువ సీజన్లలో అమలు పరిచాయి.

2022-23 ఆర్థిక సంవత్స రంలో అస్సాం, చండీగఢ్, గోవా, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, పుదుచ్చేరి, రాజస్తాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఈ పథకాన్ని నోటిఫై చేశాయి.

**ఇంధన రంగంలో విప్లవం 'ఉజాలా'**

ఇంధనం దేశ పురోగతికి ఎంతో సహాయకారి అవుతుంది. కాబట్టి విద్యుత్‌ను ఆదా చేయడమే లక్ష్యంగా చేపట్టిన మరో అద్భుత పథకం ఉజాలా (అందరికీ సరసమైన ధరల్లో ఎల్ఇడి విద్యుత్ పరికరాల సరఫరా). దీనిని సౌభాగ్య యోజనలో భాగంగా అమలు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనవరి 5, 2015న ఉజాలా పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 37 కోట్ల ఎల్ఇడి బల్బులు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు పంపిణీ చేశారు. తద్వారా ఏడాదికి

సుమారు రూ.20 వేల కోట్లు ఆదా అవుతుందని అంచనా.

దేశానికి హరిత, స్వచ్ఛ భవిష్యత్తును అందించడం కోసం ప్రారంభించిన ప్రపంచంలోనే అతి పెద్ద ఎల్ఇడి బల్బుల పంపిణీ కార్యక్రమమిది. గత 8 సంవత్సరాల కాలంలో సుమారు 37 కోట్ల ఎల్ఇడి బల్బులు, 72 లక్షల ఎల్ఇడి ట్యూబ్ లైట్లు పంపిణీ చేశారు. వీటి వల్ల ఏడాదికి సుమారు 48.39 బిలియన్ కిలోవాట్ అవర్ (కెడబ్ల్యుహెచ్) విద్యుత్ ఆదా అయిందని, 9788 మెగావాట్ల పీక్ డిమాండు తగ్గిందని అంచనా. అంతేకాదు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యావరణ పరిరక్షణకు ప్రతిపాదించిన 'లైఫ్' మంత్రానికి మరింత అర్థం జోడించే విధంగా ఈ పథకం ఏడాదికి 3.93 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ వ్యర్థాలను తగ్గించింది. ఇది సుమారుగా ప్రతి ఏడాది 4.7 మిలియన్ కార్లు వెలువరించే కాలుష్యంతో సమానం.

ప్రపంచంలోనే చౌకైన, అత్యంత పొదుపుతో మెరుగైన వెలుగులు అందిస్తూ వ్యయాలను తగ్గించే పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఏర్పడింది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాని మోదీ ప్రతిపాదించిన ఉజాలా పథకం విజయవంతం అయింది. వార్షికంగా రూ.21 బిలియన్ అమ్మకాలతో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఇడి మార్కెట్‌గా మారింది. ఈ పథకం కారణంగా దేశీయంగా ఎల్ఇడి బల్బుల తయారీ పరిమాణం రూ.1 లక్ష నుంచి రూ.4 కోట్లకు పెరిగింది. మేక్ ఇన్ ఇండియాతో ఎల్ఇడి బల్బుల ధర 90% మేరకు తగ్గింది. ఎల్ఇడి బల్బులు సగటు జీవికి అందుబాటులోకి రావడంతో పాటు తక్కువ విద్యుత్‌తో అధిక వెలుగులు అందిస్తున్నాయి. 2015 నాటికి ఒక్కో ఎల్ఇడి బల్బు ధర రూ.400 ఉంటే 2022 నాటికి రూ.75కే బహిరంగ మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.

# నింపిన పథకాలు!



కూడిన ఈ ఎల్ఇడి విద్యుత్ పరికరాల పంపిణీ కార్యక్రమం ప్రజలకు సుమారు 15% విద్యుత్ బిల్లుల భారం తగ్గించిందని అంచనా. ఫలితంగా ఏడాదికి సుమారు రూ.19,332 కోట్లు ఆదా అయింది. దేశంలో జాతీయ వీధి దీపాల కార్యక్రమం నిర్వహించిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థే ఈ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనికి 'ప్రకాశ్ పథ్' అని పేరు పెట్టారు.

2014-2015 సంవత్సరానికి ముందు కాలం చెల్లిపోయిన బల్బుల వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు భారీగా వచ్చేవి. విద్యుత్ డిమాండు కూడా అధికంగా ఉండేది. దీంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడమే కాకుండా

**విస్తరణకు ప్రణాళికలు**

- ఉజాలా ప్రయోజనాన్ని సామాన్య ప్రజలకు అందించడం కోసం సాధారణ బల్బులు, ఫ్యాన్లు, వీధిదీపాల స్థానంలో స్మార్ట్ ఎల్ఇడి లైట్లు, సమర్థవంతమైన బ్రష్ లెస్ డిసి విద్యుత్ మోటార్ ఫ్యాన్లను ప్రవేశపెడతారు.
- జాతీయ స్థాయిలో విస్తారమైన నెట్‌వర్క్ గల తపాలా శాఖ ద్వారా ఉజాలా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు నోడల్ ఏజెన్సీ ఇఇఎస్ఎల్ తపాలా శాఖతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో అనుకూలమైన రిటైల్ కౌంటర్లు దీని ద్వారా అందుబాటులోకి వస్తాయి.
- ఢిల్లీ-చండీగఢ్ నేషనల్ హైవే 1 వంటి ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో హరిత ఎల్ఇడి బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి ప్రాంతాలను మరింత కాంతిమంతం చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి.

**విజయగాథలెన్నో!**

- 'ఎల్ఇడి బల్బులు బిగించి దాబాను కాంతి మంతం చేయడంతో కస్టమర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది'ని హరియాణాలోని సోనిపట్‌కు చెందిన దాబా యజమాని దేవదత్ శర్మ చెబుతున్నారు. అంతేకాదు, గతంలో నెలకి రూ.45 వేలు ఉన్న విద్యుత్ బిల్లు ఇప్పుడు రూ.15 వేలకి తగ్గిందన్నారు.
- సికింద్రాబాద్‌కు చెందిన మెర్సీ సుసాన్ అనే బాలిక మాట్లాడుతూ 'వెలుగు ఎంత ఎక్కువగా ఉంటే ప్రభావం అంత అధికంగా ఉంటుంది' అంది. ఇప్పుడు తాను ఎల్ఇడి బల్బు కింద నాలుగు గంటల పాటు చదువుకోగలుగుతున్నవని చెబుతోంది. తన భవిష్యత్తుపై ఆమె అమిత ఆశాభావంతో ఉంది.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి

దేశానికి హరిత, స్వచ్ఛ భవిష్యత్తును అందించడం కోసం ప్రారంభించిన ప్రపంచంలోనే అతి పెద్ద ఎల్ఇడి బల్బుల పంపిణీ కార్యక్రమమిది. గత 8 సంవత్సరాల కాలంలో సుమారు 37 కోట్ల ఎల్ఇడి బల్బులు, 72 లక్షల ఎల్ఇడి ట్యూబ్ లైట్లు పంపిణీ చేశారు. వీటి వల్ల ఏడాదికి సుమారు 48.39 బిలియన్ కిలోవాట్ అవర్ (కెడబ్ల్యుహెచ్) విద్యుత్ ఆదా అయిందని, 9788 మెగావాట్ల పీక్ డిమాండు తగ్గిందని అంచనా.

కథ

"నేరుగా హైదరాబాద్ వెళదాం."


"మీ ఇష్టం" అన్నదానికి బహుమానం బుగ్గ గిల్లుడు పైగా "నువ్వు నా చక్కెర బిళ్ల అనే తీపి మిఠాయి, నువ్వు నా ప్రాణం" అనే బ్రహ్మాస్త్రం కూడా! "ఎలా పెట్టింది మీ అమ్మ అంత కరెక్టుగా నీకు పేరు" అనే పొగడ్త కర్పూర దీపారాధన!! ఎక్కువగా ఎండు మిరపకాయలు దిష్టి నిప్పుల్లో వెయ్యడం కూడా ఉంటుంది. ఇంతగా అర్థం చేసుకుని, అనుకూలంగా, తెలివిగా సమయస్ఫూర్తిగా సర్దుకుపోయే గొప్ప... చివరిలో జాణ అనే ఎగతాళి కుళ్లు చూపించేవాడు. జగమొండి అనే వజ్ర కిరీటం కూడా అప్పుడప్పుడు తగిలించే వాడు. అయినా ఎలాంటి భర్తనయినా నీళ్లు చటుక్కున పొంగి పొరిలాయి.

తన దగ్గరే ఉంచుకోవాలని ఎన్నో రకాలుగా శ్రీనాథ్‌కు చెప్పి చూసింది. వాదించింది, కోప్పడింది, అలిగింది. లాభం లేకుండా పోయింది. ఎంత దూరమైనా వెళ్లేటట్లుందని తనే మానేసింది. అర్థం చేసుకోకపోయినా సర్దుకు పోవడం మనస్ఫూర్తిగా మరిచిపోవడం బంధం నిలవాలంటే అవసరం, లేకుంటే ప్రతి పెండ్లి పెటాకులే. వెండి తెరలో చూడని ఊహించని పోరాటాలు మారణ హోమాలు. దేశమంతా ఒంటరి తల్లులు, అనాథ పిల్లల నిలయం అవుతుంది. మరి ఆత్మగౌరవం ఆత్మాభిమానం మాట ఏమిటి? ప్రేమ, బంధం ఉంటే ఇష్టాఇష్టాలు మార్చుకోగలవి, సంస్కారంతో మరిచిపోగలవి. ప్రతి పరిస్థితుల్లోను విసుగు కనిపించనిచ్చేదికాదు. పద్ధతి శుభ్రత ప్రాణం తల్లికి. అవే తెలియవని ఎదురుగానే ఎగతాళిగా మాట్లాడే వాడు భర్త. తను బాధ పడు తుంటే వోదార్చేది. అంత పక్షపాతంగా, భర్త ఉన్నాడే అని బాధవేసినా సర్దుకు పోయేది. కానీ ఇప్పుడు కాదంటే మాత్రం...?

భర్త ఎప్పుడూ తన ఇంటి వాళ్ల మాటలే. "వాళ్లకేమండి, మీ అక్కలు, అన్నలు అక్కడే ఉన్నారు. అందులోనూ సిటీలో ఉన్నారు. ఆరోగ్యం బాగా లేక వస్తే మంచి సదుపాయాలు ఉన్నాయి. అమ్మకే ఏం లేవు. మనం తప్ప." అని ఎప్పుడైనా అంటే ,"మీ అమ్మను ఉన్నది అమ్మేసి పిల్లల మీద వేసి సిటీకి వచ్చి ఉండకూడదా? ఏదైనా జరిగితే ఎవరినైనా

# ధార్మిక

## డాక్టర్ కనుపూరు శ్రీనివాసులు రెడ్డి



సహనంతో అవలీలగా గెలవొచ్చు కానీ ఇతన్ని మాత్రం కాదు అనుకోగానే అసంతృప్తి మేఘం అలా కమ్మి వెళ్లి పోయింది.

కోవిడ్ వలన మూడు సంవత్సరాలు వెళ్లలేక ఒంటరిగా భారత్‌లో ఉన్న తల్లిని చూడలేక తపించి పోయింది ధార్మిక. ఇప్పుడు ఎప్పుడెప్పుడా అని తహతహ లాడిపోతోంది. తల్లి కౌగిలిలోని ఆప్యాయత అనురాగాల వాత్సల్య స్వర్గసీమలో విహరించాలని మనసు ఉరకలు వేస్తోంది. వెళదామంటే కాదు కూడదు అనే మనిషి ఉన్నట్టుండి వొప్పుకున్నాడు భర్త శ్రీనాథ్.

అది తన కోసం కాదు..వాళ్ల నాన్న గారికి కాలులో చీల గుచ్చుకుందని, పదుల సంవత్సరాల నుంచి వున్న తల్లి కాళ్ల నొప్పులు ఎక్కువయ్యాయని పరుగులు పెట్టిస్తున్నాడు.

మా అమ్మకు ఈ మధ్య గుండెల్లో నొప్పి వస్తుంది అంటే..,"అదేమి ఉండదు. చిన్నపాప పుట్టినప్పుడు వచ్చింది కదా! ఫిట్టుగా సన్నజాజి మొక్కలా ఉంది మీ అమ్మ" అత్తగారు సన్నగా చలాకీగా ఉంటారని చతురోక్తి విసరడం అలవాటు అల్లుడు శ్రీనాథ్‌కు. తోబుట్టువులు ఎవ్వరూ లేక జీవితమే కూతురు మనమరాళ్లు అని నమ్మి చివరి రోజులు గడుపుతున్న తల్లిని తలుచుకోగానే గుండె పిండినట్లయ్యి కళ్లల్లో మాటను చేతను వ్యక్తిత్వానికి ఆపాదించి జీవితాన్ని పూడ్చలేని అగడ్తలమయం చేసుకోకూడదు. ఛీ.. ఏవిటిది? ఇప్పుడెందుకు ఇవన్నీ ఆలోచిస్తున్నాను అనుకొని తల విదిలించుకుంది ధార్మిక.

కోవిడ్ సమయంలో తల్లి గురించి ఎంత భయపడిపోయిందో! రోజూ ఫోను చేసేది. పిల్లలతో మాట్లాడించేది, వీడియో కాల్లో చూపించేది. దగ్గు జలుబు, జ్వరం ఉంటే అశ్రద్ధ చెయ్యొద్దని చెప్పేది. తల్లి తనను గురించి పిల్లలను గురించి 'జాగర్త జాగర్త' అని పదే పదే చెప్పేది. తనకు ఎంత బాగాలేక పోయినా చెప్పేది కాదు. "ఎట్లా ఉంది మీ అమ్మ" అని ఒక్క మాట పొరపాటున కూడా అడగడు. అదొక తత్వం అని తను మరోలా ఆలోచించేది కాదు. ఈసారి ఎక్కువ రోజులు... జరగదు... కనీసం నాలుగు రోజులయినా ఖచ్చితంగా ఉండాలి.

చిన్నపాప, పెద్దపాప పుట్టినప్పుడు తన తల్లే వచ్చి ఎంతో సహాయంగా ఉంది. ఆమె చేసే వంటలు తిని మెచ్చుకుని, అది చెయ్యండి, ఇది ఇలా చేస్తే అని ఆర్డర్లు పాస్ చేసి మరీ చేయించుకుని తిని అమృతహస్తం అని పొగడి పారేసేవాడు. వాళ్ల అమ్మానాన్నలు పెద్ద పాప పుట్టినప్పుడు వస్తే ఆర్డర్లు వేస్తున్నా నవ్వుకుంటూ బండ చాకిరీ చేసి, బిడ్డకోసం రాత్రంతా మేలుకుని, తనను చూసుకుంటూ ఎలాంటి నర్సునో, కేర్ టేకర్నో పెట్టిద్దాం'' అనే వక్రపు సలహాలిచ్చి దిక్కులేని దాన్ని చేసే వాడు. "మనం ఉన్నాం" అనే మాట వచ్చేది కాదు.

"ఇంకా కాలేదా? చేస్తూనే ఉంటావు రోజులు తరబడి" అంటూ సూటు కేసులన్నీ జిప్పులు వేసి అలిసి పోయి నట్లు చూసాడు.

''ఏవండి! అమ్మకు కాల్షియం, విటమిన్స్, డ్రైఫ్రూట్స్ తీసుకెళ్లాలండీ. కాస్కోకు వెళదాం."

"మొన్ననే వెళ్లొచ్చాం కదా! మీ అత్త మామలకు, అన్నా ఆడ బిడ్డలకు, అన్నీ కొన్నాము కదా! బోలెడు పని ఉంది. ఇప్పుడు కాదు."

అందులో మా అమ్మను చేర్చలేదండి అనబోయి, ''అవన్నీ హైదరాబాద్‌లో దొరకవని మీరు కొన్నవండి.

అడిగితే, దీనికే బోలెడు అయిపోయింది. మళ్లీ వస్తాముర! లేటు అయిపోయింది' అని తొందర చేసి తీసుకొచ్చేసారు" తనకు తెలుసు ఇప్పుడు హైదరాబాద్‌లో విదేశాలలో దొరకేవీ అన్నీ దొరుకుతాయి. బస్తాలకు కొన్నాడు చెత్తా చెదారం. నోరు మెదప లేదు ధార్మిక.

అతను గిల్లిన బుగ్గ ఇప్పుడు మంట అనిపించింది. నొప్పికూడా ఉంది. అద్దం దగ్గరకు వెళ్లి చూసుకుంది. ఎర్రగా కమిలి గాటు పడి ఉంది. అబ్బ ఇంత గట్టిగా గిల్లాడా? కసితో చేసినట్లుంది ప్రేమతోకాదు అని నిర్ణయానికి వచ్చింది. ఊ.. మచ్చ మాసిపోతుంది నొప్పి తగ్గి పోతుంది. మనసుకు కష్టం, ఇష్టం కలిగినప్పుడు దాచుకోనున్న హృదయం, అది చేస్తున్నారా. నువ్వు సరిగ్గా చూసుకుంటున్నావా అని "

"చూద్దాం. అక్కడకు వెళ్ళిన తరువాత ఆలోచిస్తాము. కోవిడ్ ఇంకా ఆ ప్రాంతంలో ఉందో లేదో తెలుసుకోవాలికదా! అందునా పిల్లలు..?"

ధార్మిక ముఖంలో కలిగిన మార్పును చూసి," పోనీ నువ్వొక్కదానివే వెళ్లిరా" అన్నాడు.

"రమ్మన్నదే మిమ్మల్ని, మనమరాళ్లను చూడడానికి. నా కోసం కాదు.' అసంతృప్తిని చూపించింది.


"ఆహా! నువ్వు తపిస్తున్నావుకదా!"

వచ్చిన కోపాన్ని అణచుకుంటూ ," తల్లి అండీ. తన పెగుతెంపి నాకు ప్రాణం పోసింది "అంది ధార్మిక.

"మీకు బోధ చెయ్యలేను. బుద్ధిజం తీసుకోండి తెలుస్తుంది. నిర్యాణం అంటే నేను మీకు భార్యనైనాను కదా అదీ... రాత.. విధి!!" చావు అనలేక పోయింది. "నిర్వాణం అంటే రాగ, ద్వేష మోహాలు అధిగమించి పరమపథం చేరేది, పరిపూర్ణ ఆనంద స్థితి. అదే మోక్షం, అదే అంతిమ సంస్కారం మానవులకు. తల్లిని చూడాలంటే ఇన్ని అడ్డ ప్రశ్నలు వేస్తున్న మీకు దక్కనివి."

"అంటే నన్ను చంపి మోక్షప్రాప్తి కలిగిస్తావా?"

"మా ఇంటిలో అడుగు పెడితే ఇప్పుడు మీకున్న 'నా ' అనే అహంకారం , పక్షపాతం అనే అజ్ఞానం నశించి 'మనం' అనే జ్ఞానోదయం కలిగి మోక్షాన్ని మీకు కలగ చెయ్యాలని, నేను తరించాలని."




జ్ఞాపకం చేసి ప్రతీకారం తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కానీ మన అనుకునే మన్నింపు, పోనీలేస్తూ అనే క్షమాగుణం, చిటికెడు ఓర్పు చాలు నూరేళ్ల సుఖసంతోషాల అన్యోన్య దాంపత్యానికి! ఇది సత్యం, తన నమ్మకం అనుకున్నది ధార్మిక.

"రెండు రోజులు తరువాత వస్తాం అని చెప్పనా? ఇప్పటికి పదిసార్లు అడిగింది అల్లుడుగారు ఎలాగున్నారు? సరిగ్గా భోజనం

"నిర్వాణం చెందడానికి దర్శించుకుంటున్నావా?" అని ఎగతాళిగా అన్నాడు.

అర్థం కూడా తెలియదు ఇతనికి అనుకుంటూ," అవును!! నిర్వాణం కాదు తల్లి ఒడిలో నిర్యాణం చెందడానికి మిమ్మల్ని తీసుకు వెళుతున్నాను. అలా గయినా మీకు అహంకారం నశించి మోక్షప్రాప్తి కలిగిం చాలని." అంది.

"అంత దుర్మార్గుడ్నా నేను. నిర్యాణంకి నిర్వాణానికి అర్థం ఏవిటో ?" అని కోపం తెచ్చుకున్నాడు తన తెలివి తక్కువతనాన్ని కప్పి పుచ్చుకోవడానికి.

"ఏం మాట్లాడుతున్నావు నువ్వు. నేను ఆమె కాళ్లకు నమస్కారం చెయ్యాలా ? ఎవరనుకున్నావు నన్ను? మా వంశం ఎలాంటిదనుకున్నావు."

"అందుకే కదా తెలియక నన్ను ఇచ్చింది."

కోపంతో ఉడికి పోయాడు శ్రీనాథ్. "ఏం మరీ తెగించేసావు. వదిలేస్తావా?"

"తల్లిని తండ్రిని చూడాలంటే ఆంక్షలు పెట్టిన అర్ధనారీశ్వరుని దగ్గర జగన్మాత కూడా ఉండ లేదు."

"అందుకే కదా తగలబడి బూడిదయ్యింది."

"బూడిదయ్యి విశ్వమాతగా వెలిసింది. శివుని అధినాయక అయ్యింది." నిర్మొహమాటంగా అంది.

ఏం మాట్లాడాలో తెలియక కోపంతో ," చాల్లే ! నేర్చావు. మనం వెళ్లేది నాలుగు రోజులు మన వాళ్లతో గడిపి రావడానికి. దేశమంతా తిరిగి రావడానికి కాదు."

"అందులో మా అమ్మ లేదా?"

"ఎదిరించకు.అమ్మ శిక్షణ!! నేను ఆలోచించి ఉన్నాను. నువ్వు అడ్డ ప్రశ్నలు వెయ్యకు. ఆ పల్లెలకి పిల్లలు వద్దు. వీలుంటే ఆమెను ఇక్కడికే తీసుకురా! మొండి అవతారాలు ఎత్తకు" చాలా చిరాగ్గా అన్నాడు.

"ఎందుకు? మీరు అంటరాని దానిగా పెట్ట డానికా? ఇలాగయితే నేను ఇండియాకే రాను. వెళ్లి మీ స్నేహితులతో, మీ కొంపలోని బడుద్దాయిల గుంపుతో తాగి తందనాలాడండి" అని వస్తున్న కోపాన్ని, బాధను అణుచుకోలేక సర్దుతున్న సూటుకేసులు అక్కడ వదిలేసి లోపలి వెళ్లిపోయింది ధార్మిక.

"పిల్లల్ని వదిలేసి రెండు రోజులు పొమ్మన్నాను కదా! వాళ్లకేం తోస్తుంది" వాళ్లను చూపించాలని, అంతులేని ఆత్మవిశ్వాసం, ప్రశాంతత దొరికే అమ్మ ఒడిలో తను వొదిగి పోవాలని వెళుతుంది. తోచక పోవడం ఏవిటి? ఒప్పలేని తనం, మొగుడు అనే దర్పం గాకపోతే! ఇంటి చుట్టూ సాయంత్రం, ఉదయం పక్షులు వినిపించే మధుర సంగీతం చాలు వాళ్లను వాళ్లు మరిచి పోవడానికి. గింజలేస్తే పరుగెత్తుకు వచ్చే కోళ్లు, పావురాళ్లు చాలు పది కాలాలు మదిలో మధుర తలపులు నిలపడానికి. ఉదయం కాబోతుంది అని తట్టి లేపే కోడికూత చాలు మనసు మురిసి పోవడానికి. ఆవుపాలు పితుకుతూ ఉంటే మైమరచి చూస్తూ "ఎలావస్తా యమ్మా అన్నీ మన తీసుకుంటే పాపం తన బిడ్డకో" అని అడిగే అమాయక ప్రశ్నలు చాలు కోటిజన్మలు గుర్తుంచు కోవడానికి. పాలు తాగి గంతులు వేస్తూ పరుగులు తీసే బుజ్జాయిలను పట్టుకోవడానికి వెంటపడే చిలిపి పంతాలు చాలు పదిల పరచడానికి మధురస్మృతుల నిఘంటువుగా!

రణగొణ ధ్వనులతో బయలుదేరినా ఇద్దరూ సర్దుకున్నారు. వారం రోజులు వాళ్లు వీళ్లు రావడం, తను తెచ్చినవి ఇవ్వడం. "ఓస్ ఇవా! మావాడు నాలుగు సంవత్సరాల క్రితమే ఇక్కడే కొన్నాడు" అని ముఖం మీద అనడం, ముడుచుకు పోవడం గమని స్తూనే ఉంది ధార్మిక.

రెండు వారాలకనే వచ్చారు. వారం అయిపోయి రెండో వారం గడిచి పోతోంది. రెండు మూడుసార్లు జ్ఞాపకం చేసింది. పోదాం పోదాం.. వాళ్లు వస్తానన్నారు.. వీళ్లు రావాలి అనే జవాబుకు కోపం ఆత్రుత ఎక్కువ అయిపోతున్నా "తీసుకొని వెళతాడులే" అనే ఆశతో అణుచుకొని ఉండింది. పిల్లలు మరీ అడగటం మొదలు పెట్టారు. ఇక లాభం లేదని తెగించింది. ఇప్పుడు అసలు జవాబే లేదు. ఒక్క చూపు చూసి వదిలేస్తున్నాడు.

"మీరు వచ్చినా రాకపోయినా మేము వెళు తున్నాం.' అని బట్టలు సర్ది తయారయింది. గుర్రుగా చూస్తున్న భర్తను పట్టించుకోలేదు ధార్మిక.



"చెప్పేది ఎందుకు అర్థం చేసుకోవు? అక్కడంతా కోవిడ్ ఇంకా ఉందంట. అందులోనూ విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయంట. రెండు రోజుల్లో బయలు దేరబోతూ కొని తెచ్చుకోవడం అవసరమా? నీకేమయినా వస్తే తట్టుకోలేవు. పోగానే పని...?" వద్దని చెప్పక ఇదొక వక్రపు ప్రేమ. ఇంత అక్కర ఎప్పుడూ చూపించలేదు.

"చెప్పేది ఎందుకు అర్థం చేసుకోవు? అక్కడంతా కోవిడ్ ఇంకా ఉందంట. అందులోనూ విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయంట. రెండు రోజుల్లో బయలు దేరబోతూ కొని తెచ్చుకోవడం అవసరమా? నీకేమ యినా వస్తే తట్టుకోలేవు. పోగానే పని...?" వద్దని చెప్పక ఇదొక వక్రపు ప్రేమ. ఇంత అక్కర ఎప్పుడూ చూపించలేదు.

"లేదు. నేను కనుక్కున్నాను. అక్కడ అలాంటివి ఏం లేవంట. ఇక్కడే ఇంటి చుట్టూ?"

"అంటే నేను అబద్ధం చెపుతున్నానా? నా బిడ్డల ప్రాణాలకు పరీక్ష పెట్టలేను."

"కన్నదాన్ని నేను! ప్రశ్నపత్రం నేనే రాస్తానులే!"

"మాటకు మాట చెపుతావా? వెళ్లడానికి లేదు.' అంటూ ప్యాక్ చేసిన వస్తువులన్నీ లోపలికి విసిరేసాడు.

కోపం, బాధ ఒక్కసారిగా పెల్లుబికాయి. తట్టు కోలేని అసంతృప్తితో కన్నీళ్లు పొంగుకొచ్చాయి. అప్పటికీ అదుపు చేసుకుంటూ, "తల్లి అండి! ఎదురు చూస్తూ ఉంది. ఇంత దూరం వచ్చి...? బాధపెడితే పుట్టగతులుండవు. ఎంత సంతోష పడుతుందో ! పిల్లల కోరిక తీరినట్లు ఉంటుంది."

"ఏం శపిస్తుందా?"

"మరీ తెగించినట్లు మాట్లాడుతున్నారండి. దయ చేసి మీరూ రండి. రెండు రోజులుండి వచ్చేస్తాము."

"ఇంత దూరం వచ్చిన తరువాత నన్ను కాదని వెళ్లావంటే తిరిగి రానవసరం లేదు."

మాట్లాడలేక అతని మూర్ఖత్వానికి అసహ్యించు కుంటూ, తన అశక్తతకు కుమిలి పోతూ చాలా సేపు ఆలోచిస్తూ తనను తాను అదుపు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండిపోయింది. మళ్లీ ఇక్కడకు రాలేము, ఇంత కర్కోటకంగా తల్లిని చూడకూడదు అనే దుర్మార్గపు మనస్తత్వమేమిటి? ఇంత ఆదర్శవ ంతుడి కోసం నా తల్లి మనసు, పిల్లల తీపి జ్ఞాపకాలు, నా తల్లి ఒడిలోని స్వర్గాన్ని, జన్మకు విముక్తిని, వదులు కోవాలా? తన నిర్యాణం-విధి రాసిపెట్టింది అదే అయితే నా జన్మకు నిర్వాణం - చావుకు పుట్టుకకు సార్థకత మోక్షం అదే!! అమ్మ ఒడికంటే మిన్న ఏముంది? అల్లకల్లోలంగా కదిలిపోతున్న మనసును, స్థిమిత పరుచుకుని గట్టి నిర్ణయానికి వచ్చింది.

"బిడ్డల్ని తీసుకుని నేను వెళుతున్నాను." విసు రుగా ఒక చూపు చూసి బిడ్డల చేతుల్ని పట్టుకుంది.

అడ్డువచ్చే, దెబ్బతిన్న అహంభావాన్ని తృప్తి పరచలేక, రగిలి పోతూ," నా బిడ్డల్ని తీసుకు పోవ డానికి వీల్లేదు." అన్నాడు కసిగా అసహ్యంగా చూస్తూ.

"నువ్వు మోసావా- కన్నావా- పెంచావా?" అదుపు చేసుకోలేక అరిచేసింది ధార్మిక.

"తిరిగి రాలేవు."

"ఆ మాట నేను అనలేదే! మిమ్మల్నీ రమ్మం టున్నాను."

సమాధానం తెలియక, "ఎంత పొగరు' అంటూ చేయి పైకెత్తాడు.

"మర్యాదగా ఉండదు." అని ఒక్క చూపు చూసి నిమిషం కూడా నిలవక కారెక్కింది ధార్మిక.

ఆ చూపులోని తీక్షణతకు, దృఢ నిశ్చయానికి భయపడిపోయి నిలిచిపోయాడు శ్రీనాథ్. భర్తను బాధపెట్టానే అని మనసు విలవిలలాడింది. కానీ తల్లిని సంతోష పెట్టకపోతే తన జన్మకు అర్థం లేదు.

"నాస్తి మాతృ సమా ఛాయా; నాస్తి మాతృ సమాగతిః; నాస్తి మాతృ సమం త్రాణం నాస్తి మాతృ సమప్రియా!!"

"జీవితాన్ని ప్రసాదించిన తల్లిని మించిన దైవం లేదు. కష్టాలలో తల్లిని మించిన నీడ లేదు. తల్లిని మించిన గురువు లేదు. తల్లిని మించిన క్షమా హృదయం లేధు" అనే స్కంద పురాణంలోని శ్లోకం ముందు నిలిచి, మనసును స్థిమిత పరుచుకుని పిల్లల్ని ఒడిలో దాచుకుంది. ★

2023-ఐసీసీ (8వ) మహిళా టీ-20 ప్రపంచ కప్‌కు దక్షిణాఫ్రికాలో రంగం సిద్ధమైంది. గత టోర్నీ రన్నరప్ భారత్ ఈ సారైనా టైటిల్ సాధించాలన్న పట్టుదలతో పోటీకి దిగుతోంది. ఫిబ్రవరి 10 నుంచి 26 వరకూ కేప్ టౌన్, పార్ల్, గెబ్రెతా వేదికలుగా జరిగే ఈ టోర్నీలో పది అత్యుత్తమ జట్లు ఢీకొనబోతున్నాయి.



# అందరి చూపు అటు వైపే!

2009 నుంచి 2020 వరకూ జరిగిన మొదటి ఏడు ప్రపంచ కప్ టోర్నీలలో ఐదుసార్లు విజేతగా నిలిచిన ప్రపంచ నంబర్ వన్ జట్టు ఆస్ట్రేలియా మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలో నిలిచింది. 2010, 2012, 2014, 2018, 2020 ప్రపంచ కప్ టోర్నీలలో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా మహిళా టీ-20 ప్రపంచ కప్‌కే మరో పేరుగా నిలిచింది. 2009లో ఇంగ్లండ్, 2016లో వెస్టిండీస్ జట్లు విశ్వవిజేతలుగా నిలిస్తే 2009, 2010 టోర్నీలలో న్యూజిలాండ్, 2020 ప్రపంచ కప్‌లో భారత్ రన్నరప్ స్థానాలతో సరిపెట్టుకొన్నాయి.

గత టోర్నీ ఫైనలిస్ట్ భారత్ తొలి టైటిల్ కోసం తహతహలాడుతోంది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వం లోని భారత జట్టులో స్మృతి మంధానా, షెఫాలీవర్మ, జెమీమా రోడ్రిగేజ్ లాంటి పలువురు ప్రతిభా వంతులైన బ్యాటర్లున్నారు. గత ఏడు ప్రపంచ కప్ టోర్నీలలో భారత్ మూడుసార్లు సెమీఫైనల్స్ (2009, 2010, 2016), ఓసారి (2020) ఫైనల్స్‌కు అర్హత సంపాదించగలిగింది. మాజీ చాంపియన్లు ఇంగ్లండ్, వెస్టిండీస్‌తో పాటు న్యూజిలాండ్ సైతం అత్యంత ప్రమాదకరమైన ప్రత్యర్థిగా కనిపిస్తోంది. ఆతిథ్య దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక ఐర్లాండ్ జట్లు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటు న్నాయి.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

## గ్రూపు-బీలో భారత్ పోటీ..

టోర్నీలో తలపడుతున్న మొత్తం 10 జట్లను రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ పోటీలు నిర్వహిస్తారు. గ్రూపు-ఏలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఆతిథ్య దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు తలపడుతుంటే, గ్రూప్-బీలో భారత్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఐర్లాండ్, ఇంగ్లండ్ జట్లు ఢీ కొంటున్నాయి. మొత్తం 10 జట్లలో ర్యాంకింగ్స్ ఆధారంగా మొదటి ఏడు (ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్తాన్) జట్లు నేరుగా టోర్నీలో పాల్గొంటున్నాయి. ఆతిథ్య దేశం హోదాలో దక్షిణాఫ్రికా 8వ జట్టుగా నిలిచింది. మిగిలిన రెండు బెర్త్‌ల కోసం నిర్వహించిన క్వాలిఫైయింగ్ టోర్నీలో ఐదు ఖండాలకు చెందిన మొత్తం 37 జట్లు తలపడ్డాయి. గత టోర్నీలో పాల్గొన్న థాయ్‌లాండ్ స్థానంలో ఐర్లాండ్ తొలిసారిగా ప్రపంచకప్ బెర్త్ సంపాదించింది. ఫిబ్రవరి 12న గ్రూప్-బీ లీగ్‌లో భారత్ తన తొలి పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో పోటీ పడుతుంది. ఫిబ్రవరి 15న వెస్టిండీస్, 18న ఇంగ్లండ్, 20న ఐర్లాండ్ జట్లతో భారత్ తలపడనుంది. గ్రూపు లీగ్‌లో మొదటి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ నాకౌట్ రౌండ్లో ఢీ కొంటాయి. ఫిబ్రవరి 23న తొలి సెమీఫైనల్స్, 24న రెండో సెమీఫైనల్స్, 26న టైటిల్ సమరం నిర్వహిస్తారు. మూడు నాకౌట్ మ్యాచ్‌లను కేప్‌టౌన్‌లోని న్యూల్యాండ్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.

పురుషులతో సమానంగా మ్యాచ్ ఫీజులు అందు కొంటున్న మహిళలు ఆడే మ్యాచ్‌ల్లో బౌండ్రీల నిడివి చాలా తక్కువగా ఉండటం చర్చనీయాశంగా మారింది. మిగిలిన క్రీడల్లో లేని మినహాయింపు క్రికెట్లోనే ఎందుకు అని ప్రశ్నించేవారు లేకపోలేదు. పురుషుల మ్యాచ్‌ల్లో 70 నుంచి 80 మీటర్ల బౌండ్రీ లైన్లు ఉంటే.. మహిళలకు కేవలం 50 నుంచి 50 మీటర్లతో మ్యాచ్‌లు నిర్వహించడం చర్చనీయాం శంగా మారింది. మహిళా ప్రపంచ కప్‌లో 20 ఓవర్లలో ఓ జట్టు సాధించిన అత్యధిక స్కోరు 3 వికెట్లకు 195 (దక్షిణాఫ్రికా) పరుగులు కాగా.. అత్యల్ప స్కోరు 14.4 ఓవర్లలో 46 పరుగులకు ఆలౌట్ (బంగ్లాదేశ్)గా రికార్డులు ఉన్నాయి. అత్యధిక వ్యక్తిగత స్కోరు ఆస్ట్రేలియా కెప్టెన్ మెగ్‌లానింగ్ (65 బంతుల్లో 126 పరుగులు) పేరుతో ఉంది. టీ-20 ప్రపంచ కప్‌లో శతకం బాదిన భారత ఏకైక బ్యాటర్ హర్మన్ ప్రీత్ కౌర్ (2018 ప్రపంచ కప్) మాత్రమే.

## భారీగా పెరిగిన ప్రైజ్ మనీ

2018 ప్రపంచ కప్‌తో పోల్చితే, ప్రస్తుత ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టుకు భారీ మొత్తం ప్రైజ్ మనీ అందచేయనున్నారు. 320 శాతం అధికంగా ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు నిర్వాహక సంఘం ప్రకటించింది. స్పాన్సర్ల నుంచి వచ్చే ఆదాయం గణనీయంగా పెరగడంతో ప్రైజ్ మనీని 26 లక్షల డాలర్లకు పెంచారు. విశ్వవిజేతగా నిలిచిన జట్టుకు 10 లక్షల డాలర్లతో పాటు ట్రోఫీని బహుకరిస్తారు. రన్నరప్‌గా నిలిచిన జట్టు 5 లక్షల డాలర్లు నజరానాగా అందుకోనుంది. టోర్నీలో తలపడుతున్న మొత్తం 10 జట్లకూ గ్యారెంటీ మనీ చెల్లించనున్నారు. ఐసీసీ వందల కోట్ల రూపాయలు వ్యయం చేస్తూ మహిళా క్రికెట్‌ను ప్రోత్సహిస్తూ వస్తోంది. అయితే ప్రమాణాలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటున్నాయి. ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లకు మరో పేరైన దక్షిణాఫ్రికా వేదికగా రెండున్నర వారాల పాటు సాగే ఈ టోర్నీ మెరుగైన ప్రమాణాలతో, సరికొత్త రికార్డుతో ముగియాలని, హర్మన్ ప్రీత్‌కౌర్ నాయకత్వంలోని భారత జట్టు విశ్వవిజేతగా తిరిగి రావాలని కోరుకుందాం! ★

# 'కుష్ఠు' నివారణ కష్టతరం కాదు



ప్రపంచవ్యాప్తంగా మానవాళిని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో 'కుష్ఠు' వ్యాధి ఒకటి. ఇది ఈనాటి సమస్య కాదు. దీనికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఏటా జనవరి నెలాఖరులో వచ్చే ఆదివారాన్ని కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవంగా అంతర్జాతీయ సమాజం పాటి స్తోంది. ఈ కోణంలో ఈ ఏడాది జనవరి 29వ తేదీని కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవంగా జరుపు కోనున్నారు. అయితే భారత్‌లో జనవరి 30న ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు ప్రత్యేక కారణం ఉంది. ఇది మహాత్మగాంధీ వర్ధంతి బాపూజీ జీవి తాంతం ఈ వ్యాధి బాధితుల సంక్షేమానికి పాటు పడ్డారు. వారిని అక్కున చేర్చుకున్నారు. అందువల్ల జనవరి 30ని ఏటా కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవంగా మనం జరుపుకుంటున్నాం. 1954 నుంచి ఏటా అంత ర్జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్స వాన్ని నిర్వహి స్తున్నారు. 'వ్యాధి నివారణకు సత్వరం చర్యలు తీసు కోండి. దీనిని అంతం చేయండి' అనే ఇతివృత్తంగా ఈ సంవత్సరం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

వాస్తవానికి కుష్ఠు అందరూ అపోహ పడినట్లు అంతం కాని వ్యాధి ఎంతమాత్రం కానేకాదు. సంపూ ర్ణంగా నివారించదగ్గ వ్యాధి. కొన్ని కనీస జాగ్రత్తలతో దీనిని రూపుమాపవచ్చు. ఈ విషయాన్ని తెలియ జేయడం, అవగాహన కల్పించడం అంతర్జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం అసలు ఉద్దేశం. కుష్ఠు... అనేది ఒక బ్యాక్టీరియా ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది సాధారణంగా పాదాలు, చేతులు, ముఖం, నరాలు, శ్వాసకోశం, చర్మం, కళ్లను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధిని 'హాన్సెస్' అని కూడా పిలుస్తారు. కుష్ఠువ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియాను గుర్తించడంలో పేరు గాంచిన నార్వే వైద్యుడు గెర్హార్ హెన్రిక్ అర్మోర్ హాన్సెస్ పేరును దీనికి పెట్టారు. వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తు న్నాయి.

ఈ వ్యాధి దాదాపు 120 దేశాల్లో విస్తరించి ఉంది. అమెరికా వంటి దేశాల్లో తక్కువే. భారత్, బంగ్లాదేశ్, బ్రెజిల్, ఇండోనేసియాల్లో ఎక్కువగా ఉంది. ఏటా సుమారు రెండు లక్షల కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా వెనకబడిన వర్గాలపైనే ఉంది. రోజూ దాదాపు 600 మంది వ్యక్తులు దీనితో బాధపడుతున్నారు. 2020 నాటి ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా కొత్త కేసులు భారీగా నమోదవు తున్నాయి. ఇందులో 15ఏళ్లలోపు పిల్లలు కూడా ఉన్నారు.

మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ)అని పిలిచే యాంటీ బయోటిక్స్ కలయికతో దీనిని నివారించవచ్చు. ఈ చికిత్స ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందు బాటులో ఉంది. బీసీజీ టీకా తీసుకోవడం వల్ల వ్యాధి నుంచి 50 శాతం రక్షణ లభిస్తుంది. వ్యాధి సత్వర గుర్తింపు, చికిత్స ద్వారా మంచి ఫలితం ఉంటుంది. పరిశుభ్రమైన వాతావరణం, గోరువెచ్చని నీరు తాగడం, ఏ,సీ,డీ,ఈ, బీ 12 విటమిన్లు, జింక్, మెగ్నీషియం, సెలీనియం వంటి ఖనిజాలు, పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలను పొందవచ్చు. ఈ వ్యాధి నివారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉచితంగా సేవలందిస్తోంది. అయితే ఎంతో మందికి సరైన అవగాహన లేక ఈ సంస్థ సేవలను ఇప్పటికీ పొందలేకపోతున్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తులు వివక్షకు గురవుతారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించగానే తక్షణం సమీప ప్రభుత్వ డిస్పెన్సరీని సందర్శించాలి. అక్కడ చికిత్స ఉచితంగా లభిస్తుంది. చికిత్స కాలం ఆరు నెలల నుంచి ఏడాది లేదా అంతకంటే ఒకింత ఎక్కువకాలం ఉంటుంది. నేషనల్ లెప్రసీ నియంత్రణ కార్యక్రమాన్ని 1955లో కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. 1982లో మల్టీ డ్రగ్ థెరపీని ప్రవేశపెట్టారు. 1983లో దీనిని జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంగా మార్చారు. క్రమం తప్పకుండా మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చు. వైకల్యాలను నివారించ వచ్చు. ఇతరులకు విస్తరణను నివారించవచ్చు. అందరూ అపోహ పడుతున్నట్లుగా ఇది వంశపార పర్యంగా వచ్చే వ్యాధి కాదు. తల్లిదండ్రుల నుంచి పిల్లలకు గాని, గర్భధారణ సమయంలో తల్లి నుంచి బిడ్డకు గాని సంక్రమించదు. లైంగిక సంపర్కం ద్వారా కూడా వ్యాపించదు. వ్యాధి ఉన్న వారితో కరచాలనం చేయడం, కలసి ఆడుకోవడం, ఒకే కార్యాలయంలో కలసి పనిచేయడం, స్పర్శ ద్వారానూ వ్యాపించదు. వ్యాధిబారిన పడినవారికి జీవనోపాధి పొందే, గౌరవంగా జీవించే హక్కు ఉంది. మన దేశంలో వ్యాధి ప్రాబల్యం పదివేల జనాభాకు 0.4గా ఉంది. వాస్తవాలు ఇలా ఉన్నప్పటికీ సమారు రెండు లక్ష మంది ప్రజలు లెప్రసీ కాలనీలు, దాదాపు 76 పునరావాస కేంద్రాల్లో నివసించడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవలసిన విషయం.

అంతరించి పోతుందనుకున్న ఈ వ్యాధి తెలంగాణలో విస్తరిస్తుండటం ఆందోళన కలిగి స్తోంది. ఏటా కేసులు అధికమవుతున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల, మెదక్, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంది.

2016–17లో చాలా మంది అనుమానితులను గుర్తించారు. వ్యాధిని నివారించే లక్ష్యంతో నేషనల్ లెప్రసీ ప్రోగ్రాం కింద లెప్రసీ కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. అయితే వ్యాధి క్రమంగా తగ్గుతుందన్న ఉద్దేశంతో 2006లో వీటిని తొలగించారు. సిబ్బందిని వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేశారు. రోగులకు గుర్తించిన చోట ప్రస్తుతం చికిత్స కొనసాగిస్తున్నారు. వ్యాధి గుర్తింపు, చికిత్సలో అలసత్వం ఎంతమాత్రం పనికిరాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా ముందుకు సాగాలి. నిధుల కొరత రానీయరాదు. అన్నింటికన్నా బాధితులకు అవగాహన కల్పించడం అత్యవసరం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# రాతి గుండె తడిని పట్టిచ్చే కథలు

ఇదివరకు వివిధ పత్రికలలో ముద్రితమైన తమ కథలను కథాసంపుటిగా రచయిత దొండపాటి కృష్ణ రూపొందించారు. ముప్పై అయిదు సంవత్సరాల వయసులోనే యాభై కథలకు పైగా వెలుగు చూచినట్టుగా, స్వయంగా రచయిత (స్వగతం) "తనలో తాను, తనకు తాను"గా చెప్పడం ఒక విశేషం! వాటిలో నుంచి పదహారు కళాఖండాలను ఏర్చికూర్చి పైశీర్షికతో ప్రకటించారు. కథ సామాజిక ప్రయోజనం కలిగించేదిగా ఉండాలని బలంగా నమ్ముతానని, మంచి జరగకపోయినా చెడు మాత్రం జరగకూడదన్న తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. సామాజిక స్పృహతో చేసిన ఈ రచనలకు పాఠక మహాశయులే న్యాయనిర్ణేతలు! వారి స్పందనే స్ఫూర్తిదాయకం.

దొండపాటు కృష్ణ అభ్యుదయ భావాలున్న "వర్ధిష్ణు" కథా రచయితగా, ఈ కథలు "క్రొత్తపైరు"గా, సి.యస్.గారు పాఠకులకు పరిచయం చేస్తూ "చిన్నకథ చెప్పడం పెద్ద కష్టం" అని చమత్కరించారు. అది అక్షర సత్యం! తొలి విరుపు, మధ్యమలుపు, కొసమెరుపు – ఆ మెరుపును, అందాన్ని, ఒడిసి పట్టగల శైలి, శిల్పం, కథకు పంచప్రాణాలు. క్లుప్తత దాని శరీరం. గుప్తత దాని మనస్సు. ఆప్తత దాని ఆత్మ. సానుభూతి, సహ అనుభూతి, ఆత్మానుభూతి, త్రివేణిలో సంగమించి ఒక రసస్రవంతిగా ప్రవహించి, పాఠక హృదయ క్షేత్రాలను పండిస్తుంది. అదే కథా విజయ రహస్యం!




రాతి గుండెల్లో నీళ్లు (కథలు)
రచన : దొండపాటి కృష్ణ
పే. : 151, వెల : రూ.150/-
ప్రతులకు: రచయిత,
ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

సామాజిక ప్రయోజనం సాధించడానికి రచయిత కలం కథన కౌశలంతో కదం తొక్కాలి. నలుగురి ఆశీస్సులతో అభ్యుదయ రచయిత చేయి తిరిగిన రచయితగా ఎదగడానికి, ఇంతకన్నా బాగా రాయాలన్న తపన కలిగి ఉండాలి. అప్పుడే విజయం వరిస్తుంది. ఆశయం నెరవేరుతుంది.

శీర్షిక, అభివ్యక్తి, సంవిధానం, సందేశం; అనే చతుర్ముఖ వ్యూహంతో ముందుకు సాగితే మునుముందు ఒక మంచి రచయిత కాగల అవకాశం లేకపోలేదు. రాతిగుండెల్లో ప్రవహించే నీళ్లు అంత సులభంగా చేతికి అందవు. పదహారు కథల్లో మొదటిది "మళ్లీ చిగురించారు" అనే దరిద్ర నారాయణుల దీనగాథ. బిచ్చగాళ్లను అడ్డా కూలీలుగా మార్చిన ఒక మానవతావాది సాహస ప్రయోగం! కథానాయకుడు వసంతతో స్నేహితుడు నవీన్ "వాళ్లు మళ్లీ మారిపోతారేమో" అని భయం వెలిబుచ్చినప్పుడు, పాఠకులూ అలాగే స్పందించే అవకాశం ఉన్నది. భిక్షాటనను వ్యాపారంగా చూసేవాళ్లుంటారు. "అలాంటివాళ్లు తిరిగి వెళ్లిపోరని, నిన్ను మోసం చేయరని, గ్యారెంటీ ఏమిటి?" అని నిలదీస్తాడు నవీన్. సహజంగానే, సామాజిక ప్రయోజనం ఎంతవరకు నిజం అన్న సందేహం పాఠకుల హృదయాల్లో భయంగా మారే ప్రమాదం కాదనలేనిది.

చివరి కథ "ఉందిలే మంచికాలం...." పై కథకూ ఒక రకమైన లంకె ఉన్నట్టు అనిపిస్తుంది. "రియల్ ఎస్టేట్" యాజమాన్యం (రియల్ టర్స్) సృష్టించిన బహుళ అంతస్తుల భవన సముదాయపు నీడలో నేడు దరిద్రనారాయణులు తలదాచుకుంటున్న దృశ్యం కళ్లకు కడుతుంది. రాఘవరావు "మార్కెటింగ్ స్ట్రాటజీ' ఒక కాంట్రాక్టుకు ప్రాయోజిత కార్యకలాపం. కాబట్టి ఎలాంటి సామాజిక ప్రయోజనం సాధ్యమో ఊహించడం కష్టం అవుతున్నది.

"రాముడు – భీముడు" సినిమా పాట పాడే బ్రహ్మయ్యతోపాటు, పాంకులూ భవిష్యత్తుపైన ఆశల్ని సజీవంగా ఉంచుకోవాలి. యువరచయితకు హృదయపూర్వక శుభాకాంక్షలు. **– వీఆర్పీ**



# బాలల కోసం శివాజీ చరిత్ర

భారతీయ జీవనం నుంచి క్రమంగా మరుగున పడిన స్వాభిమానం అనే అంశాన్ని హిందూ సమాజంలో పునఃప్రతిష్ఠ చేసినవారు ఛత్రపతి శివాజీ మహరాజ్. శివాజీ జీవితం, పోరాటం, రాజ్య నిర్వహణ భారతదేశ చరిత్రకే వన్నె తెచ్చేవిగా ఉంటాయి. ఆయన చరిత్రను మన బాలలు చదవడం ఎప్పటికీ అవసరమే. ఆ సదుద్దేశంతో వెలువడినదే 'హిందూ స్వరాజ్య తిలక ఛత్రపతి శివాజీ మహరాజ్'. మహారాష్ట్ర వైశిష్ట్యాన్ని చెబుతూ ప్రారంభమయ్యే ఈ పుస్తకం అనేక ఘట్టాలను మన ముందు సచిత్రంగా ఉంచుతుంది. శివాజీ తల్లిదండ్రులు, విద్యలు నేర్పిన గురువులు, ఆధ్యాత్మిక గురువులు, స్ఫూర్తిప్రదాతల గురించి చక్కగా వివరించారు. ప్రధానంగా మరాఠా సంస్కృతీ సంప్రదాయాలను స్పృశిస్తూ ఇది సాగడం మరొక ఆకర్షణ. శివాజీ పాలన ఓ అద్భుతం. ఆయన ముస్లింలను ద్వేషించలేదు. గోల్కొండవారితో సత్సంబంధాలు నెరపారు. అలా అని తన సన్నిహిత హిందువులు తప్పు చేసినా మౌనం దాల్చలేదు. అఫ్జల్‌ఖాన్ హత్య, కోటల స్వాధీనం, తానాజీ గాథ, కులీఖాన్ శుద్ధి వంటి ఘట్టాలను సులభమైన భాషలో ఇచ్చారు. దీనిని తెలుగు, ఇంగ్లిష్‌లలో కూడా చదువుకోవచ్చు. ఈ ఘట్టాల కోసం చిత్రించిన వర్ణచిత్రాలు బాలలను ఎంతో ఆకర్షిస్తాయంటే అతిశయోక్తి కాదు.

**హిందూ స్వరాజ్య తిలక**
**ఛత్రపతి శివాజీ మహరాజ్**
ప్రతులకు: **సాహిత్య నికేతన్,**
హైదరాబాద్, విజయవాడ.
శ్రీశివాజీ మెమోరియల్ కమిటీ
శ్రీశైలం, ఆంధ్రప్రదేశ్
**పే:** 66, **వెల:** రూ. 125/-

# బాలజాగృతి

## తెలుసుకుందాం

## వీరభద్రస్వామి ఆలయం - మాచర్ల



ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మాచర్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి దక్షిణం వైపున ఈ ఆలయం కొలువుదీరింది. శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని మాచర్ల కరణం (దేశ్ పాండ్యా) రామరాజు నిర్మించారు. ఇక్కడ ఇష్టకామేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలు కూడా ఉన్నాయి. వీరభద్రుడి చరిత్ర, భాగవత, రామాయణం, భారతం, గణనాథుని చరిత్రలను అందంగా చిత్రీకరించారు.

## కథ | తెలివితక్కువ కుమారులు!



మీర్జాపురం అనే గ్రామంలో ఒక జమీందారు ఉండేవాడు. ఈయనకు ఇద్దరు కొడుకులు. ఇద్దరూ మూర్ఖులే.

ఒకరోజు పొరుగూరి జమీందారు చనిపోయాడు. ఈయనకి ఒంట్లో బాగాలేక కొడుకులను పిలిచి 'మీరు వెళ్లి పొరుగూరి జమీందారు గారి భార్యను పరామర్శించి రండి' అని చెప్పాడు.

చిన్నవాడు 'నేను వెళతాలే నాన్నా.. అన్నయకు ఎందుకు ఇబ్బంది. కానీ ఏమని పరామర్శించాలి?' అని అడిగాడు.

'అక్కడ నలుగురూ అనే మాటలు విని, అవే అంటే సరిపోతుంది!' అన్నాడు.

చిన్న కొడుకు పొరుగూరికి వెళ్లాడు.

జమీందారు గారి ఇంటికి కొద్దిదూరంలో నలుగురు మనుషులు.. 'చచ్చాడు దుర్మార్గుడు! గ్రామానికి పీడ విరగడ అయ్యింది!' అనడం విన్నాడు.

వాడు జమీందారు గారి ఇంటికి వెళ్లి ఆయన భార్యతో 'అమ్మా, విచారించకండి. చచ్చాడు దుర్మార్గుడు! గ్రామానికి పీడ

## పద్యము

**పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావం :** మనుషులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగుల్లో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాల వారైనా మనసులు ఒకటిగా మసలుకోవాలి. పూవులు వేరువేరు రంగుల్లో ఉన్నా పూజకు వినియోగ పడటంలో అవన్నీ ఒక్కటే గదా!

## సూక్తిరత్నం

'నా నృషిః కురుతే కావ్యం'

**నా దేవాంశో దదాత్యన్నం**
**నా రుద్రో రుద్రమర్చయేత్**
**నా నృషిః కురుతే కావ్యం**
**నా విష్ణుః పృథివీ పతిః**

**భావం :** దేవాంశ లేనివాడు అన్నదానం చేయలేడు. ఈశ్వరాంశలేని వాడు శివునికి అర్చనాదులు నిర్వహించ లేడు. ఋషి కానివాడు కావ్యమల్లలేడు. విష్ణు అంశలేనివాడు భూమిని పాలింపలేడు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| రంగూన్ | మలేసియా |
| సిలోన్ | శ్రీలంక |
| ఢక్కా | థాయ్‌లాండ్ |
| మలయా | ఢాకా |
| సియామ్ | యంగూన్ |

**జవాబులు :** రంగూన్–యంగూన్; సిలోన్–శ్రీలంక; ఢక్కా–ఢాకా; మలయా–మలేసియా; సియామ్–థాయ్‌లాండ్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ఠాకూర్ రోషన్ సింగ్

**(జనవరి 22, 1892 – డిసెంబర్ 19, 1927)**



ప్రముఖ భారత స్వాతంత్ర్య సమరయోధుడు. ఉత్తరప్రదేశ్‌లోని నబాడా గ్రామంలో జన్మించారు. 1921-22 సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. బరేలీ కాల్పుల కేసులో జైలు శిక్ష అనుభవించారు. 1925 ఆగస్ట్‌లో కకోరి కుట్రలో పాల్గొనకపోయినా బ్రిటిష్ ప్రభుత్వం రోషన్‌సింగ్‌కు రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లా ఖాన్, రాజేంద్ర లాహరితో పాటు మరణశిక్ష విధించింది. ఈయనను అలహాబాద్ జిల్లాలోని మలాకా/నాయిని జైలులో ఉరితీశారు.



విరగడైంది.' అన్నాడు.

దాంతో జమీందారు కొడుకులు వాణ్ణి చితకబాదారు.

చిన్నవాడికి జరిగినది తెలిసి వాళ్ల నాన్న పెద్దవాడిని పంపాడు.

పెద్దవాడు వెళ్లి ఆ జమీందారు భార్యతో 'అమ్మా, మా తమ్ముడు అజ్ఞాని. వాణ్ణి క్షమించండి. ఈసారి ఇలాంటిది జరిగితే నేను వచ్చి పరామర్శిస్తాను' అని అన్నాడు.

దాంతో జమీందారు కొడుకులు, అక్కడున్నవారంతా వాణ్ణి కూడా చితకబాది ఇంటికి పంపారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. కాంగ్రా లోయ ఏ రాష్ట్రంలో ఉంది?
2. డా. బి.ఆర్. అంబేడ్కర్ విమానాశ్రయం ఎక్కడుంది?
3. 'పక్షుల ఖండం' అని దేనిని పిలుస్తారు?

జవాబులు : 1. హిమాచల్‌ప్రదేశ్; 2. నాగపూర్ (మహారాష్ట్ర); 3. ఆస్ట్రేలియా.

## మెదడుకు మేత

అడవిలో పుట్టింది,
మేదరింట్లో మెలిగింది,
ఒంటినిండా గాయాలు,
పొట్టనిండా రాగాలు?

జవాబు : వేణువు

## మంచిమాట

సహనం అన్నింటి కన్నా గొప్పది.
కారుచీకట్లలోనూ అది వెలుగు రేఖలు పూయిస్తుంది..




# వారఫలాలు

30 జనవరి- 5 ఫిబ్రవరి 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

తలపెట్టిన కార్యక్రమాలను కొంత నెమ్మదించినా పూర్తిచేస్తారు. ఆత్మీయులనుంచి శుభవార్తలు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడి. వ్యాపారాలు గతంకంటే పుంజుకుంటాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. చేజారిన కొన్నివస్తువులు తిరిగి లభ్యమయ్యే సూచనలు. 4,5 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువులతో విభేదాలు. ఆదిత్యహృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కొత్త కార్యక్రమాలుచేపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కొన్ని సమస్యలు ఎదురైనా చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. ప్రముఖుల నుంచి ముఖ్య సందేశం. మీ నిర్ణయాలను కుటుంబ సభ్యులు ఆమోదిస్తారు. రాజకీయవర్గాలకు ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురౌతాయి. కళాకారులు, శాస్త్రవేత్తలు అనుకున్నది సాధిస్తారు. 30,31తేదీల్లో వృథాఖర్చులు. కుటుంబంలో సమస్యలు. విష్ణు సహస్రనామ పారాయణం చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

నూతన నోత్సాహంతో కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఆర్థికపరిస్థితి గతంకంటే మెరుగ్గా ఉంటుంది. కొన్ని వివాదాలు ఓర్పుతో పరిష్కరించుకుంటారు. ఇంటి నిర్మాణం, కొనుగోలులో అవాంతరాలు అధిగమిస్తారు. ఉద్యోగాలలో సమర్థతను నిరూపించుకుంటారు. పారిశ్రామిక వర్గాలకు అనుకోని ఆహ్వానాలు అందుతాయి. వివాహ, ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. 4,5 తేదీల్లో మానసిక ఆందోళన. ఆరోగ్య సమస్యలు. దేవీస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ అంచనాలు నిజమవుతాయి. ఆర్థిక విషయాలు ఆశాజనకంగా ఉంటాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శ్రమకు తగిన ఫలితం దక్కించుకుంటారు. నూతన ఉద్యోగాన్వేషణ ఫలిస్తుంది. రాజకీయవర్గాలకు విదేశీ పర్యటనలు. కళాకారులు, క్రీడాకారులు సమస్యలనుండి బయటపడతారు. 2,3 తేదీల్లో కుటుంబ సభ్యులతో విభేదాలు. ఆరోగ్యసమస్యలు. ఈశ్వరారాధన మంచిది.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో పురోగతి ఉంటుంది. కోర్టు కేసు ఒకటి పరిష్కారమై ఊరట లభిస్తుంది. వ్యాపారాల విస్తరణలో ముందడుగు వేస్తారు. పారిశ్రామికవర్గాలకు ఊహించని ఆహ్వానాలు అందుతాయి. శాస్త్రవేత్తలు, వ్యవసాయదారులకు ఉత్సాహంగా ఉంటుంది. 31,1 తేదీల్లో కుటుంబ సమస్యలు. మానసిక అశాంతి. ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఎటువంటి సమస్య ఎదురైనా అధిగమిస్తారు. సన్నిహితులతో వివాదాలు సర్దుకుంటాయి. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. ఆర్థిక పరిస్థితి మొదట్లో ఇబ్బంది కలిగించినా క్రమేపీ మెరుగ్గా ఉంటుంది. కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో అనుకూల వాతావరణం.రచయితలు, వ్యవసాయదారుల యత్నాలు ఫలిస్తాయి. 30,31 తేదీల్లో అనారోగ్యం. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఇంతకాలం ఎదురైన కష్టాలు తొలగినట్లే. ఆర్థికంగా మరింత బలపడతారు. ఆలోచనలు అమలు చేస్తారు.ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. ఉద్యోగాలలో సమర్థతను అందరూ గుర్తిస్తారు. రాజకీయవర్గాలకు ఊహించని పదవులు దక్కే అవకాశం. శాస్త్రవేత్తలు, వైద్యులకు నిరాశ తొలగుతుంది. 2,3 తేదీల్లో అనారోగ్యం. దూరప్రయాణాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

మొదట్లో కొన్ని వివాదాలతో సతమతమైనా క్రమేపీ పరిస్థితులు అనుకూలిస్తాయి. ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగాలలో ఉన్నత హోదాలు దక్కవచ్చు.రచయితలు, వైద్యులకు ఊహించని అవకాశాలు. 4,5 తేదీల్లో ఆరోగ్య భంగం. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

మధ్యమధ్యలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. ఆర్థికలావాదేవీలు మరింత పుంజుకుంటాయి. స్థిరాస్తి విషయంలో కొద్దిపాటి సమస్యలు తీరతాయి. గృహనిర్మాణాల్లో అడుగుముందుకు వేస్తారు. రచయితలు, క్రీడాకారులు మరింత ఉత్సాహంగా గడుపుతారు. 31,1తేదీల్లో అనుకోని ఖర్చులు. మానసికాందోళన. గణేశాష్టకంపఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. కొత్త వ్యక్తుల పరిచయం సంతోషం కలిగిస్తుంది. ఆర్థిక విషయాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. సంఘంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. వాహనయోగం. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తలు, వైద్యులసేవలు విస్తృతమవుతాయి. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. మానసికాందోళన. శివాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలను ఆటంకాలు అధిగమించి పూర్తి చేస్తారు. చిన్ననాటి స్నేహితులతో ఆనందాన్ని పంచుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. శత్రువులను కూడా ఆకట్టుకుంటారు. కోర్టు వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. 2,3 తేదీల్లో అనుకోని ఖర్చులు. సన్నిహితులతో విభేదాలు. దూరప్రయాణాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. అనుకున్న కార్యక్రమాలు అవాంతరాల వల్ల ముందుకు సాగవు. ఆస్తి వివాదాలతో సతమతమవుతారు. ఇంటి నిర్మాణాలలో కొంత ప్రతిష్ఠంభన. ఆరోగ్యం మందగిస్తుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. రచయితలు, క్రీడాకారులు కొంత ఓపిగ్గా వ్యవహరించాలి. ఉద్యోగాలలో అదనపు పనిభారం. 1,2 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. ఆదిత్య హృదయం పఠించండి. ★

# పదరసం-401

## ఆధారాలు

**అడ్డం**

1. గాంధీ మన దేశానికి (4)
6. సిగరెట్ బూడిద (2)
7. హిడింబి... జాతికి (3)
9. పుస్తకం కృతి భర్తకు అని ఇవ్వడం (3)
11. చీకటి (2)
13. లేమి (3)
15. అన్నము, తాడి (2)
16. సముద్రము (3)
18. రంగురాయి చివరకు లేదు (3)
22. ఎముక (3)
24. యథాతథంగా ఆరభీ (3)
27. స్త్రీ ఇంటి ముంగిట వేసేది (2)
28. కంచుకము (3)
29. అలారం పెట్టుకున్నాడులే! తనను నువ్వు.... (3)
31. హరిణము, ఇక్షి (2)
32. వితలుడు అంటే పాండు (3)
34. ప్రకృతికి వ్యతిరేకం (3)
35. కొండ (2)
37. అజంతము కానిది ఇదే మరి! (4)

**నిలువు :**

2. భుజించు (2)
3. లోభి (3)
4. ద్వాదశి ముందురోజు (4)
5. నెమలి (2)
8. సంపద, ఐశ్వర్యం (2)
9. ఆకాశం (3)
10. సంగీతానికి శ్రుతి వాద్య పరికరం (3)
12. హరునకు సంబోధన (2)
14. అదుగునుంచి జాగ్రత్త! (2)
17. రాజుగారి భార్య (2)
19. రహస్యం (2)
20. ధరణి (2)
21. యంత్రము (2)
22. నల్ల బంగారం (2)
23. చెయ్యి అనే పద్మం (5)
24. పట్టుదల (3)
25. కురు పితామహుడు (3)
26. ఓ ప్రశంసా పదం! (2)
27. వైతాళికులు కవిత్వ సంకలన కర్త (4)
30. వజ్రాయుధం (2)
33. సింహాసనం (2)
36. పూల తీగె, పాదును అల్లుకునేది (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | ✠ | 1 | 2 | 3 | | ✠ | 4 | ✠ | ✠ |
| ✠ | 5 | ✠ | 6 | | ✠ | 7 | | 8 | ✠ |
| 9 | | 10 | ✠ | 11 | 12 | ✠ | 13 | | 14 |
| | ✠ | 15 | | ✠ | 16 | 17 | | ✠ | |
| 18 | 19 | | ✠ | 20 | ✠ | | ✠ | 21 | ✠ |
| ✠ | | ✠ | 22 | | 23 | ✠ | 24 | | 25 |
| 26 | ✠ | 27 | | ✠ | 28 | | | ✠ | |
| 29 | 30 | | ✠ | 31 | | ✠ | 32 | 33 | |
| ✠ | 34 | | | ✠ | 35 | 36 | ✠ | | ✠ |
| ✠ | ✠ | | ✠ | 37 | | | | ✠ | ✠ |

పదరసం - 401

పేరు : ............................................................................................

చిరునామా:............................................................................................

............................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : .................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఫిబ్రవరి 13 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 397 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 సం | వ | 2 త్స | 3 రం | ✠ | 4 వా | 5 ర | ణా | 6 శి |
| 6 శు | ✠ | ళ్లి | ✠ | గా | ✠ | ✠ | క్ష్మి | ✠ | వా |
| 8 భ | క్తి | ✠ | 9 ధ్వ | జ | స్తం | 10 భం | ✠ | 11 గో | ల |
| లే | ✠ | 12 ఆ | ✠ | మ్మ | ✠ | 13 డ | బ్బ | ✠ | యం |
| 14 ఖ | 15 ర | ము | ✠ | ✠ | ✠ | న | ✠ | 16 దా | ✠ |
| ✠ | 17 వి | ద | ర | ✠ | 18 తి | భే | ✠ | 19 సో | 20 దా |
| 21 రా | ✠ | ము | ✠ | ✠ | ✠ | 22 ము | గ్గు | 24 ✠ | యా |
| 23 జ | డ | ✠ | 24 ప్ర | ష్లో | 25 దు | డు | ✠ | 26 మం | దు |
| నా | ✠ | 27 బొం | ✠ | ✠ | హి | ✠ | 28 జీ | ✠ | లు |
| 29 ల | వ | కు | శ | ✠ | 30 త | లం | బ్రా | లు | ✠ |

**విజేతలు:** విష్ణువరుణ్, ఎం.విజయలక్ష్మి, బి.ఇందుశేఖర్, ఎం.పి.ఎన్.విఠల్-హైదరాబాద్, బి.అలివేల, వి.రామ లింగాచారి, కె.ప్రశాంత్-యాదాద్రి, ఎన్.వి.ఎస్.శర్మ-కోనసీమ, ఆర్.అంజనీదేవి-విజయవాడ, టి.వెంకట శేషయ్య-నెల్లూరు, ఎ.శాంతి, ఎ.అప్పారావు, ఎ.లక్ష్మి, ఎ.విజయలక్ష్మి-తణుకు, వి.ఉమామహేశ్వరశర్మ-అనంతపురం, ఆర్.శేషు-తూర్పుగోదావరి, ఎస్.పూర్ణ కుమారి-ఒంగోలు, పి.సతామహాలక్ష్మి-తిరుపతి, కె.సత్యనారాయణ-విశాఖపట్నం, సి.హెచ్.దేవలక్ష్మి-నిర్మల్, వి.భాస్కరయ్య-చెన్నై, కె.ఎన్.స్వామి-భువనేశ్వర్.

**విజేత : ఎం.పి.ఎన్.విఠల్-హైదరాబాద్**




అరుణ

గడిచిన ఏడాది తెలుగు నుండి వెళ్లిన పాన్ ఇండియా సినిమాల్లో సంచలన విజయం సాధించింది 'ఆర్.ఆర్.ఆర్.' ఒక్కటే. 'రాధేశ్యామ్', 'లైగర్' పరాజయం పాలయ్యాయి. 'కార్తికేయ-2' మోడరేట్ సక్సెస్ అందుకోగా, 'మేజర్' తెలుగులో పాటు హిందీ, మలయాళ భాషల్లో విడుదలై విమర్శకుల ప్రశంసలు పొందింది. ఇక సమంత నటించిన 'యశోద' కన్నడ తప్ప ఇతర నాలుగు భాషల్లో విడుదలై ఫర్వాలేదనిపించుకుంది. 'సీతారామం' కాస్తంత గ్యాప్‌తో హిందీలో విడుదలైంది. గత యేడాది ఐదారు పాన్ ఇండియా సినిమాలే తెలుగు నుండి ఇతర రాష్ట్రాలకు వెళ్లాయి. కానీ ఈసారి అందుకు భిన్నంగా దాదాపు ఇరవై సినిమాలతో పాన్ ఇండియా జాతర జరుగబోతోంది.



# పాన్ ఇండియా చిత్రాల జాతర!

గత యేడాది చివరిలో 'ధమాకా'తో తొలిసారి వంద కోట్ల రూపాయల క్లబ్‌లోనూ, ఈ యేడాది ప్రారంభంలో 'వాల్తేరు వీరయ్య'తో 200 కోట్ల క్లబ్‌లోనూ చోటు దక్కించుకున్నాడు రవితేజ. అతను నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'టైగర్ నాగేశ్వరరావు' ఈ యేడాది విడుదల కాబోతోంది. అలానే రవితేజ, సుశాంత్ నటించిన 'రావణాసుర' చిత్రాన్ని కూడా భారీ స్థాయిలోనే విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా ఏదీ పాన్ ఇండియా స్థాయిలో ఇంతవరకూ విడుదల కాలేదు. ఆ లోటు ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు నిర్మిస్తున్న 'హరిహర వీరమల్లు'తో తీరబోతోంది. 'ఆర్.ఆర్.ఆర్.' తర్వాత రామ్‌చరణ్-శంకర్ కాంబినేషన్‌లో దిల్ రాజు ఓ సినిమా నిర్మిస్తున్నారు. దీన్ని పాన్ ఇండియా మూవీగా ఇదే యేడాది విడుదల చేయబోతున్నారు. ఎన్టీయార్‌తో కొరటాల శివ తీస్తున్న సినిమానూ జాతీయ స్థాయిలో వచ్చే యేడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేస్తారు. 'పుష్ప' సినిమాతో జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు తెచ్చుకున్నాడు అల్లు అర్జున్. దీనికి సీక్వెల్ 'పుష్ప-2' ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. అది కూడా ఇదే ఏడాది జనం ముందుకు రానుంది. 'లైగర్'తో చేదు అనుభవం పొందిన విజయ్ దేవరకొండ, సమంత జంటగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'ఖుషీ' పేరుతో సినిమా నిర్మిస్తోంది. ఇది కూడా పాన్ ఇండియా మూవీనే. అక్కినేని అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి తెరకెక్కిస్తున్న సినిమా 'ఏజెంట్'. ఈ యాక్షన్ స్పై థ్రిల్లర్ మూవీని కూడా ఐదు భాషల్లో విడుదల చేయబోతున్నారు. విశేషం ఏమంటే 'మేజర్'తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ తన తాజా చిత్రం 'గూఢచారి-2'ను, 'కార్తికేయ-2'తో పేరు సంపాదించుకున్న నిఖిల్ 'స్పై' మూవీతోనూ పాన్ ఇండియా రిలీజ్‌కు వెళుతున్నారు.

నిజం చెప్పాలంటే.. ఈ యేడాది తెలుగువారి పాన్ ఇండియా ఫీవర్ ఫిబ్రవరి నుండే మొదలవుతోంది. సందీప్ కిషన్ నటించిన 'మైఖేల్' మూవీ 3వ తేదీ జనం ముందుకు వస్తుండగా, 17వ తేదీన సమంత నటించిన 'శాకుంతలం' విడుదల కాబోతోంది. విశ్వక్ సేన్ నటించి, దర్శకత్వం వహించిన తొలి పాన్ ఇండియా మూవీ 'దాస్ కా ధమ్కీ' మార్చి 3న రాబోతోంది. నాని నటించిన 'అంటే సుందరానికి' సినిమా గత యేడాది హిందీలో తప్ప దక్షిణాది భాషల్లో విడుదలైంది. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'దసరా' మూవీని మార్చి 30న పాన్ ఇండియా రిలీజ్ చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఆ రకంగా ఫిబ్రవరి, మార్చి మాసాల్లో నాలుగు పాన్ ఇండియా సినిమాలు తెలుగు నుండి రాబోతున్నాయి.

కథాబలంతో పాటు కాస్తంత కొత్తదనంతో తెరకెక్కిన సినిమాలు జాతీయ స్థాయిలో విడుదల చేసినా ఆదరణ పొందుతాయని కొన్ని చిత్రాలు నిరూపించాయి. దాంతో యువ కథానాయకులు సైతం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. 'అ', 'కల్కి', 'జాంబిరెడ్డి' చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ వర్మ తొలిసారి ఇండియన్ సూపర్ హీరో కథాంశంతో 'హను-మాన్' మూవీ రూపొందించాడు. తేజ సజ్జా ఇందులో టైటిల్ రోల్ పోషించాడు. ఈ పాన్ ఇండియా మూవీ ప్రచారాన్ని అయోధ్య నుండి ప్రారంభించారు. దీని టీజర్‌కు విశేష ఆదరణ లభించింది. అలానే తరుణ్ భాస్కర్ సరికొత్త కాన్సెప్ట్‌తో 'కీడా కోలా' అనే పాన్ ఇండియా మూవీ చేస్తున్నాడు. వరలక్ష్మీ శరత్ కుమార్‌తో రూపుదిద్దుకున్న 'శబరి' చిత్రం కూడా జాతీయ స్థాయిలో విడుదల కాబోతోంది.

'బాహుబలి'తో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్‌కు 'సాహో, రాధేశ్యామ్' చిత్రాలను చేదు అనుభవాన్ని మిగిల్చినా, అతనితో పాన్ ఇండియా చిత్రాలనే వివిధ భాషలకు చెందిన దర్శకులు, నిర్మాతలు తెరకెక్కిస్తున్నారు. అలా ఓంరౌత్ రూపొందించిన 'ఆదిపురుష్', కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'సలార్' ఇదే యేడాది రాబోతున్నాయి. ఇదిలా ఉంటే దర్శకుడు మారుతీ కూడా ప్రభాస్‌తో 'రాజా డీలక్స్' అనే మూవీ తీస్తున్నాడు. దీనిని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తారో లేదో ఇంకా తెలియదు. నందమూరి కల్యాణ్ రామ్ 'డెవిల్', మంచు మనోజ్ 'వాట్ ది ఫిష్' చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కబోతున్నాయి. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న సినిమా కూడా పాన్ ఇండియా స్థాయిలోనే రాబోతోంది. ఏప్రిల్ 21న రానున్న సాయిధరమ్ తేజ్ 'విరూపాక్ష' కూడా పాన్ ఇండియా మూవీనే. ఇదిలా ఉంటే ఇంతవరకూ పాన్ ఇండియా స్థాయి మూవీలో నటించని మహేశ్ బాబు సైతం రాజమౌళి దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇది ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న మహేశ్-త్రివిక్రమ్ మూవీ తర్వాతే మొదలు కానుంది. ఆ రకంగా తెలుగు హీరోలు, దర్శక నిర్మాతలు ఈ యేడాది పాన్ ఇండియా మూవీస్‌తో జాతీయ స్థాయిలో జాతర సృష్టించబోతున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# రామసేతుకు నష్టం కలిగించకుండా...

రామసేతు వివాదం మళ్లీ తెర మీదకు వచ్చింది. కొన్ని దశాబ్దాలుగా ద్రవిడ పార్టీ డీఎంకే కలల పథకంగా చెబుతున్న 'సేతుసముద్రం' చేపట్టడం గురించి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జనవరి 12న శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ పథకం చేపడితే 50,000 మందికి ఉద్యోగాలు వస్తాయని స్టాలిన్ చెబుతున్నారు. జలమార్గానికి ఉద్దేశించిన పథకమిది. భారత్, శ్రీలంకలను కలిపే జలమార్గమిది. పాక్ జలసంధిని, మన్నారు గల్ఫ్‌ను ఇది కలుపుతుంది. అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ఉన్నప్పుడు తమిళనాడుకు మంజూరు చేసిన ఏకైక జలమార్గ పథకం ఇదేనని స్టాలిన్ గుర్తు చేశారు. వాజపేయి కొంత మేర నిధులు కూడా కేటాయించారని చెప్పారు. అయితే తరువాత రాజకీయ కారణాలతో బీజేపీ ఈ పథకాన్ని వ్యతిరేకించిందని స్టాలిన్ చెప్పారు. దీనికి బీజేపీ సభ్యుడు నాయినార్ నాగేంద్రన్ సమాధానం ఇచ్చారు. తాము సేతు సముద్రం పథకాన్ని వ్యతిరేకించడం లేదని, కానీ రాముడు పాదం మోపిన రామసేతు జోలికి వెళ్లకుండా ఈ పథకం పూర్తి చేస్తే అభ్యంతరం లేదని అన్నారు. ఈ తీర్మానాన్ని మేం సమర్థిస్తున్నాం, కానీ రామార్ వంతెనకు (రామసేతు)కు నష్టం జరిగితే అంగీకరించలేమని అన్నారు. అయితే అన్నాడీఎంకే శాసనసభ్యుడు పొల్లాచి జయరామన్ చేసిన వ్యాఖ్యలు ఈ ఉదంతానికి కొసమెరుపు.

రాములవారిని కల్పిత పాత్ర అని అసెంబ్లీ రికార్డులలో పేర్కొనడం తమను బాధించిందని జయరామన్ సభలో అన్నారు. రాముడికి వందకోట్ల మంది భక్తులు ఉన్న సంగతి విస్మరించడం సరికాదని ఆయన చెప్పారు. రాముడు అవతార పురుషుడని ఇంతమంది విశ్వసిస్తారు కాబట్టి ఆ కల్పితపాత్ర అన్న పదాన్ని తొలగించాలని అన్నాడీఎంకే సభ్యుడు కోరారు.


2005లోనే సేతుసముద్రం పథకానికి ఆరంభమైనా హిందూ సంఘాల అభ్యంతరాల మేరకు ఆగిపోయింది. నిజానికి సేతుసముద్రం పథకానికి వారు అడ్డు చెప్పలేదు. ఈ పథకం వల్ల రాముని పేరుతో ఉన్న సేతువుకు నష్టం వాటిల్లుతుందనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ అనుమానాలను నివృత్తి చేయడానికి బదులు, నాటి డీఎంకే నాయకుడు కరుణానిధి అవాకులూ చెవాకులూ పేలారు. రాముడు కట్టాడంటే ఆయన ఏ ఇంజనీరింగ్ కాలేజీలో పట్టా తీసుకున్నాడంటూ మద్యం మత్తులో ఉన్నట్టు ప్రకటనలు ఇచ్చారు. ఇది సహజంగానే సమస్యను పక్కదోవ పట్టించింది.




From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 15



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.390/-



వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244